ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



విశాఖపట్నం

గురువారం 17 ఆగస్టు 2017 | 16

నేడు నర్సీపట్నంలో మంత్రుల పర్యటన

- అప్‌గ్రేడ్ చేసిన ప్రాంతీయ ఆస్పత్రి సేవలను ప్రారంభించనున్న మంత్రి కామినేని
- వరహాలదొర పార్కులో స్కేటింగ్ రింక్ నిర్మాణానికి శంకుస్థాపన 16
- 356 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాల పంపిణీ



నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రిని పరిశీలిస్తున్న మంత్రి అయ్యన్నపాత్రుడు



ఎంపీ X ఎమ్మెల్యే



ముత్తంశెట్టి, పీలా మధ్య ఓపెన్ వార్

స్వాతంత్ర్య దినోత్సవంనాడు పలుమార్లు ఎంపీపై ఆగ్రహం

పలు కార్యక్రమాలకు తనను ఆహ్వానించడం లేదని పీలా గోవింద సత్యనారాయణ అసహనం

అధికార కార్యకలాపాల్లో ఎంపీ సోదరుడి జోక్యంపై నిలదీత

నామినేటెడ్ పదవుల్లో తన వారికి అన్యాయం జరిగిందని ఆవేదన

అనకాపల్లిలో రెండు వర్గాలుగా చీలిపోయిన టీడీపీ కేడర్

అనకాపల్లి, ఆగస్టు 16: అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం రోజున పలు సందర్భాల్లో ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ ముత్తంశెట్టి దత్తత గ్రామమైన తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో తనకు తెలియకుండా కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని ఎమ్మెల్యే పీలా గోవింద (మిగతా 6వ పేజీలో)

టీమ్ వర్క్‌తో సత్ఫలితాలు



- చేసే ప్రతిపనికీ ముందస్తు ప్రణాళిక
- జిల్లాలో రోడ్డుప్రమాదాలు తగ్గాయి
- మరింత తగ్గడానికి స్టాప్.. వాష్...గో
- మావోలు జనజీవనంలోకి రావాలి
- ఉమ్మడి కృషితోనే గంజాయి కట్టడి
- ఇండియన్ పోలీసు మెడల్‌కు ఎంపిక బాధ్యతలను మరింత పెంచింది 6
- 'ఆంధ్రజ్యోతి'తో ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

ఒక వ్యక్తి ఏ పనీ సంపూర్ణంగా చేయలేడు.. అందరితో కలిసి పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయి. ప్రణాళికాబద్ధంగా కష్టపడితే కొంత ఆలస్యమైనా ఏదో ఒక రోజు గుర్తింపు లభిస్తుంది. పోలీసు శాఖలో టీమ్ వర్క్‌తో అనేక లక్ష్యాలను ఇప్పుడిప్పుడే చేరుకోగలుగుతున్నాం.

-ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

భద్రతా వైఫల్యంతోనే హత్య



- నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్య రస్తోగి
- పది రోజుల్లో పట్టణంలో పరిస్థితులు మెరుగుపరుస్తాం
- ప్రజలకు పూర్తి భరోసా కల్పిస్తాం
- గంజాయి గొడవలే హత్యకు కారణం 6
- త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం

అన్నవరం ఉద్రిక్తం

- వివాదాస్పదంగా కల్యాణ మండపం నిర్మాణం
- శంకుస్థాపనకు సిద్ధమైన టీడీపీ వర్గీయులు
- అడ్డుకున్న వైసీపీ నాయకులు
- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- పోలీసులు రంగప్రవేశం
- చర్చలతో పరిష్కరించుకోవాలని చోడవరం సీఐ సూచన
- నేడు ఇరుపార్టీల నేతలు సమావేశం

చోడవరం పంచాయతీ అన్నవరం గ్రామంలో కల్యాణ మండపం నిర్మాణ విషయమై టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వివాదం తలెత్తింది. ఇరువర్గాల వారు పెద్ద ఎత్తున మోహరించారు. అరుపులు, కేకలతో ఘర్షణకు దిగారు. దీంతో పరిస్థితి అదుపు తప్పింది. పోలీసులు రంగంలోకి దిగారు. సీఐ శ్రీనివాసరావు ఇరు పార్టీ నాయకులతో చర్చలు జరిపి, సమస్యను సామరస్యపూరకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. 10



గొడవపడుతున్న టీడీపీ, వైసీపీ నాయకులు

మహా సంగ్రామం

- జీవీఎంసీ ఎన్నికలకు సన్నాహాలు
- 81 వార్డులుగా నిర్ధారణ
- గెజిట్ నోటిఫికేషన్ జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- అనకాపల్లి వైపు వున్న ఐదు గ్రామాలు విలీనం
- నగరానికి భీమిలికి మధ్య వున్న ఐదు గ్రామాలకు మినహాయింపు 6
- వార్డుల పునర్విభజనకు కసరత్తు మొదలు
- ఫైళ్ల బూజు దులుపుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు
- అక్టోబర్ లేదా నవంబర్‌లో ఎన్నికలు?
- ఆశావహుల్లో కోలాహలం

కొల్లాపుట్టు జలతరంగిణికి కొత్తకళ

- చురుగ్గా కాటేజీలు, రెస్టారెంట్ నిర్మాణం
- పనులను పరిశీలించిన ఐటీడీఏ పీవో
- వచ్చే నెలకల్లా పూర్తి కావాలని ఆదేశం
- జలపాతాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడి

డుంబ్రిగుడ మండలం కొల్లాపుట్టు జలతరంగిణిలో చేపట్టిన కాటేజీ, రెస్టారెంట్, గార్డెన్, రోడ్డు నిర్మాణ పనులను పాడేరు ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి బుధవారం పరిశీలించారు. 16



అర్హులకే అందేలా చూడాలని వినతి

నేతల సిఫారసులు నిలువరించాంటున్న యువత

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం) రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీపి కబురు అందించారు. నిరుద్యోగ యువతకు దసరా నుంచి భృతి అందించనున్నట్టు స్వాతంత్ర్య దినోత్సవ వేదికగా ప్రకటించారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో దూసుకుపోయేలా చేస్తున్న సీఎం.. తమపైనా దృష్టిసారించడం ఎంతో ఆనందాన్నిచ్చిందని నిరు ద్యోగ యువతీయువకులు పేర్కొంటున్నారు. భృతిని అందిం చే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతున్నారు.



భృతితో భరోసా..

ముఖ్యమంత్రి ప్రకటనపై నిరుద్యోగుల్లో ఆనందం

నిరుద్యోగులకు వరం..



నిరుద్యోగ భృతి వల్ల రాష్ట్రంలోని నిరుపేద యువతకు ఎంతో మేలు జరుగుతుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమత మవుతూ ప్రభుత్వోద్యోగాలకు ప్రయత్నిస్తున్న నాలాంటి వారికి కొండంత అండనిస్తుంది. నిరుద్యోగ యువకుడి కనీస అవసరాలను తీర్చేలా ఆ మొత్తం ఉంటే చాలా బాగుంటుంది.

ఎన్.మోహన్, బీటెక్, విజయనగరం

అర్హులకే అందాలి..



విద్యార్హతను పరిగణనలోకి తీసుకుని అర్హులైన ప్రతి నిరుద్యోగికి భృతి అందేలా చూడాలి. రాజకీయ నాయకుల ప్రమేయం ఉండకూడదు. ఎటువంటి రికమండేషన్‌లకు తావు లేకుండా చూస్తే సీఎం ప్రకటన చరిత్రలో నిలిచిపోతోంది.

పి.కిశోర్, బీటెక్, శ్రీకాకుళం

సిఫారసులకు చోటుండకూడదు..



ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. నెలకు రూ.3000-5000 ఖర్చు పెట్టుకుని బయట చదివేందుకు ఇబ్బంది పడుతున్నాను. మాలాంటి వాళ్లకు భృతి అందిస్తే ఇబ్బందులు తప్పుతాయి. అయితే.. ప్రభుత్వ పథకాల్లో మాదిరిగా నేతల సిఫారసులకు తావు లేకుండా చూడాలి.

టి.ఝాన్సీ, బీటెక్, హెచ్‌బీ కాలనీ

నిరుద్యోగ భృతి వల్ల తన లాంటి ఎంతో మంది నిరుపేదలు స్వశక్తితో మరింతకాలం ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నించే అవకాశం ఉంటుందని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆర్.నాగరాజు అభిప్రాయపడ్డాడు. వయసు మీద పడుతున్న తల్లిదండ్రులపై ఆధారపడు తుండడం ఎవరికైనా ఇబ్బందిగా ఉంటుందని, సీఎం నిర్ణయం వల్ల ఎంతోమందికి కొంతలో కొంతైనా ఇబ్బంది తప్పుతుందని పార్వతీపు రానికి చెందిన స్నేహాలత చెబుతున్నారు.



అర్హులకే అందాలి..

అర్హులకు మాత్రమే నిరుద్యోగ భృతి అందేలా చూడాలని పలువురు పేర్కొంటున్నారు.



అనర్హుల కు లబ్ధి చేకూరకుండా ఆధార్ లింక్ చేయాలని, బ్యాంక్ అకౌంట్ వివరాలు కూడా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఉన్నత చదువు పూర్తి చేసి ఖాళీగా ఉన్న ప్రతి నిరుద్యోగికి భృతి ఇస్తే వారికి కొంత ఆధారం లభిస్తుందని పేర్కొంటున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకుంటే చాలా వరకు అర్హులందరికీ మేలు చేకూరుతుందని అభిప్రాయప డుతున్నారు. అర్హులకు సక్రమంగా అందిస్తే ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని రాష్ట్రంలోని నిరుద్యోగ యువత చెబుతున్నారు. ప్రై వేట్ ఉద్యోగాలు చేసేవారు కూడా నిరుద్యోగులుగా నమోదు చేసుకునే అవకాశమున్న నేపథ్యంలో అత్యంత పకడ్బందీగా వ్యవహరించి అసలైన నిరుద్యోగులకు న్యాయం చేయాలని వారంతా కోరుతున్నారు.

కుటుంబ భారం తగ్గుతుంది



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాలాంటి నిరుద్యోగుల కోసం దసరా నుంచి నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది. కుటుంబ పోషణకు చిన్నా చితకా వ్యాపారాలు చేసుకుంటున్నాం. ఈ భృతి కూడా కొంచెం తోడైతే కుటుంబ భారం కొంత వరకు తగ్గుతుంది. నిరుద్యోగ భృతి మాలాంటి నిరుద్యోగులందరికీ వర్తించేలా చూడాలి.

కర్రి సంతోష్‌కుమార్, గ్రాడ్యుయేట్, అనకాపల్లి

సర్వే చేసి అర్హులను ఎంపిక చేయాలి



ఉద్యోగాలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సీఎం చంద్రబాబు ప్రకటించినట్టుగా నిరుద్యోగ భృతిని దసరా నుంచి ఇస్తే కుటుంబ పోషణకు చేదోడు, వాదోడుగా ఉంటుంది. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు సరిగ్గా అందలేదు. ఈ నిరుద్యోగభృతి సరైన పద్ధతిలో సర్వే చేసి అర్హులను ఎంపిక చేయాలి.

బోడా బత్తుల శంకర్రావు, గ్రాడ్యుయేట్ అనకాపల్లి

నిరుద్యోగులకు శుభవార్త



చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నాం. సీఎం చంద్రబాబు దసరా నుంచి నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించడం మాలాంటి నిరుద్యోగులకు శుభవార్త. అయితే రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా సర్వే చేసి నిరుద్యోగులను ఎంపిక చేయాలి. ఇలా చేస్తే మాలాంటి వారికి న్యాయం జరుగుతుంది.

బొబ్బిలి రామారావు, విజయరామరాజుపేట

నిరుద్యోగులకు ఆసరా...



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నిరుద్యోగ భృతి ఎంతో మంది నిరుద్యోగులకు ఆసరాగా ఉంటుంది. దీనివల్ల ఇన్నాళ్ల నిర్లక్ష్యానికి గురైన మాకు భరోసా లభించినట్టు అవుతుంది. ఎటువంటి ఉద్యోగం లేక ఏదో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఎంతో మంది నిరుద్యోగులకు మేలు చేకూరుతుంది.

కె.అచ్చిబాబు, గ్రాడ్యుయేట్, పాడేరు

నిరాటంకంగా కొనసాగించాలి....



నిరుద్యోగులకు భృతి కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. అయితే ఎన్నికల హడావుడిలా కాకుండా.. ఈ పథకాన్ని నిరాటంకంగా కొనసాగించాలి. ఎటువంటి ఆసరా లేని నిరుద్యోగులను మాత్రమే భృతి చెల్లించడానికి ఎంపిక చేయాలి. ఈ విషయంలో ఎటువంటి వివక్ష చూపకూడదు.

కె.సింహాచలం, గ్రాడ్యుయేట్, పాడేరు మండలం

పక్కాగా అమలు చేస్తేనే మేలు



ఎన్నికల్లో ఇచ్చిన హామీ అయిన నిరుద్యోగ భృతిని ఇన్నాళ్ల అమలు చేయకపోవడం విచారకరం. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన మూడున్నరేళ్ల తర్వాత భృతి అమలు చేసేందుకు ముందుకు రావడంపై అసంతృప్తి ఉంది. అయితే చంద్రబాబునాయుడు ప్రకటించినట్టుగా దసరా నుంచి పక్కాగా అమలు చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలి.

కొర్రా సత్తిబాబు, పెడాపల్లి, పెదబయలు మండలం

మధ్య తరగతి యువతకు ప్రయోజనకరం



నిరుద్యోగులకు భృతి చెల్లిస్తామంటూ ముఖ్యమంత్రి ప్రకటించడం ఆనందదాయకం. ఈ మొత్తం కనీసం పోటీ పరీక్షలకు అయ్యే ఖర్చులకైనా ఉపయోగపడుతుంది. దీనివల్ల మధ్య తరగతి, నిరుపేద నిరుద్యోగ యువతీ, యువకులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

-షేక్ రంజాన్ బీబీ, నిరుద్యోగిని, నర్సీపట్నం


కాస్త ఆలస్యమైనా ఇస్తే మంచిదే...



ఎన్నికల్లో ఇచ్చిన ఈ హామీ అమలులో జాప్యం చేశారు. ఇప్పటికైనా నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ప్రకటించడం సంతోషకరం. దీనివల్ల 2012లో ఇంజనీరింగ్‌లో డిప్లొమా చేసిన నాకు మంచి జరుగుతుంది. ప్రస్తుతం అనేక ఉద్యోగ ప్రకటనలు వెలువడుతున్నందున వాటి ఫీజులకు, శిక్షణ తీసుకోవడానికి నిరుద్యోగ భృతి చేదోడువాదోడుగా ఉంటుంది.

బంటు అయ్యప్పస్వామి, నిరుద్యోగి, నర్సీపట్నం

ఎన్నికల హామీగానే మిగిలిపోకూడదు



2014 ఎన్నికల్లో నిరుద్యోగ భృతి చెల్లిస్తామంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం, మూడేళ్ల తర్వాత చెల్లిస్తామనడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ముఖ్యమంత్రి మరలా ఎన్నికల ముందు ప్రకటించడం సందేహాలకు కలిగిస్తున్నది. అయితే ఇచ్చిన మాటకు ముఖ్యమంత్రి కట్టుబడి దసరా నుంచి భృతి చెల్లిస్తే, ఆయనకు రుణపడి ఉంటాం.

-పచ్చికూర సోమశేఖర్, నిరుద్యోగి, కొత్తకోట

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి జి.నాగమణి తెలిపారు. జిల్లాలోని మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎయిడెడ్, మున్సిపాలిటి, ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల్లో పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు దరఖాస్తుకు అర్హులని ఆమె తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత మండల విద్యాశాఖాధికారులకు,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపా .ధ్యాయులు సంబంధిత ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈ నెల22లోగా సమర్పించాలని కోరారు. నేరుగా ఈ కార్యాలయానికిపంపిన ప్రతిపాదనలు పరిగణలోకి తీసుకోమన్నారు. సంబంధిత మండల విద్యాశాఖాధికారులు, ఉప విద్యాశాఖాధికారులు ఈనెల26వ తేదీలోగా తమ కార్యాలయానికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. దరఖాస్తులను www. deovsp.netలో పొందవచ్చని ఆయన చెప్పారు.

సెరిబ్రల్ మలేరియాతో బాలుడికి అస్వస్థత

కేజీహెచ్‌కు వెళ్లలేమంటున్న కుటుంబ సభ్యులు..ఏరియా ఆస్పత్రిలోనే చికిత్స

పాడేరురూరల్: సెరిబ్రల్ మలేరియాతో బాలుడు అస్వస్థతకు గురయ్యాడు. హుకుంపేట మండలం దుర్గం పంచాయతీ దారగెడ్డ గ్రామానికి చెందిన డిప్పల కేశవరావు కుమారుడు డిప్పల సామియల్(10), కుమార్తె డిప్పల సలోమి(8) వారం రోజులుగా జ్వరంతో బాధపడు తున్నారు. బుధవారం బాలుడి పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఇద్దరు చిన్నారులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. చిన్నారులు ఇద్దరికి పరీక్షలు చేపట్టిన వైద్యుడు అనీల్ బాలుడు సామియల్ సెరిబ్రల్ మలేరియాతో బాధపడుతున్నట్టు గుర్తించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యసేవల కోసం బాలుడిని విశాఖ కేజీహెచ్‌కు తరలించాలని కుటుంబ సభ్యులకు వివరించారు. ఇందుకు వారు నిరాకరించడంతో ఎంతగా నచ్చచెప్పినప్పటికీ విశాఖ వెళ్లేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించక పోవడంతో చేసేది లేక స్థానిక ఏరియా ఆస్పత్రిలోనే ఉంచి వైద్య సేవలను అందిస్తున్నారు.



సెరిబ్రల్ మలేరియాతో బాధపడుతున్న బాలుడు సామియల్

నేడు నర్సీపట్నం-తాళ్లపాలెం రోడ్డు విస్తరణకు శంకుస్థాపన

మాకవరపాలెం: నర్సీపట్నం నుంచి తాళ్లపాలెం వరకు జరిగే తారురోడ్డు విస్తరణ పనులకు గురువారం తామరం హైస్కూల్ వద్ద మంత్రి అయ్యన్నపాత్రుడు శంకుస్థాపన చేస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు రుత్తల శేషుకుమర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.30 కోట్లతో నిర్మిస్తున్న ఈ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ సందర్భంగా తామరం హైస్కూల్ వద్ద సాయంత్రం మూడు గంటలకు భారీ బహిరంగసభ జరుగనుందన్నారు. ఈ సభలో ఎన్‌టీఆర్ గృహాలు నిర్మించుకునేవారికి మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి వైద్యఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనువాసురావు, అనకాపల్లి ఎంపీ ముత్యంశెట్టి శ్రీనువాసురావు, ఎంఎల్‌సీలు పప్పల చలపతిరావు,ఎంవిఎస్ మూర్తి పాల్గొంటారని తెలిపారు.



శంకుస్థాపనకు సిద్ధం చేస్తున్న శిలాఫలకం

ఉద్యానవన పరిశోధనా స్థానం భూముల పరిశీలన



టి.వెంకుపాలెం భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ సృజన

అనకాపల్లి: ఉద్యానవన పరిశోధన స్థానం ఏర్పాటుకు సంబంధించి మండలంలోని సంపతిపురం పంచాయతీ పరిధిలో ఉన్న టి.వెంకుపాలెంలోగల భూములను జాయింట్ కలెక్టర్ సృజన బుధవారం పరిశీలించారు. ఉద్యానవన శాఖ పరిశోధన స్థానం ఏర్పాటుకు సంబంధించి సుమారు వంద ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించడానికి టి.వెంకుపాలెం వెళ్లి భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నంబారి శ్రీనువాసరావు మాట్లాడుతూ ఈభూముల్లో స్థానికులు ఎప్పటినుంచో సాగులో ఉన్నారన్నారు. వారికి అన్యాయం జరగకుండా నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం భూముల విలువ పెంచడంతో మార్కెట్ ధర ప్రస్తుతం ఈ ప్రాంత భూములకు ఎంత ధర ఉందో తెలియజేయాలని ఆర్డీవో సూర్యకళను జేసీ ఆదేశించారు. ఈగ్రామం మీదుగా పడమటమ్మ అమ్మవారి గుడికి రోడ్డు నిర్మాణం జరిగిందని,ఆరోడ్డును అలాగే ఉంచి భూసేకరణ చేయాలని సర్పంచ్ శ్రీనివాసరావు కోరారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని భూసేకరణ చేస్తామని జేసీ తెలిపారు. మార్టూరులో క్వారీ లారీలు నడుపుకోడానికి క్వారీ యజమానులు ఏర్పాటు చేసుకున్న రోడ్డును పరిశీలించారు.అప్పలనాయుడు చెరువు ఆక్రమణల ఫిర్యాదుపై పరిశీలన జరపాలని జేసీ సృజన ఆర్డీవో సూర్యకళను,తహసీల్దార్ సత్యనారాయణను ఆదేశించారు.

నిర్మాణ దశలోనే కొట్టుకుపోతున్న రహదారులు

కాశీపట్నం-ఎన్ఆర్ పురం మధ్య రోడ్డుపై అధికారుల పర్యవేక్షణ కరువు

ప్రయాణికులకు తప్పని రవాణా కష్టాలు ● ట్రెంచ్‌లు, కల్వర్టులు నిర్మిస్తే ప్రయోజనం

అనంతగిరి: రహదారులను నిర్మించి గిరిజనులకు రవాణా కష్టాలను తీర్చాల్సిన అధికారులు బాధ్యతను విస్మరించారు. ఫలితంగా గిరిజనులకు రవాణా కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. కొద్దిపాటి వర్షాలు పడినా రహదారి నిర్మాణ దశలోనే కొట్టుకు పోతుండడంతో వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఎన్ఆర్ పురం పంచాయతీ కేంద్రానికి వెళ్లే రహదారిని పరిశీలిస్తే ఇది ఎప్పటకి పూర్తయ్యేనో అని అనిపించక మానదు.

కాశీపట్నం నుంచి ఎన్ఆర్ పురం పంచాయతీ కేంద్రం వరకు సుమారు 9కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి 2012లో పంచాయతీరాజ్‌శాఖ రూ.3.5కోట్లతో టెండర్లు పిలిచింది. ఈ రహదారి నిర్మాణానికి 2013లో అగ్రిమెంటు చేయించుకున్న కాంట్రాక్టర్ అటవీశాఖ అనుమతులు లభించకపోవడంతో 2016 వరకు రహదారి నిర్మాణ పనులను ప్రారంభించలేదు. ఎట్టకేలకు 2016 ఫిబ్రవరి లో పనులు ప్రారంభించినా నేటికీ పూర్తి కాలేదు. గ్రేడియంట్ కరెక్షన్ (బాగా ఎత్తు ఉంటే తగ్గించే ప్రక్రియ) ఎక్కువగా ఉండడం వల్ల దానిని తగ్గించి రహదారి నిర్మాణం చేపట్టారు. అయితే వరద బీభత్సం ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉండడంవల్ల రహదారి నిర్మాణ పనులు జరుగుతుండగానే వరదలకు రోడ్డు కొట్టుకు పోతుండడంపై స్థానికులు, వాహనచోదకులు సంబంధిత పంచాయతీ రాజ్ అధికారులపై మండిపడుతున్నారు. నీటి ప్రవాహం ఉన్న చోట్ల కల్వర్టు నిర్మించడం లేదని రహదారికి ఇరువైపులా వరదనీరు పోయే విధంగా చర్యలు చేపట్టడంలేదని కాంట్రాక్టరు, అధికారులు కలసి రహదారి నిర్మాణాన్ని సక్రమంగా చేపట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రహదారి పై క్రషర్ డస్టు వేశారు. అయితే అది కూడా వర్షాలకు కొట్టుకు పోయింది. అదే వరద ప్రవాహం ఉన్న చోట కల్వర్టులు నిర్మించి రహదారికి ఇరువైపులా వరదనీరు పోయే విధంగా సీసీ ర్యాంపులు, ట్రెంచ్‌లు నిర్మిస్తే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి కూడా కేవలం ఎన్ఆర్ పురం పంచాయతీ కేంద్రం వరకే నిర్మించారని.. ఎన్ఆర్ పురం తరువాత గ్రామాలైన సీతారామపురం, కోటపర్తి, పెదకోనెల వంటి గ్రామాలకు రహదారి మంజూరు చేయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారి నిర్మాణంలో వరద ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో సీసీ ర్యాంపులు, కల్వర్టులు నిర్మించాలని కోరుతున్నారు.





నిర్మాణ దశలోనే కొట్టుకుపోయిన ఎన్ఆర్ పురం రహదారి దుస్థితి ఇది

ప్రమాదభరితంగా ఎండినచెట్లు



కించాయిపుట్టు రహదారిలో ఎండిన వృక్షం

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు-జోలాపుట్టు వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి కించాయిపుట్టు సమీపంలో రోడ్డు పక్కన భారీ వృక్షం ప్రమాద భరితంగా ఉంది. వృక్షం పూర్తిగా ఎండిపోయి ఎప్పుడు కూలిపోతుందో అన్నట్టుగా ఉంది. నిత్యం ఈ మార్గంలో అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏ మాత్రం వాహనం ఈ చెట్టు వద్దకు వచ్చే సమయంలో చెట్టు కూలిపోతే భారీ ప్రమాదం తప్పదు. చెట్టు కింద భాగం అంతా కుళ్లిపోయి ఏ క్షణమైనా నేలకు ఒరిగేలా దర్శనమిస్తోంది. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి చెట్టును తొలగించకపోతే భారీ ప్రమాదంతో పాటు ప్రాణ నష్టం సైతం తప్పదు. ఏది ఏమైనా ప్రస్తుతం అటుగా రాకపోకలు చేసే వారంతా భయం భయంగానే ప్రయాణాలు చేస్తున్నారు.

పన్నెడ- సీకరి రోడ్డు మరమ్మతులు చేయాలి

పెదబయలు: మండలంలోని పన్నెడ నుంచి సీకరి వరకు ఉన్న అధ్వాన్నంగా ఉన్న రహదారి పూర్తిని మరమ్మతులు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైందని, తక్షణమే మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు దృష్టి సారించాలని కోరారు. కొన్ని చోట్లా పూర్తిగా గోతుల మయమై చెరువులను తలపిస్తుంటే, మరికొన్ని చోట్లా రాళ్లుపైకి తేలి కాలినడకతో రాకపోకలు సాగించేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఈ రహదారిపై ఆధారపడి రాకపోకలుసాగిస్తున్న ఐదు పంచాయతీలు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ రోడ్డును నేటికీ ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతోనే ప్రస్తుతం పూర్తిస్థాయిలో మరమ్మతులు గురైందన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి సీకరి రహదారిని మరమ్మతులు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కొండ నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

పాడేరు రూరల్: వంట చెరకు కోసం కొండకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడిన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు బుధవారం ఏరియా ఆస్పత్రికి తీసకురాగా, మెరుగైన వైద్య సేవల కోసం కేజీహెచ్‌కు వెళ్లాలని వైద్యులు సూచించారు. హుకుంపేట మండల కేంద్రానికి చెందిన సమిడ మత్స్యరాజు(47) బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని కొండకు వెళ్లి వంటకు కట్టెలు సేకరించారు. కట్టెలతో తిరిగి వస్తున్న సమయంలో కొండపై కాలు జారి పడిపోయాడు. దీంతో అతని ఎడమ కాలు విరిగిపోయింది. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకు వచ్చారు. కాలు విరిగిపోవడంతో మత్స్యరాజుకు మెరుగైన వైద్య సేవలు అవసరమని వైద్యులు గుర్తించారు. దీంతో విశాఖ కేజీహెచ్‌కు వెళ్లాలని వారు సూచించారు.

తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె

● జీతాలు పెంచాలని ప్రధాన డిమాండ్

అరకురూరల్: తమకు జీతాలు పెంచాలంటూ తపాలా శాఖ దేశ వ్యాప్తంగా సమ్మెబాట పట్టారు. ఇదే క్రమంలో స్థానిక సబ్‌పోస్టాఫీసు పరిధిలో ఉన్న మూడు మండలాలకు చెందిన తపాలా సిబ్బంది బుధవారం నుంచి నిరవధిక సమ్మెకు ఉపక్రమించారు. మూడు మండలాల పరిధిలో ఉన్న 39 పోస్టాఫీసులకు చెందిన సుమారు 70 మందికి పైగా బీపీఎం, డెలివరీ ఏజెంట్లంతా సమ్మెలో పాల్గొన్నారు. ఇందులో భాగం సబ్‌పోస్టాఫీస్ ఎదుట నిరవధిక సమ్మెకు దిగి తమ డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని నినాదాలు చేశారు. ముఖ్యంగా పే కమిటీ రిపోర్టు సిద్ధం చేసినా ప్రభుత్వానికి నివేదించలేదని ఆరోపించారు. తక్షణం నివేదిక ప్రభుత్వానికి సమర్పించాలని, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణం తగు చర్యలు చేపట్టాలన్నారు. నిరసనలో అరకు డివిజన్ గ్రామీణ డాక్ సేవక్స్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, ఎస్.ప్రసాద్, కె.సుందర్‌రావు, బి.గుండు పాల్గొన్నారు



అరకు సబ్‌పోస్టాఫీస్ ఎదుట నినాదాలు చేస్తున్న తపాలా సిబ్బంది

భూ బదలాయింపు చట్టం ఉల్లంఘిస్తే చర్యలు

పాడేరు ఆర్డీవో వేణుగోపాల్ హెచ్చరిక

చింతపల్లి: ఏజెన్సీలో భూ బదలాయింపు చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పాడేరు ఆర్డీవో వేణుగోపాల్ హెచ్చరించారు. మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. అంతర్ల, రౌరింతాడ, లంబసింగి గ్రామాల్లో వివాదాస్పద భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ఏజెన్సీలో భూ బదలాయింపు చట్టం అమలుల్లో ఉందని, గిరిజనేతరులు భూములను కొనుగోలు చేయడం, విక్రయిండం చెల్లదని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులకు భూములపై ఎటువంటి హక్కు లేదని ఆయన పేర్కొన్నారు. లంబసింగిలో కోర్టు పరిధి విచారణలో ఉన్న భూముల్లో నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఆయా భూముల్లో ఎటువంటి పనులు నిర్వహించకూడదని చెప్పారు.

మావోయిస్టు బాధితులకు భూముల పంపిణీ

సీపీఐ మావోయిస్టుల కారణంగా నష్టపోయిన బాధితులకు ఇళ్ల స్థలాలు, సాగు భూములను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో వేణుగోపాల్ తెలిపారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 63లో ఉన్న 73 ఎకరాల భూములను ఒక్కొక్క కుటుంబానికి రెండు, మూడు ఎకరాల చొప్పున పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభా అవార్డును పొందిన ఆర్డీవోను తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఎంఈవో ప్రసాద్, గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు యూవీ గిరి, గెమ్మెలి మోహన్ తదితరులు సన్మానించారు.

కషాయం తయారీ యంత్రాల పంపిణీ

ప్రకృతి వ్యవసాయానికి దోహదం: ఏడీ శంకరరెడ్డి

పాడేరు రూరల్: మండలంలో ఏర్పాటు చేసిన నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ (ఎన్‌పీఎం) దుకాణాలకు కషాయం తయారీ యంత్రాలను పూర్తి రాయితీపై పంపిణీ చేస్తున్నట్టు వ్యవసాయ శాఖ ఏడీ పి.శంకరరెడ్డి తెలిపారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయానికి ఉపయోగపడే ఈ యంత్రం విలువ రూ.31 వేలు ఉంటుందని చెప్పారు. మండలంలో కందమామిడి, వంజంగి, మినుములూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఈ దుకాణాలకు యంత్రాలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. పంటలకు పురుగుల మందులకు బదులుగా ఈ యంత్రాలతో ప్రకృతిలో లభించే వివిధ ఆకులతో కషాయాన్ని తీసి చల్లితే పురుగు సమస్య తీరుతుందన్నారు. ఈ యంత్రాలను గిరిజన ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామానికి చెందిన మాసాడి కొండలరావుకు బుధవారం రాయితీపై పవర్ టిల్లర్‌ను అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఎం.సూర్యనారాయణనాయుడు, ఎ.నూకశ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎన్‌పీఎం దుకాణాలు అందించన్ను యంత్రాలతో ఏడీ, ఏఈవో

క్రమశిక్షణతో కూడిన విద్య అందించండి

ఉపాధ్యాయులకు ఐటీడీఏ పీవో పట్టాన్ శెట్టి సూచన ● గన్నెల ఆశ్రమ పాఠశాలలో తనిఖీ

అరకురూరల్, ఆగస్టు 16: గన్నెల టీడబ్ల్యూ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలను పాడేరు ఐటీడీఏ పీవో రవి పట్టాన్‌శెట్టి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను, విద్యార్థుల మూమెంట్ రిజిష్టర్‌ను పరిశీలించారు. అధికశాతం మంది విద్యార్థులు లేకపోవడం, రిజిష్టర్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ సక్రమంగా అమలు అవుతున్నదా అంటూ బాలికలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను అనవసరంగా ఇళ్లకు పంపవద్దని, వసతిగృహంలో ఉండి చదువుకునేలా క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు.

అంతకు ముందు అరకులోయ విచ్చేసిన పీవో రవి పట్టాన్ శెట్టి అక్కడ నుంచి గన్నెల చేరుకున్నారు. అక్కడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేపట్టారు. ఆస్పత్రి అంతా పరిశుభ్రంగా ఉండటంపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో ఆస్పత్రిలో ఉన్న ప్రయోగశాల (ల్యాబ్)ను పరిశీలించారు. రక్తపరీక్షల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అవసరమైన సిబ్బందిని నియమించామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు చక్కటి వైద్యసేవలను అందించాలని సిబ్బందికి ఈ సందర్భంగా ఆయన సూచించారు.



ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయినితో మాట్లాడుతున్న పీవో పట్టాన్‌శెట్టి


గన్నెల పీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో


మాట్లాడుతున్న సీతంపేట గ్రామస్థులు

ఉపాధి బకాయిలు చెల్లించాలి

● సీతంపేట గ్రామస్థుల డిమాండ్

అనంతగిరిరూరల్: చేసిన పనికి చెందిన ఉపాధి కూలీ సొమ్ము వెంటనే అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కాశీపట్నం పంచాయతీ సీతంపేట గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశమై బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. గడిచిన 11 వారాలుగా గ్రామంలో పలు ఉపాధి పనులు చేశామని, అయినా నేటి వరకు కూలీ సొమ్ము ఇవ్వలేదని రాకోటి అప్పన్న, రాకోటి చిన్నయ్య తదితరులు తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతున్నాయని విత్తనాలు, ఎరువులు వంటివి కొనుగోలు చేయడానికి డబ్బులు లేక అప్పులు పాలవుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు ఉపాధి బకాయిలు చెల్లించాలన్నారు. లేకుంటే ఆందోళన బాటపడతామని వారు హెచ్చరించారు.

లక్ష్మీపేటలో 'గ్రావిటీ' పూర్తిచేయాలి

సర్పంచ్ సొనాయి కమలమ్మ విజ్ఞప్తి

పెదబయలు, ఆగస్టు 16: మండలంలోని లక్ష్మీపేట పంచాయతీ కేంద్రంలోని గ్రావిటీ పథకం పనులు పూర్తి చేయాలని ఆ పంచాయతీ సర్పంచ్ సొనాయి కమలమ్మ కోరారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. పంచాయతీ కేంద్రంలో నిర్మాణం చేపడుతున్న గ్రావిటీ నీటి పథకం పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్రమైన తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాల క్రితం రూ. 42 లక్షలు వెచ్చించి నిర్మాణం ప్రారంభించిన తాగునీటి పథకం నేటికీ పూర్తికాకపోవడం విచాకరమని ఆమె సంబంధిత అధికారులపై మండి పడ్డారు. ప్రభుత్వం తాగునీటి పథకాలకు నిధులు వ్యయం చేస్తున్నా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, ఇష్టారాజ్యం కారణంగా పూర్తికావడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తాగునీటి పథకంను పర్యవేక్షించి నిర్మాణం పూర్తి చేయించి గిరిజనులకు తాగునీటిని అందించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

నకిలీ కానిస్టేబుల్ వ్యవహారంలో..

ముగ్గురిపై కేసు నమోదు

సీలేరు: నకిలీ ఎక్సైజ్ కానిస్టేబుల్ వ్యవహారంపై ఎస్‌ఐ విభూషణ రావు చర్యలు చేపట్టారు. ధారకొండలో సోమవారం ఎక్సైజ్ కానిస్టేబుల్‌నని చెప్పి కొంత మంది సారా తయారీదారుల వద్ద వసూళ్లు చేసిన చేయడం, అనుమానం వచ్చి బాధితులు నిలదీయగా ఆగంతుకుడు పోలీసు దుస్తులు, ఆధార్ కార్డు విడిచి వెళ్లడం పాఠకులకు తెలిసిందే. దీనిపై మంగళవారం ఎక్సైజ్ ఎస్‌ఐ విచారణ చేపట్టారు. చాకీరేవుగెడ్డకు చెందిన కిముడు సీతమ్మ, కిముడు బుద్రాల నుంచి నకిలీ ఎక్సైజ్ కానిస్టేబుల్ రూ.3000 అపహరించుకుపోయారని, ఈ వ్యవహారంలో చింతపల్లి మండలం కిన్నర్లకు చెందిన లంబసింగి శివతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నారని వీఆర్‌ఏ బాబూలాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లంబసింగి శివతో పాటు మరో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ విభూషణరావు తెలిపారు.

సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలి

జి.మాడుగుల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ మండల కార్యదర్శి కళ్యాణం సూచించారు. మండల కేంద్రంలో బుధవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో పాటు పడుతున్నదని చెప్పారు. అలాగే గిరిజనుల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నదన్నారు.

వయోవృద్ధులకు పింఛన్లు పెంచాలి

అరకులోయ వైసీపీ సమన్వయ కర్త శెట్టి ఫాల్గుణ

డుంబ్రిగుడ: ప్రస్తుతం వృద్ధులకు అందిస్తున్న పింఛన్ రూ.వెయ్యి నుంచి రూ. రెండు వేలకు పెంచాలని..అరకులోయ వైసీపీ సమన్వయ కర్త శెట్టి ఫాల్గుణ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం పర్యటించిన ఆయన వయోవృద్ధులతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. వయోవృద్ధులకు పింఛన్లు పెంచడంతో పాటు కంటి ఆపరేషన్లు చేసి కళ్లజోడు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధ మహిళలపై కనీసం జాలి చూపడం లేదన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వస్తే వృద్ధులకు రూ. రెండు వేలు వరకు పింఛన్ పెంచుతామని తమ పార్టీ అధినేత పేర్కొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వి.జమున, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎం.శ్రీరాములు, డుంబ్రిగుడ, హుకుంపేట వైసీపీ మండల అధ్యక్షుడు సొర్పు, కొండబాబు పాల్గొన్నారు.

'అవుట్‌పోస్టులపై ఎందుకంత శ్రద్ధ'

సీలేరు: ఆదివాసీలకు ఉపయోగం లేని పోలీసు అవుట్‌పోస్టుల ఏర్పాటుపై ప్రభుత్వం ఎందుకు శ్రద్ధ తీసుకోవడమని ధారకొండ సర్పంచ్ రాజుఏసువరరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకర విష్ణుమూర్తి ప్రశ్నించారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ, గూడెంకొత్తవీధి మండలంలో అనేక పంచాయతీల పరిధిలోని గ్రామాలకు కనీస సదుపాయాలు కూడా లేవని, వాటిపై దృష్టిసారిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. రహదారి, తాగునీరు, విద్య, వైద్యం తదితర సదుపాయల లేమితో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల గ్రామాల్లో పాఠశాలలను ఎత్తి వేయడంతో గిరిజన పిల్లలు విద్యకు దూరమై పోతున్నారని వాపోయారు.

కాఫీ, సిల్వర్ ఓక్ పెంపకానికి ప్రత్యేక చర్యలు

● మండలాభివృద్ధి అధికారి రమేష్‌రామన్

అనంతగిరి: మండలంలో కాఫీ, సిల్వర్ ఓక్ తోటల పెంపకానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మండలాభివృద్ధి అధికారి రమేష్‌రామన్, సూపరిండెంట్ కుమార్ అన్నారు. పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల ప్రకారం మండలంలో వెయ్యి ఎకరాల కాఫీ తోటలు, 15 వందల ఎకరాల్లో సిల్వర్ ఓక్ తోటలను పెంచాల్సి ఉందన్నారు.

ఇందులో భాగంగా టోకూరు పంచాయతీలో బుదవారం కాఫీ మెక్కలను నాటారు. కాఫీతో ఆర్థికంగా నిలదొక్కుకోవడం సాధ్యమవుతుందన్నారు. తోటలో రైతు చేసే ప్రతీ పనికి ఉపాధి హామీ పథకంలో భాగంగా చెల్లింపులు జరుగుతాయని అన్నారు. అనంతరం మండలకేంద్రంలో ఫీల్డు అసిస్టెంట్‌లతో సమావేశం అయ్యారు. కాఫీ సాగుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని 100 ఎకరాల్లో కాఫీ తోటలు పెంచే విధంగా ఫీల్డు అసిస్టెంట్‌లు జాగ్రత్త వహించాలన్నారు. అలాగే 15 వందల ఎకరాల్లో సిల్వర్ ఓక్ తోటలు పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

ఈ కార్యక్రమంలో టోకూరు సర్పంచ్ సార సోము, ఏపీవో శ్రీనివాస్ ఈసీ పవన్ పాల్గొన్నారు.


కాఫీ మొక్కలను నాటుతున్న సూపరింటెండెంట్ కుమార్

అరకులోయలో ఆయుష్ ఉచిత వైద్య శిబిరం

అరకురూరల్: అరకులోయలో రెండు బాలబాలికల ఆశ్రమోన్నత పాఠశాలల్లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని.. విశాఖకు చెందిన ఆయూష్ వైద్యులు వి.సౌభాగ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా 1200 మంది విద్యార్థులకు సీజనల్ వ్యాధుల నివారణ మాత్రలను పంపిణీ చేశామన్నారు. అరకులోయలో ఉన్న టీడబ్ల్యు బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో హెచ్‌ఎం జానకి ఆధ్వర్యంలో బాలికలందరికీ ఉచితంగా వ్యాధి నివారణకు సంబంధించిన మాత్రలను పంపిణీ చేశామన్నారు.

పీటీజీ బాలురు ఉన్నత ఆశ్రమ పాఠశాలలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మాత్రలను పంపిణీ చేశామన్నారు. మూడు రోజుల కోర్సుకు సంబంధించి ఒక్కో విద్యార్థికి 15 మాత్రలను పంపిణీ చేశామన్నారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ వి.సుమలత ఆయూష్ ఆస్పత్రి పార్మసిస్ట్ శంకర్, సిబ్బంది సత్యనారాయణ, ఆయా పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలతో టీచర్స్ పాల్గొన్నారన్నారు.


విద్యార్థులకు వ్యాధి నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న వైద్యులు

టీమ్ వర్క్‌తో సత్ఫలితాలు

ఆంధ్రజ్యోతితో ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

గెలుపు పాఠం..

'ప్రతి వ్యక్తి జీవితంలో కష్టపడతారు. అయితే ఫలితాలు ఒకేసారి రావు. ఆశించకూడదు. కానీ అందరూ కలిసి పనిచేస్తే మాత్రం ఫలితాలు కాస్త ముందుగానే వస్తాయి. ఎటువంటి పనైనా సులభతరం అవుతుంది. జిల్లా పోలీసు శాఖకు ఇండియన్ పోలీసు మెడల్ రావడమే దీనికి ఉదాహరణ'. అని ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ అన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.. ఒడిశాలోని కటాఫ్ ఏరియా రామ్‌గడ్‌లోని మావోయిస్టుల ఎదురుకాల్పుల్లో పోలీసు శాఖలో అన్ని విభాగాలు కలిసి ఉమ్మడి ప్రణాళికతో పనిచేసి అనుకున్నది సాధించగలిగాం. ఇది ఏ ఒక్కరి విజయం కాదు.. టీమ్ వర్క్. ఫలితంగా సాధించిన గెలుపు పాఠంగానే భావించాలి.

మావోల కదలికలు లేవని చెప్పలేం..

మన్యంలో రామ్‌గడ్ ఎదురు కాల్పుల తరువాత మావోయిస్టులు లేరని చెప్పలేం. పెద్ద లీడర్‌షిప్ లేకపోయినా కొందరు సానుభూతిపరులు అక్కడక్కడా చిన్నచిన్న సంఘటనలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లోని గ్రామాల్లో వారి కదలికలపై నిఘా కొనసాగుతోంది. మావోయిస్టు జాంగ్రి కుమారుడు బుజ్జిబాబు ఇటీవల మళ్లీ మావోయిస్టులతో కలిసి పనిచేయాలని ప్రయత్నించాడు. ఆయన్ని ఇటీవల అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చాం. మావోయిస్టులతో కలిసి పనిచేస్తే నష్టపోతారని హెచ్చరించాం. రాళ్లగెడ్డ, రూడకోటల్లో పోలీసు అవుట్‌పోస్టులు కొనసాగుతున్నాయి. తూరుమామిడిలో మరో అవుట్‌పోస్టు పెట్టేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. త్వరలోనే భవన నిర్మాణానికి పనులు చేపడతాం.

జనజీవనంలోకి రావాలి

మావోయిస్టులు కాలం చెల్లిన సిద్ధాంతాలను నమ్ముకొని పోరాటాల పేరుతో విధ్వంసాలకు పాల్పడుతున్నారు. గతంతో పోల్చుకుంటే మావోల విధ్వంసాలు తగ్గినా అక్కడక్కడా కొన్ని చర్యలకు పాల్పడుతున్నారు. ఇటీవల మావోయిస్టుల వారోత్సవాలు ముగిశాయి. పోస్టర్లు, బ్యానర్లు అతికించడం మినహా ఎక్కడా పెద్ద సంఘటనలు జరగలేదు. మావోయిస్టులు జనజీవనంలోకి రావాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. గతంలో పనిచేసిన, ప్రస్తుతం ఉన్న మావోయిస్టు నేతలపై రూ.5 లక్షలు నుంచి రూ.25 లక్షలు వరకు రివార్డులు ప్రకటించాం. లొంగిపోయేవారికి పోలీసు శాఖ అండగా ఉండి, ప్రభుత్వ పథకాలు అందేలా సహకరిస్తాం.

గంజాయ్‌పై ఉమ్మడి కృషి అవసరం

జిల్లాలో ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణా పెద్దఎత్తున సాగుతోంది. దీనికి పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల ఉమ్మడిగా పనిచేయాల్సి ఉంది. పోలీసు సిబ్బంది నిర్వహించే తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నాం. త్వరలోనే మూడు శాఖలతో ఉమ్మడి సమావేశం నిర్వహించి గంజాయి తోటల పెంపకందార్లు, రవాణాపై దృష్టి నిలుపుతాం.

ప్రమాదాల నివారణకు స్టాప్ వాష్‌గో...

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు గతంతో పోల్చిచూస్తే తగ్గుముఖం పడుతున్నాయి. ఇప్పటికే జాతీయ రహదారుల పక్కన మద్యం దుకాణాలను ప్రభుత్వమే తొలగించింది. ఇక ఉన్నవి దాబాలే. రాత్రిపూట భోజనం, అల్పాహారం తీసుకునేందుకు దాబాల వద్ద లారీలు నిలపడం వల్ల వెనుక నుంచి వేరొక వాహనం ఢీకొట్టి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. స్టాప్ వాష్‌గో... నినాదంతో నక్కపల్లి టోల్‌గేటు వద్ద పోలీసుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ రాత్రి పూట లారీ డ్రైవర్లకు నీళ్ల అందజేసి ముఖం కడుక్కొని రిఫ్రెష్ అయి వెళ్లేలా ఏర్పాట్లు చేశాం. 2016 జూలై నెలాఖరు వరకు జిల్లాలో 74 కిలోమీటర్ల పొడవున జాతీయ రహదారిలో వేర్వేరుచోట్ల జరిగిన ప్రమాదాల్లో 220 రోడ్డు ప్రమాదాలు జరిగితే 2017 జూలై నెలాఖరుకు 210 ప్రమాదాలే జరిగాయి. గతేడాది 9 మంది మృతి చెందితే, ఈ ఏడాది మూడు మరణాలే సంభవించాయి. ప్రమాదకర కూడళ్లలో సోలార్ బ్లింకింగ్ లైట్లను ఏర్పాటు చేశాం.

హైవే పెట్రోలింగ్ సిబ్బంది పనితీరుపై నిఘా...

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. 8 మొబైల్ వాహనాలతో రాత్రంతా సిబ్బంది హైవే పెట్రోలింగ్‌లో ఉంటారు. కొత్తగా అందించిన పోలీసు వాహనాలకు జీపీఎస్ సిస్టమ్ ద్వారా మోనటరింగ్ చేస్తున్నాం. ప్రతి వాహనం కనీసం పది కిలోమీటర్ల పరిధిలో నిత్యం తిరుగుతూ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఏదైనా వాహనం ఒకేచోట పది నిమిషాలు ఆగితే ఎస్పీ కార్యాలయానికి, సంబంధిత డీఎస్పీలకు సమాచారం వెళుతుంది. దీనికి పెట్రోలింగ్ వాహనంలో ఉన్న సిబ్బంది సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. అంతేకాకుండా గతంలో చోరీలకు పాల్పడిన వ్యక్తులపై నిఘా కొనసాగుతోంది. పోలీసుకు ప్రత్యేకంగా ఆండ్రాయిడ్ మొబైల్స్ అందించాం. గతంలో చోరీలకు పాల్పడిన దొంగల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి పోలీసులు సెల్ఫీలు తీసుకొని పంపాల్సి ఉంటుంది. దీనివల్ల పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని రుజువు అవుతుంది. జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో నేరాల అదుపు, కేసుల నమోదుపై నెలనెలా సమీక్ష నిర్వహిస్తున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణకు స్టేషన్ల వారీగా కేసుల నమోదు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయాలని ఆదేశించాం.

ఎంపీ X ఎమ్మెల్యే

(1వ పేజీ తరువాయి)

జీర్ణించుకోలేకపోయారు. దీనిపై కశింకోట మండల కార్యాలయంలో నాయకులందరూ ఉన్నప్పుడు ఆయన మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాయల మురళీపై నిప్పులు చెరిగారు. అలాగే తమ కార్యాలయానికి(ఎంపీ ఆఫీస్) ఎందుకు సమాచారం ఇవ్వలేదని జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ సుభానీని ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోదరుడు మహేష్ నిలదీయగా, అదే సమయంలో ఎంపీ కూడా సుభానీనిపై ఆగ్రహం వ్యక్తం చేయడాన్ని ఎమ్మెల్యే పీలా తప్పుపట్టారు. "మీ ఇద్దరిలో ఎంపీ ఎవరు?" అని ఎమ్మెల్యే అడిగేసరికి ఎంపీ అవాక్కయ్యారు. గతంలో కూడా ఎంపీ సోదరుడు ముత్తంశెట్టి మహేష్‌ను ఎమ్మెల్యే పీలా తక్కువ చేసి మాట్లాడాడని, ఆ సందర్భంలో కూడా ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరిగిందని ప్రచారం సాగింది.

ఇదిలావుండగా అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో టీడీపీ క్యాడర్ రెండు వర్గాలుగా చీలిపోయిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నామినేటెడ్ పదవుల విషయంలో తన వారికి మొండి చెయ్యే మిగిలిందని ఎమ్మెల్యే భావిస్తున్నట్టు తెలిసింది. ఎంపీ ముత్తంశెట్టి వర్గీయులకు మంచి పదవులు లభించగా, ఎమ్మెల్యే వర్గీయులను భక్తజన సేవా మండలి సభ్యులు వంటి పదవులు ఇచ్చి సరిపుచ్చడంతో క్యాడర్‌లో పలువురు ఎంపీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇది కూడా ఇరువురి మధ్య అంతర్గతంగా విభేదాలకు దారితీస్తున్నదని ప్రచారం సాగుతున్నది. జీవీఎంసీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఒకే పార్టీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యే మధ్య పెరుగుతున్న విభేదాలు పార్టీకి నష్టం కలిగిస్తాయని కేడర్ ఆందోళన చెందుతున్నది.

భద్రతా వైఫల్యంతోనే హత్య

నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్య రస్తోగి



నర్సీపట్నం, ఆగస్టు 16 : నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం సాయంత్రం ఒక వ్యక్తిని కొందరు పొడిచి చంపేందుకు యత్నిస్తున్నప్పుడు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఒక్కరు కూడా అడ్డుకునేందుకు యత్నించకపోవడం అమానుషమని నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్య రస్తోగి అన్నారు. బుధవారం రాత్రి ఆయన ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ గంజాయి స్మగ్లర్ల మధ్య నెలకొన్న వివాదాల కారణంగానే హత్య జరిగినట్టు భావిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి విచారణ జరుగుతుందని త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. అయితే ఈ సంఘటనకు మాఫియాకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఒక కత్తిపోటుతో మృతుడు చనిపోవడానికి లివర్ పంక్చర్ కావడమే కారణమన్నారు. మృతుడు కూడా గంజాయి స్మగ్లరేనన్నారు. ఈ సంఘటన పోలీసుల భద్రత వైఫల్యం కారణంగానే జరిగిందని, అందుకు తాము చింతిస్తున్నామని అన్నారు. అయితే సంఘటనా స్థలంలో పోలీసులు వుండి కూడా రక్షించలేదనడం సరికాదన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్సు లోపల సీసీ కెమెరాలు ఉండడం వల్ల వెలుపల దృశ్యాలు రికార్డు కాలేదన్నారు. పది రోజుల్లోగా నర్సీపట్నంలో శాంతి భద్రతలను మెరుగుపరుస్తామని, ముఖ్యంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో అసాంఘిక శక్తులను పూర్తిస్థాయిలో అరికడతామని ఏఎస్పీ రస్తోగి అన్నారు. ఈ విషయంలో నర్సీపట్నం ప్రజలకు పూర్తి భరోసా ఇస్తున్నామన్నారు.

● **జీవీఎంసీ ఎన్నికలకు సన్నాహాలు**

మహా సంగ్రామం

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఐదున్నరేళ్లగా ప్రత్యేక అధికారి పాలనలో వున్న జీవీఎంసీలో కొత్తపాలకవర్గం కొలువుదీరబోతున్నది. అనకాపల్లి, భీమిలి మునిసిపాలిటీల విలీనంతో మొదలైన వివాదానికి రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ముగింపు పలకబోతున్నది. 2011 జనాభా లెక్కల ప్రకారం భీమిలి, అనకాపల్లితో కూడిన జీవీఎంసీ పరిధిలో వార్డుల సంఖ్యను నిర్ధారిస్తూ రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ బుధవారం జీవో నంబర్ 311 జారీ చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో తొలి అడుగు పడినట్టయింది. తాజా పరిణామంతో ఆశావహుల్లో ఒక్కసారిగా కోలాహలం ప్రారంభమైంది.

జీవీఎంసీకి చివరిసారిగా 2007లో ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఆ పాలకవర్గం గడువు 2012 ఫిబ్రవరి 25తో ముగిసింది. తర్వాత ఎన్నికలు నిర్వహించాల్సి వున్నప్పటికీ భీమిలి, అనకాపల్లి మునిసిపాలిటీలతోపాటు పది పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే విలీనాన్ని వ్యతిరేకిస్తూ ఆ రెండు మునిసిపాలిటీలకు చెందినవారితోపాటు అనకాపల్లి వైపు వున్న సలాపువానిపాలెం, వల్లూరు, తాడి, రాజులపాలెం, కొప్పాక పంచాయతీలు, భీమిలి వైపు వున్న కాపులుప్పాడ, చేపలుప్పాడ, జేవీ అగ్రహారం, నిడిగట్టు, నగరపాలెం పంచాయతీలకు చెందిన కొందరు కోర్టులో కేసులు వేశారు. దీంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. అప్పటి నుంచి సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి జీవీఎంసీ పాలనను కొనసాగిస్తున్నారు. అనకాపల్లి మునిసిపాలిటీతోపాటు సలాపువానిపాలెం, వల్లూరు, తాడి, రాజులపాలెం, కొప్పాక పంచాయతీల నుంచి విలీనానికి వ్యతిరేకంగా కేసులు వేసినవారంతా వాటిని ఉపసంహరించుకున్నారు. భీమిలి మునిసిపాలిటీ విలీనానికి వ్యతిరేకంగా కేసులు వేసిన వారు కూడా ఒక్కరు మినహా మిగిలినవారంతా కేసులను వెనక్కితీసుకున్నారు. అయితే కాపులుప్పాడ, చేపలుప్పాడ, జేవీ అగ్రహారం, నిడిగట్టు, నగరపాలెం పంచాయతీల పెద్దలు కేసులు వెనక్కి తీసుకోకపోవడంతో ఆ ఐదు పంచాయతీలకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేసింది. భీమిలి విలీనంపై దాఖలైన కేసుల్లో ఒక్కటి మాత్రం పెండింగ్‌లో వుండిపోయింది. పాలకవర్గం గడువు ముగిసి ఐదున్నరేళ్లు దాటుతున్నా ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదంటూ నగరానికి చెందిన పలువురు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను దాఖలు చేశారు. అయినప్పటికీ దీనిపై ఎలాంటి స్పందన లేకపోవడంతో మరో రెండేళ్లపాటు జీవీఎంసీకి ఎన్నికలు జరిగే అవకాశం లేదనే నిర్ణయానికి అంతా వచ్చేశారు. అలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కసారిగా జీవీఎంసీ వార్డుల సంఖ్యను నిర్ధారిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జీవోను జారీచేయడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. విలీనాన్ని వ్యతిరేకించిన భీమిలి నియోజకవర్గ పరిధిలోని ఐదు గ్రామాలను మినహాయిస్తూ ఈ జీవో జారీచేసింది.

72 నుంచి 81కి పెరిగిన వార్డులు

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవోలో జీవీఎంసీ పరిధిలో వార్డుల సంఖ్యను 72 నుంచి 81కి పెంచింది. 2011 జనాభా లెక్కల ప్రకారం జీవీఎంసీ జనాభా 17,30,320, అనకాపల్లి మునిసిపాలిటీ జనాభా 86,612, భీమిలి మునిసిపాలిటీ జనాభా 54,865గానూ, జీవీఎంసీలో విలీనమైన ఐదు గ్రామాల జనాభా 9,889గానూ పేర్కొంది. విలీనం తర్వాత మొత్తం జీవీఎంసీ జనాభాను 18,81,686 తేల్చింది. దీనిప్రకారం మొదటి పది లక్షల జనాభాకు 63 వార్డులు, మిగిలిన జనాభాకు ప్రతి 50 వేల మందికి ఒక వార్డు చొప్పున 18 వార్డులుగా నిర్ధారించింది. ఈ మేరకు బుధవారం జారీచేసిన జీవోలో స్పష్టంగా పేర్కొంది. వార్డులను పునర్వ్యవస్థీకరిస్తూ సరిహద్దులను నిర్ణయిస్తూ నివేదిక పంపాలని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీచేసింది. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు వార్డుల పునర్విభజనకు సంబంధించిన ఫైళ్ల బూజు దులిపే పనిలో పడ్డారు.

అక్టోబర్ లేదా నవంబర్‌లో ఎన్నికలు?

కీలక నగరాల కార్పొరేషన్ల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే జీవీఎంసీ వార్డులపై జీవో జారీచేసినట్టు తెలుస్తోంది. వార్డుల సంఖ్య నిర్ధారణ తర్వాత అంశం పునర్వ్యవస్థీకరణ. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారులు పూర్తిస్థాయిలో అధ్యయనం జరిపి జనాభా సంఖ్యను బట్టి వార్డుల హద్దులను నిర్ణయిస్తారు. ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారు. తర్వాత దీనిపై ఎలాంటి వివాదాలు తలెత్తకపోయినట్టయితే రాష్ట్రప్రభుత్వం వార్డుల రిజర్వేషన్ల ఖరారు చేస్తూ నోటిఫికేషన్ జారీచేస్తూ అభ్యంతరాల స్వీకరణకు నెల రోజులు గడువు ఇస్తుంది. దీనిపై ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తంకానట్టయితే తర్వాత గెజిట్ నోటిఫికేషన్ ఇస్తుంది. తర్వాత మేయర్ రిజర్వేషన్‌ను ఖరారు చేస్తూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తుంది.

ఆశావహుల్లో కోలాహలం

జీవీఎంసీ వార్డుల సంఖ్యను నిర్ధారిస్తూ ప్రభుత్వం బుధవారం జీవో జారీచేయగానే ఆశావహుల్లో కోలాహలం ప్రారంభమైంది. జీవీఎంసీ ఎన్నికలపై ఈనెల 14న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో పలువురు ఆశావహులు బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ఫోన్ చేసి ఎన్నికలు ఎప్పుడు జరగొచ్చని వాకబు చేయడం గమనార్హం. గణేష్ ఉత్సవాలకు వారం రోజుల ముందు రాష్ట్రప్రభుత్వం జీవీఎంసీ ఎన్నికల నిర్వహణకు తొలి అడుగు వేయడంతో తమ జేబులు గుల్ల అయిపోతాయంటూ కొందరు ఆవేదన వ్యక్తం చేస్తుండడం గమనార్హం. టీడీపీ, వైసీపీ నేతల్లో మేయర్ పీఠం ఆశిస్తున్న పలువురు అప్పుడే జీవీఎంసీ ఎన్నికల అంశంపై ఆసక్తిగా తమ సన్నిహితులతో చర్చలు ప్రారంభించేశారు.

భీమిలి నుంచే వార్డుల విభజన?

గతంలోనే ప్రతిపాదనలు

గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థలో వార్డుల సంఖ్యను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో వార్డుల విభజన ఎటువైపు నుంచి మొదలవుతుందనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. దీనికి సంబంధించి గతంలోనే జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. క్లాక్‌వైజ్‌లో భీమిలి నుంచి వార్డుల విభజన ప్రారంభించి తిరిగి భీమిలి మునిసిపల్ ఏరియాలోనే ముగించాలని సూచించారు. అదే జరిగితే భీమిలిలోనే ఒకటో వార్డు మొదలవుతుంది. అక్కడ నుంచి భీమిలి నియోజకవర్గం...తరువాత విశాఖ తూర్పు, ఉత్తర, దక్షిణ, పశ్చిమ మీదుగా గాజువాక, అనకాపల్లి, పెందుర్తి మీదుగా తిరిగి భీమిలిలో ముగుస్తోంది. అయితే ఈ ప్రతిపాదన యథావిధిగా కొనసాగుతుందా? లేదా అనకాపల్లి నుంచి ప్రారంభిస్తారా అనే దానిపై త్వరలో స్పష్టత రానున్నది. గతంలో అంటే 2007లో జీవీఎంసీ ఎన్నికల సమయంలో తూర్పు నుంచి వార్డుల విభజన ప్రారంభించి (క్లాక్‌వైజ్‌గానే) చివరకు పెందుర్తితో ముగించారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి అయ్యన్న



మంత్రి అయ్యన్నకు సన్మానిస్తున్న దృశ్యం

పర్యాటక కేంద్రంగా తాండవ

- మూడేళ్ల కాలంలో రూ.40 కోట్లతో రిజర్వాయర్ అభివృద్ధి
- చెరువుల అభివృద్ధికి మరో రూ.11 కోట్లు
- రైతు డ్వాక్రా గ్రూపు ఏర్పాటుకు ప్రభుత్వ యోచన
- రోడ్లు భవనాల శాఖా మంత్రి అయ్యన్నపాత్రుడు
- కుడి, ఎడమ కాలువల ద్వారా నీరు విడుదల

నాతవరం : తాండవ రిజర్వాయర్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. బుధవారం తాండవ కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని మంత్రి అయ్యన్నతోపాటు తాండవ నీటి సంఘం అధ్యక్షుడు పారిపల్లి కొండబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా డ్యామ్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ప్రసంగించారు. డ్యామ్ దిగువన పార్కు, కల్యాణమండం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ మూడేళ్ల కాలంలో రూ.40 కోట్లతో తాండవ రిజర్వాయర్ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గత ఏడాది రూ.11 కోట్ల నీరు-చెట్టు నిధులతో మండలంలోని చెరువులను అభివృద్ధి చేశామని, ఈ ఏడాది చెరువుల అభివృద్ధికి మరో రూ.11 కోట్లు కేటాయంచామన్నారు. అలాగే వచ్చే ఏడాది పంట కాలువులు అభివృద్ధికి రూ.పది కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. రైతు డ్వాక్రా గ్రూపును ఏర్పాటు చేసి, ఆ గ్రూపునకు కోటి రూపాయల విలువ చేసే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ పరికరాలను అందించాలని ప్రభుత్వం యోచిస్తుందని చెప్పారు. మొదట ఒక గ్రూపు ఏర్పాటు చేసి విజయవంతమైతే పూర్తి స్థాయిలో అమలు చేస్తారన్నారు. కొంతమంది టీడీపీ శ్రేణులు కూడా చెరువులు ఆక్రమణ చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందని, చెరువులను అక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో 20 చెక్ డ్యామ్‌ల పనులు జరుగుతున్నాయని తెలిపారు. తాండవ డీఈ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 364 అడుగులు నీరు ఉందన్నారు. ఈ నీరు 60 రోజులు వరకు సరిపోతుందని చెప్పారు. రానున్న రోజుల్లో వర్షాలు పడితే ఖరీఫ్‌కు ఢోకా లేదని చెప్పారు. ఎడమ కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 100 క్యూసెక్కులు నీటిని విడుదల చేశామన్నారు. మరో రెండు రోజుల్లో అదనంగా నీరు విడుదల చేస్తామన్నారు. అంతకు ముందు రూ.40 లక్షలతో నిర్మించిన తాండవ ఎర్త్ పనులను అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అయ్యన్నకు తాండవ చైర్మన్ కొండబాబు ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్ రస్తోగి, ఆర్డీవో సూర్యారావు, ఎంపీపీ సన్యాసిదేముడు, జడ్పీటీసీ సభ్యుడు సత్యనారాయణ, మాజీ మార్కెట్ చైర్మన్ లాలం అచ్చిరాజు, నర్సీపట్నం ఎంపీపీ రమణమ్మ, తహశీల్దార్ ,ఎంపీడివో పాల్గొన్నారు.

వాహనాలకు ప్రత్యేక స్థలం కేటాయించాలి

కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

విశాఖపట్నం : జిల్లాలో రహదారులపై వాహనాలు నిలిపేయడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరగుతున్నాయని, ప్రతి మండలంలో వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన రోడ్డు భద్రతా కమిటీతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు, జాతీయ రహదారులు, జీవీఎంసీ, ఆర్‌టీసీ, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాహన డ్రైవర్లకు కనిపించే విధంగా ప్రత్యేక భద్రతా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారుల పక్కన డాబాల వద్ద అనధికారంగా పెద్ద వాహనాలు నిలుపుతున్నారని, అటువంటి వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక స్థలాలు కేటాయించాలని ఆయా మండలాల తహసీల్దార్లకు లేఖలు రాయాలన్నారు.

రవాణాశాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి ఆగస్టు నెలలో వివిధ కేసులకు సంబంధించి అతివేగం, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్, హెల్మెట్ లేని ప్రయాణ, ఓవర్ లోడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్సు లేని వారిపై మొత్తం 16,116 కేసులు నమోదు చేశామని తెలిపారు. సమావేశంలో ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్, అడిషనల్ సీపీ ఫకీరప్ప, ట్రాఫిక్ అడిషనల్ సీపీ మహేంద్ర పాత్రుడు, ట్రామాకేర్ నోడల్ అధికారి డా.వరప్రసాద్, జాతీయ రహదారులు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఆర్‌టీసీ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జీవీఎంసీ కమిషనర్ తదితరులు

సర్వేశాఖ రికార్డులు డిజిటలైజేషన్

ఏడీ మనిషా త్రిపాఠి

విశాఖపట్నం : జిల్లాలో సర్వేశాఖలో భూ సంబంధిత అన్నిరకాల రికార్డులను డిజిటలైజేషన్ పనులు చేపట్టామని ఏడీ మనిషా త్రిపాఠి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే అన్ని మండలాల్లో సర్వేశాఖ కార్యాలయాల్లో ఎఫ్‌ఎమ్‌బీలు, గ్రామ పటాలను డిజిటలైజ్ చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు కొన్ని మండలాల్లో 60 శాతం, మరికొన్ని మండలాల్లో 70 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ముందుగా కొన్ని మండలాను ఎంపిక చేసి నూరుశాతం రికార్డుల డిజిటలైజేషన్ చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

డాక్ సేవక్ సిబ్బంది సమ్మె

కోటవురట్ల: గ్రామీణ డాక్ సేవక్ సిబ్బంది బుధవారం సమ్మె చేశారు. కేంద్ర ప్రభుత్వంతో తమ సంఘ నాయకులు జరిపిన చర్చలు విఫలం కావడంతో తాము సమ్మెకు దిగినట్లు ఆలిండియా డాక్ సేవక్ సంఘ స్థానిక నాయకులు ఎస్.వి.ఎస్.నాయుడు, పి.సీతారామా, వై.వి.వి.సత్యనారాయణ రావు, సీహెచ్.పరశురామయ్య, ఎల్.సత్యనారాయణ, బి.తాతారావు తెలిపారు. తాము విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నామన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో ముప్పు

- విచ్చలవిడిగా రసాయనిక రంగుల గణపతి విగ్రహాల విక్రయాలు
- గ్రామాలకూ విస్తరించిన వైనం
- ప్రకృతి ప్రేమికుల ఆందోళన
- మట్టి విగ్రహాలను పూజించాలని వినతి

ఎలమంచిలి : గ్రామాల్లో గణపతి ఉత్సవాల సందడి ప్రారంభమైంది. ఈ నెల 25 నుంచి వినాయక నవరాత్రులకు ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా గణనాథుని ప్రతిమలకు డిమాండ్ పెరిగింది. దీంతో విగ్రహాల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు. గత కొన్ని సంవత్సరాలుగా రసాయనాలు వినియోగించే విగ్రహాలను పూజించొద్దని, వాటివల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని ప్రకృతి ప్రేమికులు ప్రచారం చేస్తున్నా, ఇంకా ఆ ప్రతిమలే సిద్ధం చేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ ప్రతిమలు అందంగా తయారు చేసేందుకు రసాయనాలను ఉపయోగిస్తున్నారు. పర్యావరణానికి హాని కలిగించే రంగులను వినియోగిస్తున్నారని ప్రకృతి ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి విగ్రహాలు వినియోగిస్తే మానవాళికి ముప్పు వాటిల్లుతుందన్నారు.



విక్రయానికి సిద్ధం చేసిన గణపతి ప్రతిమలు



గణపతి ప్రతిమలు సిద్ధం చేస్తున్న దృశ్యం

ఇలా పర్యావరణానికి ముప్పు...

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహలకు ఉపయోగించే రసాయనాల్లో పాదరసం ఉంటుంది. దీనికి విష స్వభావం ఉంటుంది. ప్రతిమను నిమజ్జనం చేసినప్పుడు నీటిలో చేపలు, జీవరాసులు నాశనమయ్యే అవకాశాలు ఎక్కువ. ఆ నీటిని తాగే పాడి పశువులు కూడా వ్యాధుల బారినపడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇందులో వాడే సీసం వల్ల నాడీ వ్యవస్థ దెబ్బతింటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ కారణాలతో పర్యావరణానికి పెను ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

మట్టి గణపతే ముద్దు

గతంలో చేసే మట్టి గణపతి ప్రతిమలకు వేప బెరడుతో ముదురు గోదుమ రంగును, నీలగిరి బెండుతో గులాబీ, లేత గులాబీ రంగును పూసేవారమని కొందరు తయారీ దారులు అంటున్నారు. అదేవిధంగా దానిమ్మ తొక్కలతో ఆకుపచ్చ, లేతాకు పచ్చ రంగులను చేసేవారు. దీంతో పర్యావరణానికి ఎటువంటి ముప్పు వాటిల్లేది కాదు. అందుకే మట్టి విగ్రహాలను వినియోగించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

గ్రామాలకు విస్తరించిన తయారీ కేంద్రాలు

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల తయారీ కేంద్రాలు గ్రామాలకు విస్తరించాయి. గతంలో విశాఖపట్నం, అనకాపల్లి, ఎలమంచిలి పట్టణాలకే పరిమితంగా ఉండేవి. ప్రస్తుతం ఈ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా విస్తరించాయి. ఎలమంచిలి నుంచి పాయకరావుపేట వరకు ఉన్న జాతీయ రహదారి పక్కన స్థలాలను లీజుకు తీసుకుని తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గణపతి ప్రతిమలకు పేరుగాంచిన ఎలమంచిలి పట్టణంలో అధికశాతం వ్యాపారులు వీటినే ఎక్కువగా విక్రయిస్తున్నారు.

ధరలు పెరగడానికి కారణం...

ప్రతి ఏటా వినాయక ప్రతిమల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గతంలో రూ.5 వేల నుంచి రూ.10 వేల లోపే పెద్ద విగ్రహం లభించేవి. ప్రస్తుతం రూ. 10 వేల పైబడే లభిస్తుంది. ఈ విగ్రహల తయారీకి కొబ్బరిపీచు, తెల్లసున్నం, అచ్చులు, కృత్రిమ రంగులు వాడుతుంటారు. వాటి ధరలు విపరీతంగా పెరుగుతుండడంతో విగ్రహల ధరలు కూడా పెరుగుతున్నాయని వ్యాపారులు అంటున్నారు.



రసాయనిక రంగులు వేస్తున్న దృశ్యం

పత్తికి నో... పొగాకుకు సై



కొయ్యూరు మండలంలో నెల రోజుల క్రితం వేసిన పొగాకు మొక్కలు

- కొయ్యూరు, గొలుగొండ మండలాల్లో గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం
- ఇప్పటికే 1500 హెక్టార్లలో నాట్లు
- తెగుళ్లు, కూలీల కొరతతో పత్తి సాగుకు రైతుల స్వస్తి
- గిట్టుబాటు ధరకు ఐటీసీ కొనుగోలు చేస్తుండడంతో పొగాకు సాగుకు మొగ్గు
- ఎకరాకు రూ.20 వేల ముందస్తు పెట్టుబడి, ఉచితంగా విత్తనాలు ఇస్తున్న కంపెనీ

కొయ్యూరు:

కొయ్యూరు, గొలుగొండ మండలాల్లో ఈ ఏడాది బర్లీ (దొర) పొగాకు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వ్యవసాయ శాఖ, ఐటీసీ అధికారుల అంచనా ప్రకారం ఇంతవరకు సుమారు 1,500 హెక్టార్లలో పొగాకు నాట్లు వేశారు. మరో 500 ఎకరాల వరకు నారు వేసే అవకాశం వుందని అంటున్నారు. ఈ ఏడాది పొగాకు వేసిన పొలాల్లో ఐదారేళ్ల నుంచి పత్తి సాగు చేసేవారు. కానీ రెండేళ్ల నుంచి తెగుళ్లు అధికం కావడం, అదనులో వర్షాలు పడకపోవడం, కూలీలు లభించకపోవడంతో పలువురు రైతులు పత్తి వేయడం మానేశారు. కొంతమంది సరుగుడు తోటలు వేయగా, ఎక్కువ మంది పొగాకు వేస్తున్నారు.

కొయ్యూరు, గొలుగొండ మండలాలు పూర్తిగా మెట్ట ప్రాంతాలు. ఐదారేళ్ల క్రితం పత్తి సాగు ముమ్మరంగా వుండేది. దాదాపు రెండు వేల హెక్టార్లపైబడి పత్తి సాగైయ్యేది. దుక్కులు దున్నడం, విత్తనాలు, ఎరువులు, కూలి ఖర్చులతో కలిపి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి అయ్యేది. ఎకరాకు ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. క్వింటా రూ.3,500లకు వ్యాపారులు కొనుగోలు చేసేవారు. పెద్దగా మిగిలేది లేకపోయినా... ఎంతో కొంత ఆదుకుంటున్నదన్న ఉద్దేశంతో ఈ పంటనే వేసేవారు. కానీ రెండేళ్ల నుంచి పత్తి సాగుకు వాతావరణం అనుకూలించడంలేదు. తెగుళ్ల బెడద పెరిగింది. పురుగు మందుల వ్యయం అధికమైంది. దీనికితోడు పత్తి తీత సమయంలో కూలీల కొరత ఏర్పడుతున్నది. దీంతో పలువురు రైతులుకు పెట్టుబడులు సైతం చేతికి రాలేదు. ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో వారికి పొగాకు పంట గుర్తుకొచ్చింది. పత్తి వేయకముందు ఈ ప్రాంతంలో చాలా విస్తీర్ణంలో బర్లీ పొగాకు పండించేవారు. ఇప్పుడు ఆ రైతులంతా మళ్లీ పొగాకు వైపు మళ్లుతున్నారు. ప్రముఖ సిగరెట్ కంపెనీలు పొగాకు నాణ్యతనుబట్టి కిలో రూ.85 నుంచి రూ.110 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఖర్చులు కూడా చాలా తక్కువే. రెండేళ్ల క్రితం ఈ రెండు మండలాల్లో పొగాకు సాగు 300 నుంచి 400 హెక్టార్ల మధ్యలో వుండగా, ఈ ఏడాది ఏకంగా 1,500 హెక్టార్లకు పెరిగింది.

కొయ్యూరు, గొలుగొండ మండలాల్లో గత నెల మూడో వారం నుంచి పొగాకు నాట్లు వేస్తున్నారు. ఇప్పటికీ నాట్లు కొనసాగుతున్నారు. అవసరమైనంత నారు అందుబాటులో లేకపోవడంతో రాజమండ్రి, రాజానగరం ప్రాంతాలకు వెళ్లి నారు కొనుగోలు చేస్తున్నారు. 10 వేల నారు మొక్కలు రవాణా చార్జీలతో కలుపుకుని రూ.4 వేలు అవుతున్నదని రైతులు చెబుతున్నారు. దుక్కిదున్ని పొలాన్ని సిద్ధం చేయడం, నారు, ఎరువులు, నాట్లు, ఆకు కోత, తెగుళ్ల నివారణ మందుల కోసం ఎకరాకు 15 నుంచి 20 వేల వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఎకరాకు మూడు నుంచి నాలుగు బేళ్లు(ఒక్కో బేలు 100 నుంచి 120 కిలోలు) పొగాకు దిగుబడి వస్తుంది. గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా గత ఏడాది కిలో పొగాకు రూ. 86 నుంచి రూ.95 మధ్యలో సిగరెట్ కంపెనీలు కొనుగోలు చేశాయి. గ్రేడింగ్ చేస్తే ఇంకా ఎక్కువ ధర లభిస్తుందని రైతులు అంటున్నారు. డిసెంబర్ నుంచి సంక్రాంతిలోగా పంట చేతికి వస్తుంది. ఖర్చులుపోను ఎకరాకు రూ.20 మిగులుతాయని చెబుతున్నారు.



షేడ్‌నెట్‌ల కింద పొగాకు నారుమడి

ఐటీసీ ఆధ్వర్యంలో పొగాకు నారుమళ్లు

పొగాకు సాగును ప్రోత్సహించడానికి, నాణ్యమైన ఆకు దిగుబడి కోసం ప్రముఖ సిగరెట్ కంపెనీ ఐటీసీ యాజమాన్యం, ఫీల్డ్ అధికారులను ఏర్పాటు చేసి రైతుల చేత పొగాకు నారుమళ్లను వేయిస్తున్నది. పాత పద్ధతిలో అయితే విత్తనాలు తెచ్చి, నారుమడుల్లో పోసేవారు. కానీ ఇప్పుడు కొత్త పద్ధతుల్లో నారు పెంచుతున్నారు. బర్లీ రకం పొగాకును అధికంగా సాగు చేసే కొయ్యూరు మండలం బాలారం, కంఠారం, కొమ్మిక, బకులూరు, రేవళ్లు; గొలుగొండ మండలం కె.ఎల్లవరం, పాతమల్లంపేట, పుత్తడిగైరంపేట, కరక, జిల్లేడుపూడి పంచాయతీల్లో నారు పోసేందుకు మడుల తయారీకిగానూ ఎకరాకు రూ.20 వేలు వంతున పెట్టుబడి, నాలుగు కేజీల పొగాకు విత్తనాలను ఇస్తున్నది. నారును గతంలో మాదిరిగా కాకుండా షేడ్ నెట్‌ల కింద, ట్రేలలో పెంచుతున్నారు. దీనివల్ల నారుకు నేరుగా ఎండతగలదు. చీడపీడలు ఆశించవు. అన్ని మొక్కలు ఒకేలా, కాండం బలంగా పెరుగుతాయి. నలుగురైదుగురు రైతులు కలిసి 100 ఎకరాలకు సరిపడ నారును పెంచుతున్నారు. ఇరుగుపొరుగు రైతులు వీరి నుంచి నారును కొనుగోలు చేసుకుంటున్నారు. వెయ్యి నారు రూ.200లకు అమ్ముతున్నారు. నారు పెంపకం ద్వారా కూడా పలువురు రైతలుఉ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. రెండు మండలాల్లో ఇప్పటి వరకు 1500 హెక్టార్లలో పొగాకు వేశారు. విస్తీర్ణం మరికొంత పెరిగే అవకాశం వుంది.



పొగాకు నాట్లు వేస్తున్న రైతులు



సజ్జ, నువ్వు కోతలో మెలకువలు

రాంబిల్లి:

మెట్ట ప్రాంతాలు, ఆలస్యంగా వరి సాగు చేసే భూముల్లో తొలకరి వర్షాలు పడగానే వేసిన సజ్జ, నువ్వు పంటలు పక్వానికి వచ్చి, కోతకు సిద్ధంగా ఉన్నాయి. వర్షం పడకుండా, వాతావరణం ఎండగా వున్నప్పుడే ఈ పంటలను కోసుకోవాలి. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం 17వ తేదీ నాటికి ఒడిశాకు ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడుతుంది. దీంతో ఉత్తర కోస్తాలో వర్షాలు పెరుగుతాయని అంచనా. ఇటువంటి పరిస్థితుల్లో సజ్జ, నువ్వు పంటల కోతను రెండు మూడు రోజులు వాయిదా వేసుకోవడం మంచిదని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్ చెబుతున్నారు. సజ్జ, నువ్వు పంటల కోత, నూర్పిడి, పంట నిల్వకు సంబంధించి ఆయన తెలిపిన సమాచారం....

సజ్జ(గంటి)

మన ప్రాంతంలో సజ్జ పంట వర్షాధారం పైనే ఉండడం వల్ల సరైన పోషణ, కీలక సమయాల్లో తడి లేకపోవడంతో కంకులు పూర్తిగా ఎదగడం లేదు. దీంతో పంట మొత్తం ఒకేసారి కోతకు రావడంలేదు.

వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, నాలుగైదు రోజులపాటు పొడి వాతావరణం వుంటుందని సమాచారం వుంటే కంకులను కోసుకోవాలి. ఖాళీ స్థలంలో కంకులను ఎండబెట్టుకుని, గంటకోసారి కింద నుంచి పైకి తిరగవేయాలి. ఈ సమయంలో వర్షం పడి సూచనలు కనిపిస్తే, టార్పాలిన్లు లేదా ప్లాస్టిక్ షీట్లను కప్పాలి. కంకుల కిందకు వర్షపు నీరు పోకుండా చుట్టూ మట్టితో కట్టలా ఏర్పాటు చేసుకోవాలి. కంకులను నాలుగైదు రోజులు బాగా ఎండనిచ్చిన తరువాత కర్రలతో కొట్టడం, లేదా పశువులతో తొక్కించి గింజలను వేరుచేయాలి. అందుబాటులో వుంటే ట్రాక్టర్‌లో తొక్కించవచ్చు. దీనివల్ల కొంచె ఖర్చు అయినప్పటికీ పని త్వరగా పూర్తవుతుంది. కంకులనకు రహదారులపై ఎట్టి పరిస్థితుల్లోనూ వేయవద్దు. దీనివల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువ.

పొలంలోని కంకులన్నీ ఒకేసారి పక్వానికి రాకపోతే కోతకు తయారైన కంకులను దఫదఫాలుగా కోసుకోవాలి. ఎండబెట్టి గింజలు వేరుచేయాలి.

పిలక కంకుల కంటే ప్రధాన కాండపు కంకి మొదట కోతకు వస్తుంది. కాబట్టి ఒకేసారి కాకుండా రెండు మూడుసార్లు కంకులు కోయాల్సి వస్తుంది.

గింజల్లో తేమ 20 శాతం వున్నప్పుడు పంటను కోసుకోవాలి.

నూర్పిడి తరువాత గింజల్లో తేమ 13 శాతం కన్నా తక్కువ ఉండేలా చూసుకోవాలి. ఈ మేరకు అవసరమైనన్ని రోజుల్లో ఎండబెట్టాలి.

తేమ శాతం ఎక్కువ వుంటే గింజలకు బూజు పట్టి పాడైపోతాయి.

గింజలను బస్తాల్లో నింపేటప్పుడు పొయ్యి బూడిద కలిపితే పురుగు ఆశించకుండా ఉంటుంది. ఈ పద్ధతిని గిరిజన ప్రాంతాల్లో పాటిస్తుంటారు.




నువ్వు

మొక్కల ఆకులు పసుపు రంగులోకి మారి, రాలడం ప్రారంభమైనప్పుడు, 75 శాతం కాయలు లేత పసుపు రంగులోకి మారినప్పుడు పైరు కోయాలి. పంట మొత్తం రంగు మారే వరకు వేచివుంటే గింజ రాలిపోతుంది.

కోసిన పంటను కట్టలుగా కట్టి, మొదళ్ల కిందకి, చివళ్లు పైకి వుండేలా పొలంలో నిలబెట్టాలి. ఐదారు రోజులు ఎండిన తరువాత నూర్పిడి చేసుకోవచ్చు.

గింజలో తేమ ఎనిమిది శాతానికి తగ్గే వరకు ఎండలో ఆరబెట్టాలి. గోనె సంచుల్లో నిల్వ చేస్తే మంచిది. నువ్వుల బస్తాను మండె కట్టిన తరువాత బస్తాపై మాలాథియాన్ పొడిని చల్లాలి. వెంటనే అమ్మకుండా కొంతకాలంపాటు నిల్వ చేయాలనుకుంటే, కనీసం నెలకోసారి నువ్వులను ఎండబెట్టాలి. దీనివల్ల పురుగు పట్టకుండా వుంటుంది.





శాస్త్రవేత్త
బండి నాగేంద్ర ప్రసాద్

తమలపాకు కళకళ



అరట్లకోటలోని ఒక తోటలో నవనవలాడుతున్న తమలపాకులు

ఆకు తోటలకు పూర్వ వైభవం
తగ్గిన తెగుళ్ల బెడద
పెరిగిన నాణ్యమైన ఆకు దిగుబడి
కొత్త తోటలు వేస్తున్న రైతులు
మార్కెట్‌లో ఆశాజనకంగానే ధరలు
రానున్న ఐదు నెలలపైనే రైతుల ఆశలు

పాయకరావుపేట:

వాతావరణ పరిస్థితులు అనుకూలంగా వుండడం, తెగుళ్ల బెడద తగ్గడం, మార్కెట్‌లో గిరాకీ పెరగడంతో పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాల్లో తమలపాకు తోటలకు పూర్వ వైభవం వస్తున్నది. ఐదేళ్ల క్రితం సంభవించిన నీలం తుఫాన్‌కు తమలపాకు తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.



బుట్టల్లో ప్యాకింగ్ చేసిన తమలపాకులు

తరువాత తెగుళ్ల సోకవడంతో చాలా మంది రైతులు ఆకు తోటలను తీసేసి, ఇతర పంటలు వేసుకున్నారు. ఏడాది నుంచి తెగుళ్ల బెడద తగ్గడం, ఆకు దిగుబడులు బాగుండడంతో పలువురు రైతులు మళ్లీ తమలపాకు తోటలు వేస్తున్నారు.

పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాల్లో తాండవ, వరాహ నదుల తీర ప్రాంతాల్లో అనాదిగా తమలపాకు తోటలు సాగు చేస్తున్నారు. పాయకరావుపేట మండలంలో అరట్లకోట, మంగవరం, సత్యవరం, ఎం.ఎస్.పేట, కొత్తూరు, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం గ్రామాల్లో సుమారు 1,000 ఎకరాల్లో, ఎస్.రాయవరం మండలంలో వమ్మవరం, ధర్మవరం, పెనుగొల్లు గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో తమలపాకు తోటలు వున్నాయి. అయితే దీర్ఘకాలంపాటు పంటమార్పిడి లేకపోవడంతో తెగుళ్ల పెరిగిపోయి, కొరకరాని కొయ్యగా మారాయి. ఈ నేపథ్యంలో 2012లో వచ్చిన నీలం తుపాను తమలపాకు తోటలకు తీరని నష్టాన్ని కలిగించింది. మార్కెట్‌లో ధరల ఒడిదుడుకుల కారణంగా పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి ఏర్పడింది. పలువురు తమలపాకు తోటలను తీసివేసి, ఇతర పంటలు వేసుకున్నారు. దీంతో తమలపాకు తోటల విస్తీర్ణం తగ్గిపోయింది. మార్కెట్‌లో తమలపాకులకు గిరాకీ పెరింది. గత ఏడాది వాతావరణం అనుకూలించి తెగుళ్ల సమస్య బాగా తగ్గిపోయింది. నీలం తుఫాన్ తరువాత తోటలు తొలగించిన రైతులు ఇప్పుడు కొత్త తోటలు వేస్తున్నారు.

తెలంగాణ, బెంగాల్, మహారాష్ట్రలకు ఎగుమతి

పాయకరావుపేట నుంచి తెలంగాణ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్రలకు తమలపాకు ఎగుమతి అవుతుంది. ఈ ప్రాంతంలో పండే తమలపాకు వారం రోజుల వరకు వడబడకుండా, నాణ్యత కోల్పోకుండా నిల్వ ఉంటుంది. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి పాయకరావుపేట తమలపాకుకు మంచి డిమాండ్ ఉంది. ఎగుమతి వ్యాపారులు రైతుల నుంచి పంతాల(ఒక్కో పంతాకు 150 ఆకులు) చొప్పున కొనుగోలుచేస్తారు. ఒక్కో బుట్టలో 20 పంతాల చొప్పున ప్యాక్ చేస్తారు.



ఎగుమతి కోసం బుట్టల్లో తమలపాకు ప్యాకింగ్

వ్యాన్‌కి 400 బుట్టల చొప్పున లోడింగ్ చేస్తారు. కొంతమంది రైతులు రోజూ రైళ్ల ద్వారా సుమారు 100 బుట్టల వరకు రవాణా చేస్తున్నారు. మహారాష్ట్రలో పండుగల సీజన్‌లో 20 పంతాల బుట్ట వెయ్యి రూపాయల పలికేది. ఇక్కడ ఎగుమతి వ్యాపారులు పంతానికి రూ.30 వరకు రైతులకు ఇచ్చేవారు. ప్రస్తుతం అక్కడ బుట్ట రూ.350లకు తగ్గిపోవడంతో ఇక్కడ రైతులకు పంతానికి రూ.12 చొప్పున ఇస్తున్నారు.

అక్కడి మార్కెట్‌ను బట్టే ఇక్కడ చెల్లింపులు


దాడి జగదీశ్, తమలపాకు వ్యాపారి, కొత్తూరు



మహారాష్ట్ర మార్కెట్ మార్కెట్‌నుబట్టి ఇక్కడ ధరలు నిర్ణయిస్తుంటాం. ప్రస్తుతం మహారాష్ట్రలో 20 పంతాల బుట్ట రూ.350లకు కొనుగోళ్లు జరుగుతున్నాయి. దాని ప్రకారం మేము ఇక్కడ రైతుల నుంచి 20 పంతాలను రూ.240లకు కొనుగోలు చేస్తున్నాం. వెదురు బుట్ట రూ.40, ప్యాకింగ్, రవాణా ఖర్చులు రూ.60.. మొత్తం రూ.340 అవుతున్నది. మార్కెట్‌లో రేటు పెరిగితే ఆ మేరకు రైతుకి ఇస్తున్నాం. దసరా, దీపావళి, కార్తీక మాసం, సంక్రాంతి పండుగల సమయంలో తమలపాకు రేటు పెరిగే అవకాశం వుంది.

సగం ఆదాయం కూలికే...

పి.ఏడుకొండలు, సత్యవరం



ఉపాధి హామీ పథకం వచ్చిన తరువాత కూలి రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. అయినాసరే కొన్నిసార్లు అవసరమైనంత మంది కూలీలు లభించడంలేదు. ప్రస్తుతం పంతం ఆకులు రూ.12లకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీనిలో సగం... అంటే రూ.6 కూలికే పోతున్నది. తమలపాకు రేటు పెరిగితే తప్ప, ఈ ధర అయితే మాకు మిగిలేది ఏమీ వుండదు.

గిట్టుబాటు కాకపోయినా...

సీహెచ్ వినాయక్, కౌలు రైతు, అరట్లకోట



తమలపాకుల తోటలకు పెట్టుబడులు బాగా పెరిగిపోయాయి. మొత్తం ఖర్చులో మూడో వంతు ఆకు కోత కూలీలకు ఖర్చు అవుతున్నది. పంట దిగుబడి బాగానే వుంది. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో ధరలే అంత సంతృప్తికరంగా లేవు. వ్యాపారులు పంతం ఆకు రూ.12లకు కొనుగోలు చేస్తున్నారు. కనీసం రూ.25 వుంటే గిట్టుబాటు అవుతుంది. అయినప్పటికీ ఆకు తోటల సాగంటేనే మాకు మక్కువ.

రెండేళ్లు వద్దు... 9 నెలలు చాలు

పసుపు పంటతీతపై శాస్త్రవేత్తల సలహా
సమయం ఆదా, రెట్టింపు దిగుబడులు
అక్టోబర్ వరకు తెగుళ్ల బెడద నివారణకు సూచనలు



చింతపల్లి:

ఏజెన్సీలో పసుపు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే తెగుళ్లను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానం తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. చింతపల్లి, జీకేవీధి, జి.మాడుగుల, పాడేరు ప్రాంతాల్లో గిరిజన రైతులు పసుపు సాగు చేస్తున్నారు. ప్రధానంగా మిశ్రమ, దేశవాళి రకాలనే సాగుచేస్తుంటారు. సాధారణంగా పసుపు 10 నెలల పంట. కానీ ఏజెన్సీ రైతులు అనాదిగా రెండేళ్ల పంటగా సాగుచేస్తున్నారు. దీనివల్ల సమయం వృథా అవుతున్నది. దిగుబడి కూడా నష్టపోతున్నారు. విత్తనం నాటిని తొమ్మిది నుంచి పది నెలలో పంటను తీసేసుకోవాలని శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ ఇప్పటికీ అధిక శాతం మంది రైతులు రెండేళ్ల పంటగానే సాగుచేస్తున్నారు. దీనివల్ల నాణ్యమైన కొమ్ములు, దుంపలు పండి, మార్కెట్‌లో అధిక ధర లభిస్తుందని వారి భావన.

ఏజెన్సీలో ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో పసుపు విత్తనం వేశారు. ప్రస్తుతం మొక్కలు అడుగు నుంచి అడుగున్నర ఎత్తు పెరిగాయి. ఆగస్టు నుంచి అక్టోబర్ వరకూ ఈదురుగాలులతో కూడిన వర్షాలు, గాలిలో అధిక తేమ, ఉష్ణోగ్రతలు తక్కువగా వుండడంతో పసుపు పంటను తాటకుమచ్చ, ఆకు మచ్చ తెగులు ఆశిస్తాయని, సకాలంలో నివారించుకుంటే పంటకు నష్టం వాటిల్లదని ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత ప్రదీప్ తెలిపారు.

పసుపులో తెగుళ్లు, నివారణ చర్యలు

తాటాకు మచ్చ తెగులు: ఆకులపై పెద్ద పెద్ద మచ్చలు అండాకారంలో కనిపిస్తే తాటాకు మచ్చ తెగులు సోకిందని రైతులు గుర్తించాలి. ఈ మచ్చలు ముదురు గోధుమ రంగులో వుండి, మచ్చచుట్టూ పసుపు రంగు వలయం వుంటుంది. ఆకు కాడపై కూడా మచ్చలు ఏర్పడి, ఆకు కిందకు వాలిపోతుంది.

ఆకు మచ్చ తెగులు: ఆకులపై చిన్నచిన్న పసుపు రంగు చుక్కలు ఏర్పడితే ఆకు మచ్చ తెగులు సోకిందని గుర్తించాలి. అనంతరం ఈ మచ్చలు గోధుమ రంగులోకి మారతాయి. తెగులు ఉధృతమైతే ఆకు పూర్తిగా మాడిపోతుంది.

- తెగులు సోకని దుంపలను నాటడానికి ఎన్నుకోవాలి.
- ఆకు మచ్చ తెగులు సోకిన మొక్కలను తీసివేసి కాల్చేయాలి.



ఆకు మచ్చ తెగులుబారిన పడిన పసుపు



తాటాకు మచ్చ తెగులుబారిన పడిన పసుపు

- లీటరు నీటికి ఐదు మిల్లీలీటర్ల నూనె(నీంగోల్డ్) కలిపి ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు(21 రోజులకోసారి) పిచికారీ చేసుకోవాలి.
- ఒక శాతం బోర్డో మిశ్రమం, 1:1:100 నిష్పత్తిలో మైలుతుత్తం, పొడి సున్నం, నీరు కలిపిన ద్రావణాన్ని తెగుళ్ల సోకిన తొలి దశలో పిచికారీ చేసుకోవాలి. ఒక పక్షం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.

అన్నవరంలో ఉద్రిక్తం

- వివాదాస్పదంగా కల్యాణ మండపం నిర్మాణం
- శంకుస్థాపనకు సిద్ధమైన టీడీపీ వర్గీయులు
- అడ్డుకున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు
- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- అరుపులు, కేకలతో దద్దరిల్లిన గ్రామం

చోడవరం : చోడవరం పంచాయతీ శివారు అన్న వరం గ్రామంలో కళ్యాణ మండపం నిర్మాణంలో తలెత్తిన వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. టీడీపీ, వైసీపీ నాయకులు ఘర్షణకు దిగడంతో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. చివరికి పోలీసులు, కొందరు నేతల జోక్యంతో గొడవ సద్దుమణిగింది.



ఘర్షణ పడుతున్న టీడీపీ, వైసీపీ వర్గీయులు



వివాదాస్పద స్థలంలో బైఠాయించిన వైసీపీ వర్గీయులు



విలేకరులతో మాట్లాడుతున్న ఇరువర్గాల నాయకులు

వివాదానికి కారణం

గ్రామంలో కల్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే రాజు గత ఏడాది 5 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఈ మేరకు అదే ఏడాది జూలైలో పంచాయతీ తీర్మానం ఇచ్చింది.అయితే ఇప్పటికి ఐదు దఫాలు శంఖుస్థాపన చేసి కూడా పనులు ప్రారంభించకపోవడంతో స్థానిక వైసీపీ నాయకులు విషయాన్ని రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రూ. 18 లక్షల మంజూరు చేయించారు. ఈ నిధులతో గతంలో టీడీపీ వర్గీయులు శంకుస్థాపన చేసిన స్థలంలో కల్యాణ మండపం నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారు. దీనికి పంచాయతీ అనుమతి లేకపోవడంతో సర్పంచ్‌తో పాటు అధికారులు అడ్డుకున్నారు. అనంతరం తమకు పంచాయతీ తీర్మానం ఇవ్వాలంటూ వైసీపీ నాయకులు అధి కారులకు దరఖాస్తు చేశారు. కానీ అదే స్థలంలో నిర్మా ణానికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడం వల్ల అనుమతి ఇవ్వలేమని డీఆర్‌డీఏ పీడీ ఎంపీ విజయసాయిరెడ్డికి లేఖ ద్వారా స్పష్టం చేశారు. వైసీపీ నాయకులు పెట్టుకున్న అనుమతి దరఖాస్తును అధికారులు తోసిపుచ్చారు. ఇంతలోఎమ్మెల్యే రాజు గతంలో ఇచ్చిన 5 లక్షలకు తోడు మరో రూ. 15 లక్షల మంజూరు చేశారు. దీంతో టీడీపీ వర్గీయులు నిర్మాణ పనులకు సిద్ధం కావడంతో ఇరువర్గాల మధ్య వివాదానికి కారణమైంది. తాము గ్రాంటు తెచ్చినప్పటికీ తమకు నిర్మాణానికి పంచాయతీ అనుమతి ఇవ్వనందున ఏ పార్టీ నిధులతోనూ మండపం కట్టడానికి అంగీకరించమని, తామే చందాలు వేసుకుని పనులు చేయిస్తామని వైసీపీ నాయకులు పట్టుబట్టడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది.

ఉదయం నుంచే పోలీసుల మోహరింపు

వివాదాస్పద స్థలంలో కల్యాణ మండపం నిర్మాణానికి టీడీపీ నాయకులు శంకుస్థాపనకు సిద్ధం కావడం, ఈ కార్యక్రమాన్ని వైసీపీ నాయకులు అడ్డుకునే పరిస్థితి ఉండడంతో ఉదయం నుంచే చోడవరం, మాడుగుల సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు, అనకాపల్లి నుంచి మహిళా పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు గ్రామంలో పెద్ద ఎత్తున మోహరించారు. వైసీపీ నాయకులు మిలట్రీనాయుడు, పుల్లేటి వెంకటరావు, పందిరి శ్రీను, సూరిబాబు, లింగబాబు, నెహ్రూ, శ్రీకాంత్, సత్యారావు, మూడెడ్ల శంకరరావు,ప్రకాష్, తదితరులు కూడా భారీగా చేరుకున్నారు. ఉదయం 11 గంటలకు సర్పంచ్ దొమ్మేసి అప్పలనర్స, ఆమె భర్త గిరి, పీఆర్ డీఈ ప్రసాద్, ఈవోపీఆర్‌డీ ఆంజనేయులు, పంచాయతీ ఈవో చంద్రశేఖర్ కళ్యాణ మండపం స్థలం వద్ద శంకుస్థాపనకు వచ్చారు. దీంతో వైసీపీ నాయకులు వారితో వాదనకు దిగారు. సర్పంచ్‌కు మద్దతుగా టీడీపీ నాయకులు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వెంటనే పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. అధికార బలంతో కళ్యాణ మండపం కట్టాలని చూస్తే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే మిలట్రీనాయుడు సీఐతో వాదనకు దిగారు. పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు.ఏదైనా ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, గొడవలకు దిగితే కేసులు నమోదు చేస్తామని సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. దీంతో రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు వెనక్కి తగ్గారు.

గురువారం నాటికి వాయిదా

వివాదం ఎంతకీ తెగే పరిస్థితి లేకపోవడంతో మాజీ ఎమ్మెల్యే మిలట్రీనాయుడు, సర్పంచ్ అప్పలనర్స, గిరి, ఇంజనీరింగ్ అధికారులు పోలీసులతో చర్చలు జరిపారు. మిలట్రీనాయుడుఫోన్‌లో ఎమ్మెల్యే రాజుతో మాట్లాడారు. వివాదంపై రెండువర్గాల నుంచి పదేసి మంది నాయకులు గురువారం ఉదయం సమావేశమవుదామని నిర్ణయించారు.దీనికి టీడీపీ, వైసీపీ నాయకులు అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది.

45 కిలోల గంజాయి పట్టివేత

మాడుగుల: ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 45 కిలోల గంజాయిని స్థానిక ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఆ శాఖ ఇన్‌చార్జి సీఐ సీహెచ్ జగన్నాథరాజు తెలిపిన వివరాల మేరకు...మాడుగుల మండలం తాటిపర్తి సమీపంలో మంగళవారం రాత్రి పోలీసులు రూట్ వాచ్ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు పాడేరు నుంచి కాలిడకన మూడు గోనె సంచులతో వస్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేశారు. అందులో గంజాయి ఉండడంతో వారిని అదుపులోకి తీసుకునే సమయంలో మూట వదిలి ఒకరు పారిపోయారు.దీంతో పోలీసులు పాడేరుకి చెందిన కించోయి నవీన్, మంచాల రాంబాబును అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. పట్టుబడిన గంజాయిని సీజ్ చేశారు. పరారైన రవికుమార్ కోసం గాలిస్తున్నారు. పట్టుబడిన గంజాయి 45 కిలోలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఎలుగు దాడిలో మహిళకు గాయాలు

డుంబ్రిగుడ : మండలంలోని సొవ్వా పంచాయతీ సాగరి వలస గ్రామంలో ఎలుగుబంటి దాడి చేయడంతో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. సొవ్వా సర్పంచ్ మితుల తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వంతల పొండొయ్ సమీపంలో ఉన్న కొండ వద్ద పోడు వ్యవసాయం చేసుకునేందుకు వెళ్లింది. పని చేస్తుండగా ఎలుగుబంటి అమాంతంగా వచ్చి దాడి చేసింది. ఆమె అరుపులు విన్న సమీపంలోని రైతులు పరుగున అక్కడికి రావడంతో ఎలుగుబంటి పారిపోయింది. వెంటనే ఆమెను స్థానికులు అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నర్సీపట్నం రూరల్ : నర్సీపట్నం మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని ఒక ప్రైవేటు కళాశాల వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామానికి చెందిన కాపవరపు పోతురాజు నర్సీపట్నంలో నూడిల్స్ షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం బైక్‌పై నర్సీపట్నం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఎదురుగా సైకిల్‌పై వస్తున్న కళాశాల విద్యార్థిని తప్పించబోయి అదుపు తప్పి పడ్డాడు. దీంతో ఆయన తలకు తీవ్రమైన గాయమైంది. వెంటనే స్థానికులు 108 వాహనంలో నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు.



బావిలో బుద్ధా మృతదేహం



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వేర్వేరు చోట్ల ఇద్దరి మృతి

ముంచంగిపుట్టులో బావిలో పడి ఒకరు...కశింకోటలో శారదా నదిలో పడి మరొకరు ..

ముంచంగిపుట్టు : ముంచంగిపుట్టు, కశింకోట మండలాల్లో బుధవారం వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి చెందారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ సంఘటనల్లో ఒకరు బావిలో పడి చనిపోగా..మరొకరు శారదా నదిలో పడి మరణించారు. ముంచంగిపుట్టుకి చెందిన వి. బుద్ధా (47) కూలి పనులతో పాటు ఇళ్లకు నీళ్లు మోస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజూ మాదిరిగానే బుధవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయ నివాస గృహాల సమీపంలోని బావిలో నీళ్లు తోడుతుండగా ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. ఈ విషయాన్నిగమనించిన స్థానికులు వెంటనే ఆయన్ను కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐలు ఎన్. భాస్కరరావు, టి. అర్జున్‌రావు తెలిపారు.

శారదా నదిలో పడి...

కశింకోట రూరల్ : కశింకోట గ్రామంలో ఓ వ్యక్తి శారదా నదిలో పడి మృతి చెందారు. గ్రామానికి చెందిన జల్లేడుపూడి రామ్మోహన్‌రావు మంగళవారం రాత్రి బహిర్భూమికి నది గట్టు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ జాడి పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ చూడకపోవడంతో మృతి చెందాడు. పెయింటింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే రామ్మోహన్ మృతి చెందడంతో ఆయన భార్య పిల్లలు దిక్కులేనివారయ్యారు. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మధుసూధనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు జల్లేడుపూడి రామ్మోహనరావు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

తీరంలో గుర్తుతెలియని మృతదేహం

పాయకరావుపేట : మండలంలోని రాజానగరం సముద్ర తీరంలో గురు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. బుధవారం తెల్లవారుజామున సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు ఇచ్చిన సమాచారం మేరకు రాజానగరం తీర ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 ఏళ్లు ఉంటాయని, వంటిపై ఎటువంటి గాయాలు లేవని పోలీసులు తెలిపారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘ఉక్కు’ అభ్యర్థులకు ఉపాధి రిజిస్ట్రేషన్ కార్డులు

విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్‌లో జూనియర్ ట్రైనీ ఉద్యోగాల కోసం వెలువడిన నోటిఫికేషన్ కోసం నిరుద్యోగులకు ఉపాధి రిజిస్ట్రేషన్ కార్డుల పంపిణీని జిల్లా ఉపాధి అధికారులు బుధవారం ప్రారంభించారు. సాధారణంగా ప్రతిరోజూ 70నుంచి120 వరకు ఉపాధి కార్యాలయంలో నూతన రిజిస్ట్రేషన్లు,అదనపు విద్యార్హతుల జోడింపునకు దరఖాస్తులు వస్తాయి. ఏడాదికి 9000 నుంచి 10000 రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. కానీ ఈ ఏడాది స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగాలకుప్రకటన వెలువడిన నేపథ్యంలో ఇంతవరకు 17,700 మంది రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్లు చేశారు. జూన్‌లో దరఖాస్తు గడువు ముగియడంతో తాత్కాలిక కార్డులు మంజూరు చేసి ప్రస్తుతం శాశ్వత కార్డులను పంపిణీ చేస్తున్నారు. కాగా.. జూన్‌లో రిజిస్ట్రేషన్లకు హాజరైన 13702 మంది నిరుద్యోగులు ఒక్కసారిగా రాకుండా ఈఏడాది అక్టోబర్ 31లోగా ఎప్పుడైనా కార్డులు పొందవచ్చని జిల్లా ఉపాధి కల్పనాధికారులు ఇ.వెంకటరత్నం, సీహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు.



మంచినీటి వసతిని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో పట్టాన్ శెట్టి, సంచయిత (ఇన్‌సెట్‌లో) సూర్య సుజలధార వాటర్ ప్లాంట్



మ్యూజియం ఆవరణలో బయోటాయ్‌లెట్లు

స్వచ్ఛమైన నీటిని అందించడమే లక్ష్యం

సనా సంస్థ వ్యవస్థాపకురాలు సంచయిత

అరకు మ్యూజియం ఆవరణలో మంచినీరు, సౌచాలయాలు

అరకురూరల్, ఆగస్టు 16: పరిశుభ్రమైన టాయ్‌లెట్లు, స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నదే సనా స్వచ్ఛంద సంస్థ లక్ష్యమని.. సనా సంస్థ ఫౌండర్ సంచయిత అన్నారు. ఆ లక్ష్యసాధన దిశగా సంస్థ ఈ కార్యక్రమాలకు అయ్యే ఖర్చులో సంస్థ సగభాగం పెట్టుబడి పెడితే మరో సగభాగం ఇతర సంస్థల భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. అరకులోయ గిరిజన మ్యూజియం ఆవరణలో బయోటాయిలెట్లు, మంచి నీటి కొళాయిలు బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. సనా స్వచ్ఛంద సంస్థ, ఐటీడీఏ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వీటిని ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి, సనా సంస్థ ఫౌండర్ సంచయిత ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యూవీ వాటర్ ప్లాంట్‌తో పాటు సురక్షిత నీటిని పర్యాటకులు వినియోగించుకునేందుకు ప్రత్యేకంగా ట్యాప్ పాయింట్‌లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 20 బయోటాయ్‌లెట్లును నిర్మించామన్నారు. వీటన్నింటికి సోలార్ పద్ధతితో నడిచే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన వీటికి ఐటీడీఏ రూ.15 లక్షలు వ్యయం చేయగా తమ సంస్థ రూ.15 లక్షలు వ్యయం చేసిందన్నారు. దేశవ్యాప్తంగా సంస్థ చేపడుతున్న ఈ కార్యక్రమాలకు అభినందించి గూగుల్ సంస్థ ఈ కార్యక్రమాలకు రూ.3 కోట్లు ఆర్థిక ప్రోత్సాహం అందించిందన్నారు. విశాఖ జిల్లాలో 20 చోట్ల ఈ తరహా పనులను చేపడుతున్నట్టు తెలిపారు. కనీస మౌలిక సౌకర్యాలు లేని పాఠశాలలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం మేనేజర్ మురళి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలోనూ ఏర్పాటు చేస్తాం

మ్యూజియంలో ఏర్పాటు చేసిన విధంగానే అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికల సౌకర్యార్థం బయోటాయ్‌లెట్లను, సూర్య సుజలధార ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు సనా సంస్థ ప్రతినిధి తెలిపారు. మ్యూజియంలో బయోటాయ్‌లెట్లు ప్రారంభించిన అనంతరం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి.. ఐటీడీఏ పీవో ఐటీడీఏ పీవో, సనా సంస్థ ప్రతినిధి దృష్టికి డిగ్రీ కళాశాలలో బాలికల సౌకర్యార్థం బయోటాయ్‌లెట్లతో పాటు సూర్యసుజలధార ఏర్పాటు చేస్తే వందలాది మంది బాలికలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. దీంతో కళాశాలలో ఉన్న అసౌకర్య పరిస్థితులను పరిశీలించిన సనా సంస్థ ప్రతినిధి కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులతో మాట్లాడి బయోటాయ్‌లెట్లతో పాటు సురక్షితమైన తాగునీరు సౌకర్యం కల్పిస్తామన్నారు.

రూ.10 ధరకే 20 లీటర్లు సురక్షిత నీరు

సురక్షిత తాగునీటి సౌకర్యాన్ని పట్టణవాసులకు అందుబాటులోకి తెస్తున్నట్టు ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి తెలిపారు. మ్యూజియం ఆవరణలో ఏర్పాటు చేసిన సూర్య సుజలధారను ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో రెండు ప్లాంట్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. 20 లీటర్ల కేన్‌కు రూ.10 చెల్లించి ఎవరైనా పొందవచ్చునన్నారు. అలాగే ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న మ్యూజియం ప్రహరి వైపు నాలుగురోడ్ల కూడలి జంక్షన్ నుంచి ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరే రోడ్డు వరకు ఓ మోడల్ షాపింగ్ మాల్స్‌ను నిర్మించే యోచనలో ఉన్నామన్నారు. చాలా వరకు ఆక్రమణలు ఉన్నాయని వాటన్నింటిని తొలగించి మంచి దుకాణ సముదాయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కోల్డ్ స్టోరేజీకి ప్రభుత్వ ఏర్పాట్లు

డౌనూరు, మూలపేట పంచాయతీల మధ్య నిర్మాణం

స్థలాన్ని పరిశీలించిన ఆర్టీవో వేణుగోపాల్

కొయ్యూరు: రైతు పండించిన పంటను గిట్టుబాటు ధర వచ్చే వరకు పంటను నిల్వ చేసుకునేందుకు వీలుగా మండలంలో కోల్డ్‌స్టోరేజీతో పాటు ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్ సెంటర్‌ను ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి స్థలం కేటాయించాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు రావటంతో స్థానిక రెవెన్యూ యంత్రాంగం వీలుగా చర్యలు తీసుకుంది. జిల్లాకు ఒక ఆహార ఉత్పత్తుల ప్రోసెసింగ్ కేంద్రం ఉంటే నష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు సూచనను ప్రభుత్వం ఎట్టకేలకు పరిగణలోకి తీసుకుంది. ఈ విషయమై గత ప్రభుత్వాల హయాంలో మార్కెటింగ్, వ్యవసాయశాఖలు దృష్టి పెట్టకపోవటంతో రైతాంగం తీవ్ర ఆర్థిక నష్టాలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఏజెన్సీలో ఈ పరిస్థితి మరింత దారుణమైంది.

ఏ పంటకైనా గిట్టుబాటు దర పలకనప్పుడు ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్ సెంటర్ ఉంటే దాని ద్వారా అనేక రకాల ఆహార పదార్థాల తయారీకి వీలు పడుతుంది. దీని వల్ల రైతుకు లాభం ఉంటుంది. అలాగే గిట్టుబాటు దర వచ్చే వరకు పంట నిల్వకు శీతల గిడ్డంగులు ఏర్పాటు జరిగితే పంట నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది.

ఈ నేపథ్యంలో ప్రస్తుత వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ, వ్యవసాయశాఖ సంయుక్తంగా మండలానికి ఒక శీతల గిడ్డంగితో పాటు ఆహార ఉత్పత్తుల ప్రోసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేయ్యాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ క్రమంలో నాలుగైదు ఏజెన్సీ మండలాలకు అందుబాటులో ఉండేలా డౌనూరు, మూలపేట పంచాయతీల మద్యలో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం గుర్తించి వివరాలు నివేదించాలని కలెక్టర్ స్థానిక తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆదిశగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుకు వీలుగా మూలపేట పంచాయతీలో సర్వేనెంబరు 24/1 సిలో గల ప్రభుత్వ భూమిలో 2-60 ఎకరాల భూమిని కేటాయించామని తహసీల్దారు తెలిపారు. దీనికి సంబంధించిన ఎఫ్ఎంబి భూరికార్డులను పాడేరు ఆర్డీఓ ద్వారా కలెక్టర్‌కు పంపామని వివరించారు.

స్థల పరిశీలన జరిపిన ఆర్డీవో

మూలపేట పంచాయతీ పరిధిలో డౌనూరు పంచాయతీకు మధ్య కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని పాడేరు ఆర్డీఓ వేణుగోపాల్ మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ నిర్ణయానికి వీలుగా ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నందున సత్వరమే భూకేటాయింపు చర్యలు తీసుకున్నామని, దీనిక సంబందించి కలెక్టర్ ఆదేశాల ప్రకారం పరిశీలన జరుపుతున్నామని తెలిపారు.

అభ్యంతరం పరిశీలిస్తాం

మూలపేట పంచాయతీలో సర్వేనెంబరు 24/1-సీ లో 2-60 సెంట్లు ప్రభుత్వ భూమిని స్థానిక రెవెన్యూ అధికారులు గుర్తించి కలెక్టరుకు నివేదించారు. దీనిపై స్థల పరిశీలనకు ఆర్డీవో వచ్చిన సందర్భంలో.. ఇదే భూమికి గతంలో పట్టా పొందానని, పట్టా ఇచ్చిన భూమి ఎలా తీసుకుంటారని గ్రామానికి చెందిన అరిమెల గణికలు అనే గిరిజనుడు ప్రశ్నించాడు. దీంతో ప్రస్తుతం రికార్డుల పరంగా ఈ భూమి ప్రభుత్వానికి చెందినట్లుగా నమోదై ఉందని, గతంలో పట్టా పొందినట్టుగా రికార్డుల్లో నమోదై ఉంటే ఈ విషయమై విచారణ జరుపుతామని ఆర్డీఓ తెలిపారు. అదే విధంగా లాగే రెవెన్యూ కార్యాలయంలో గల రికార్డు రూంలో గల పాత రికార్డులు పరిశీలించి తనకు నివేదించాలని మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి, వీఆర్‌వో నాగమణిని ఆదేశించారు.

ఔషధ మొక్కలను పరిశీలించించిన ఎన్ఎంపీబీ

దేవరాపల్లి: దేవరాపల్లి రేంజ్ పరిధిలో ఫారెస్ట్ అటవీశాఖ వేసిన ఔషధ మొక్కలను (మెడిసిన్ ప్లాంటేషన్) బుధవారం నేషనల్ మెడిసిన్ ప్లాంటేషన్ బోర్డు (ఎన్ఎంపీబీ) సభ్యులు తనిఖీ చేశారు.

దిబ్బపాలెం, నగరపాలెం, ఫారెస్ట్ పరిధిలో 20 హెక్టార్లలో సాగవుతున్న ఔషధ మొక్కలను వారు పరిశీలించారు. వీటిలో కాగు, మారేడు, తెల్లమద్ది, వేప, గోరింట, ఉసిరి, కలబంద తదితర మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎన్ఎంపీబీ బోర్డు సభ్యులు ఇంద్రజిత్‌కౌర్, కిరణ్‌తుమ్మ, సంజీవ్ బండారి మాట్లాడుతూ.. కొత్తఢిల్లీకి చెందిన వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన వ్యవసాయ వ్యాపార సమాఖ్య (అసోసియేషన్ అగ్రి బిజినెస్ డివిజన్ మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) తమను ఈ పరిశీలనకు నియమించిందన్నారు. ఔషధ మొక్కల స్థితిగతులు పరిశీలన చేసి వాటి పరిస్థితి, రిపోర్టు ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఏపీ ప్రభుత్వం గతంలో ఈ ఔషధ మొక్కల ఏర్పాటుకు రూ.13కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. సర్వే ఈ నెల 21లోగా పూర్తి చేసి జాతాయ ఔషధ బోర్డు (నేషనల్ మెడిసిన్ బోర్డు)కు అందజేస్తున్నామని తెలిపారు. ఈ ప్లాంటేషన్లు ఆంధ్రప్రదేశ్‌లో 19 ప్రాంతాల్లో ఉన్నాయని అన్నారు. నిర్వహణ బాధ్యతను అటవీశాఖకు అప్పగించడం జరిగిందన్నారు.



ఔషధ మొక్కకు ఫోటో తీస్తున్న ఎన్ఎంపీబీ బోర్డు సభ్యులు

ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఎస్.వెంకటరావు, అటవీ శాఖ సిబ్బంది ఎం.రమేష్‌కుమార్, ఎ.శివప్రసాద్, పి.శంకరరావు, ఎల్.రాంబాబు, కృష్ణమూర్తి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జిగా మొల్లి రమణబాబు నియామకం



అనకాపల్లిటౌన్, ఆగస్టు 16: సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జిగా రాష్ట్ర కార్యదర్శి మొల్లి రమణబాబు నియమితులయ్యారు. ఈ అంశమై రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాల ప్రకారం ఉత్తరాంధ్ర జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్టు రమణబాబు బుధవారం తెలిపారు. బీసీల సమస్యలపై స్పందిస్తూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఐటీఐ విద్యార్థి మృతి

పెందుర్తి : విద్యుదాఘాతానికి గురైన ఐటీఐ విద్యార్థి బుధవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి ప్రగతి కేంద్రం ఎదురుగా గల హోటల్ యజమాని కుమారుడు బి.గణేష్ (17) బుధవారం రాత్రి విద్యుదాఘాతానికి గురయ్యాడు.

హోటల్ మేడ మీద గల ఇంట్లో ఉంటున్న ఈ యువకుడు అప్రయత్నంగా విద్యుత్తు తీగకు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబసభ్యులు గోపాలపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు గణేష్ పెందుర్తిలో ఐటీఐ చదువుతున్నాడు.



గణేష్ మృతదేహం

మూడు కేంద్రాల్లో గ్రూప్ -1 పరీక్షలు

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి 28 వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష విశాఖపట్నంలో మూడు కేంద్రాలలో నిర్వహించనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈనెల 17 నుంచి 28 వరకు ఆనందపురం మండలం గుడిలోవ, ఐవోసీ పెట్రోల్‌బంకు వద్ద ఉన్న ఏక్యూజేపీజీ కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి తీసుకొని, హాల్‌టిక్కెట్‌తోపాటు ఉదయం 9 గంటలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద వీడియోగ్రాఫర్లు, లైజన్ అధికారులను నియమించామన్నారు.

పండిట్, పీఈటీ బదిలీల కౌన్సెలింగ్ రేపు

విశాఖపట్నం : తెలుగు, హిందీ పండిట్‌లు, పీఈటీల బదిలీలకు సంబంధించి శుక్రవారం జిల్లా పరిషత్‌లో కౌన్సెలింగ్ జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి నాగమణి తెలిపారు. ఉదయం పది నుంచి ఒంటి గంట వరకు తెలుగు పండిట్‌లకు, మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల వరకు హిందీ పంటిట్‌లకు, తరువాత పీఈటీలకు కౌన్సెలింగ్ జరుగ నుందని పేర్కొన్నారు. బదిలీలకు సంబంధించిన ఉపాధ్యాయులు హాజరుకావాలని ఆమె కోరారు.

'ఆజీవక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన' ముఖ్య ఉద్దేశం?

1. 2020, 2024, 2028 ఒలింపిక్స్‌ల్లో భారత ప్రమాణాల మెరుగుదలకు కావాల్సిన సూచనల నివేదికను కేంద్ర క్రీడల శాఖకు సమర్పించిన ఎనిమిది మంది సభ్యుల కమిటీలో లేనివారు?
ఎ) పుల్లెల గోపీచంద్ బి) వీరేన్ రస్కిన్హా
సి) మిల్కాసింగ్ డి) అభినవ్ బింద్రా

2. భారత సుప్రీంకోర్టు తదుపరి, 45వ ప్రధాన న్యాయమూర్తిగా ఎవరు ఎంపికయ్యారు?
ఎ) జస్టిస్ ఎన్.వి.రమణ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ రంజన్ గగోయ్
డి) జస్టిస్ సంజన్ కిషన్ కాలే

3. కెన్యా అధ్యక్షుడిగా ఇటీవల తిరిగి ఎవరు ఎన్నికయ్యారు?
ఎ) ఊహూరు కెన్యాట్ట బి) డేనియల్ అరప్ మాయి
సి) జోమ్ కెన్యాట్ట డి) మవాయి కిబాకి

4. 2017 ఆగస్టు 11న ముప్పవరపు వెంకయ్య నాయుడు భారతదేశానికి ఎన్నో ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేశారు?
ఎ) 15 బి) 14 సి) 16 డి) 13

5. కేంద్ర సెన్సార్ బోర్డు నూతన చైర్మన్?
ఎ) ప్రసూన్ జోషి బి) విద్యాబాలన్
సి) పహలాజ్ నిహాలని డి) అదూర్ గోపాలకృష్ణన్

6. 2017లో లండన్ వేదికగా జరిగిన 'ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్' జావెలిన్ త్రో విభాగంలో ఫైనల్‌కి చేరిన తొలి భారతీయుడు?
ఎ) నీరజ్ చోప్రా బి) దవింద్‌సింగ్ ఖాంగ్
సి) వికాస్‌గౌడ్ డి) అనిల్‌కుమార్

7. ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం?
ఎ) ఆగస్టు 12 బి) ఆగస్టు 10
సి) ఆగస్టు 15 డి) ఆగస్టు 9

8. పర్యావరణ హానికరమైన 50 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ బ్యాగ్‌లను 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' ఇటీవల ఏ ప్రాంతంలో నిషేధించింది?
ఎ) చెన్నై బి) బెంగళూరు సి) కోల్‌కతా డి) ఢిల్లీ

9. పేదలకు అతి తక్కువ ధరకు మందులను విక్రయించే 'ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన(పిఎంబిజెపై)' కేంద్రాలను 1000కి పైగా ఏర్పాటు చేయడానికి కేంద్రంతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకొన్న రాష్ట్రం?
ఎ) బీహార్ బి) ఉత్తరాఖండ్
సి) ఉత్తరప్రదేశ్ డి) హర్యానా

10. 2017 నవంబరు 28న జరిగే 'ప్రపంచ భాగస్వామ్య సదస్సు'కు ఆతిథ్యమిస్తున్న నగరం?
ఎ) అహ్మదాబాద్ బి) కాన్పూర్
సి) మద్రాస్ డి) హైదరాబాద్

11. మసూమా ఎబ్టేకర్, మౌలావర్ది అనే మహిళలు ఏ దేశానికి ఉపాధ్యక్షులుగా ఇటీవల నియమితులయ్యారు?
ఎ) ఇరాన్ బి) పాకిస్థాన్ సి) ఇరాక్ డి) జోర్డాన్

12. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నూతన చైర్మన్?
ఎ) షహర్యార్‌ఖాన్ బి) నజమ్ సేథి
సి) జహీర్ అబ్బాస్ డి) జావెద్ మియందాద్

13. కేంద్ర స్వయం సహాయక సంఘాల కార్యక్రమాల డిజిటలైజేషన్ కోసం 'ఈ-శక్తి' అనే కార్యక్రమం నిర్వహిస్తున్న సంస్థ?
ఎ) స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బి) ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సి) రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా
డి) నేషనల్ బ్యాంక్ ఫర్ రూరల్ అండ్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్

14. 'BIMSTEC' కి సంబంధించి సరైనది?
ఎ) బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కోఆపరేషన్
బి) 1997 జూన్ 6న ప్రారంభం
సి) సభ్యదేశాలు - బంగ్లాదేశ్, ఇండియా, మయన్మార్, థాయ్‌లాండ్, భూటాన్, నేపాల్, శ్రీలంక డి) పైవన్నీ

15. 2017 ఆగస్టు 8న 'BIMSTEC' దేశాలు తమ తొలి విపత్తు నిర్వహణ విన్యాసాలను ఏ నగరంలో ప్రారంభించాయి?
ఎ) థింపు(భూటాన్)
బి) జయవర్ధనపుర కొట్టె(శ్రీలంక)
సి) న్యేపిడా(మయన్మార్)
డి) న్యూఢిల్లీ(ఇండియా)


ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

16. అయోధ్య వివాదానికి సంబంధించి అన్ని కేసుల పరిశీలనకు సుప్రీం కోర్టు ఇటీవల నియమించిన ముగ్గురు జడ్జీల కమిటీకి నేతృత్వం వహిస్తున్నది?
ఎ) జస్టిస్ జాస్తి చలమేశ్వర్
బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ కురియన్ జోసఫ్
డి) జస్టిస్ రోహింటన్ ఫాలి నారిమన్

17. 2017కి గాను UEFA సూపర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ విజేత?
ఎ) రియల్ మాడ్రిడ్ క్లబ్
బి) యునైటెడ్ మాంచెస్టర్స్ క్లబ్
సి) బార్సిలోన క్లబ్ డి) మిలాన్ క్లబ్

18. 2017 ఆగస్టులో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 'ప్రపంచ ఏనుగుల దినోత్సవం' సందర్భంగా 'గజయాత్ర' ప్రచార కార్యక్రమం ప్రారంభించింది. 'ఏనుగుల దినోత్సవం' ఎప్పుడు?
ఎ) ఆగస్టు 16 బి) ఆగస్టు 9
సి) ఆగస్టు 8 డి) ఆగస్టు 12

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్



19. అంగారక గ్రహంపై మేఘాల దృశ్యాలను చిత్రీకరించిన 'క్యూరియాసిటీ' రోవర్ ఏ దేశానికి చెందింది?
ఎ) జపాన్ బి) రష్యా సి) ఇండియా డి) అమెరికా

20. 2017 అక్టోబరు 19 నుంచి 29 వరకు రష్యా, భారత్ సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?
ఎ) వరుణ బి) గరుడ సి) ఇంద్ర డి) మిత్రశక్తి

21. పదవికి రాజీనామా చేసిన గురుదీప్‌సింగ్ సప్పాల్ స్థానంలో నియమితులైన రాజ్యసభ టి.వి. నూతన సిఇఒ?
ఎ) సూర్యప్రకాశ్ బి) వెంపటి శశిశేఖర్
సి) శోభాసేన్ డి) మృదులాసిన్హా

22. 2017 ఆగస్టు 9, 10 తేదీల్లో 'ఇండియన్ టెక్నాలజీ కాంగ్రెస్'ను నిర్వహించిన నగరం?
ఎ) బెంగళూరు బి) హైదరాబాద్
సి) అలహాబాద్ డి) కోల్‌కతా

23. 'భారత్-ఆసియాన్ దేశాల యువసదస్సు'కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?
ఎ) భోపాల్(మధ్యప్రదేశ్)
బి) మాండలే(మయన్మార్)
సి) కంపాంగ్ చామ్(కంబోడియ)
డి) సిసిలి(ఇండోనేషియా)

24. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఇటీవల రూపొందించిన మూకీ(సంజ్ఞలు) భాషలో 'జనగణమన'కు దర్శకత్వం వహించింది?
ఎ) మధుర్ బండార్కర్ బి) అభిషేక్ చాబే
సి) గోవింద్ నిహలాని డి) అలంక్రిత్ శ్రీవాస్తవ్

25. 2017 ఆగస్టులో భారత కోస్ట్‌గార్డ్ దళం ప్రవేశపెట్టిన తీరగస్తీ నౌక?
ఎ) ఐఎన్ఎస్ మిత్ర బి) ఐఎన్ఎస్ మౌర్య
సి) ఐఎన్ఎస్ శౌర్య డి) ఐఎన్ఎస్ సుచిత్ర

26. 2017కి గాను 'ద హ్యూగో అవార్డు' పొందిన నవల 'ద ఒబిలిస్క్ గేట్' రచయిత?
ఎ) ఎన్.పి.ఉల్లేఖ్ బి) నోరా.కె.జెమిసిన్
సి) జేవియర్ మోరో డి) అనురాధ రాయ్

27. 2017 నవంబరులో జరగాల్సిన అండర్ 19 క్రికెట్ ఆసియా కప్ ఆతిథ్య వేదికను బెంగళూరు నుంచి ఎక్కడికి మార్చారు?
ఎ) శ్రీలంక బి) మలేషియా
సి) బంగ్లాదేశ్ డి) పాకిస్థాన్

28. కుష్ఠు వ్యాధి నివారణ కోసం పోరాడి ఇటీవల మరణించిన 'రూత్‌పా'ని ఏ దేశంలో మరో 'మదర్ థెరిసా'గా వ్యవహరిస్తున్నారు?
ఎ) పాకిస్థాన్ బి) కజకిస్థాన్
సి) శ్రీలంక డి) నేపాల్

29. కజకిస్థాన్ రాజధాని ఆస్తానా వేదికగా ముగిసిన ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన మహేశ్వరి చౌహాన్ ఏ క్రీడకు చెందిన వ్యక్తి?
ఎ) ఆర్చరీ బి) బాక్సింగ్ సి) టెన్నిస్ డి) షూటింగ్

30. 'దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన'లో భాగంగా కేంద్రం ప్రారంభించిన 'ఆజీవక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన' ముఖ్య ఉద్దేశం?
ఎ) అసహాయ వర్గాలకు పెన్షన్ అందించడం
బి) వ్యవసాయ రంగంలో ఉచిత ట్రాక్టర్లు అందించడం
సి) గ్రామీణ ప్రాంతాల్లో రవాణా స్వయం సహాయక సంఘాలు నిర్వహించడం
డి) బ్యాంకింగ్ రంగంలో గ్రామీణ పరపతిని పెంచడం

31. ఎడిస్ ఈజిప్ట్ ద్వారా సంక్రమించే జికా వైరస్ క్యూలెక్స్ దోమల ద్వారా సంక్రమిస్తుందని ఏ దేశ శాస్త్రవేత్తల పరిశోధనలు వెల్లడించాయి?
ఎ) కెనడా బి) సెనెగల్ సి) పెరూ డి) బ్రెజిల్

32. SATH(సస్టైనయిబుల్ యాక్షన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ హ్యూమన్ క్యాపిటల్) కార్యక్రమంలో భాగంగా 'నీతి ఆయోగ్' ఆరోగ్య కార్యక్రమాలు అమలుచేస్తున్న మూడు రాష్ట్రాల్లో లేనిది?
ఎ) కర్ణాటక బి) అస్సోం సి) హర్యానా డి) ఉత్తరప్రదేశ్

33. SATH కార్యక్రమంలో భాగంగా 'నీతి ఆయోగ్' విద్య కార్యక్రమాలు అమలు చేస్తున్న మూడు రాష్ట్రాల్లో లేనిది?
ఎ) బీహార్ బి) ఒడిశా సి) జార్ఖండ్ డి) మధ్యప్రదేశ్

34. ఏ కార్యక్రమం 75 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా మోదీ నూతన భారత నిర్మాణం కోసం 'సంకల్ప్ సె సిద్ధి' అనే ప్రచారానికి పిలుపునిచ్చారు?
ఎ) చంపారన్ ఉద్యమం
బి) క్విట్ ఇండియా ఉద్యమం
సి) సహాయ నిరాకరణ ఉద్యమం
డి) శాసన ఉల్లంఘన ఉద్యమం

35. ఇటీవల గుజరాత్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ముగ్గురిలో లేనివారు?
ఎ) స్మృతి ఇరాని బి) అహ్మద్ పటేల్
సి) శంకర్ సింఘ్ వాఘేలా డి) అమిత్‌షా

36. ఇటీవల మరణించిన కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత అజ్మీర్ ఎం.పి. సన్వర్‌లాల్ జాట్ ఏ పార్టీకి చెందినవారు?
ఎ) నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి)
బి) భారతీయ జనతాపార్టీ(బిజెపి)
సి) ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్ఎల్‌డి)
డి) ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సి)

37. ఆసియా సొసైటీ నుంచి 2017కి గాను 'ఆసియా గేమ్ చేంజర్స్ అవార్డు'కి ఎంపికైనది?
ఎ) నరేంద్ర మోదీ బి) రవీంద్ర జడేజా
సి) జాక్ మా డి) దేవ్ పటేల్

38. 17 దేశాలు పాల్గొన్న 'హార్ట్ ఆఫ్ ఆసియా' 8వ సమావేశానికి 2017 ఆగస్టులో ఆతిథ్యం ఇచ్చిన నగరం?
ఎ) ఆస్తానా(కజకిస్థాన్) బి) ఇస్తాంబుల్(టర్కీ)
సి) బాకు(అజర్‌బైజాన్) డి) న్యూఢిల్లీ(ఇండియా)

39. ప్రపంచ యువజన దినోత్సవంగా ఆగస్టు 12ని ఐక్యరాజ్య సమితి ఎప్పటి నుంచి నిర్వహిస్తుంది?
ఎ) 2000 బి) 1975 సి) 2002 డి) 1989

40. భారత్‌లో తొలిసారి 'విపత్తు నిర్వహణ సంస్థ'ను రైల్వే శాఖ ఏ గ్రామంలో ఏర్పాటు చేస్తుంది?
ఎ) హెజ్జాల(బెంగళూరు) బి) బికనూర్(తెలంగాణ)
సి) యలమంచలి(ఆంధ్రప్రదేశ్)
డి) గుర్‌గామ్(హర్యానా)

41. 2016 గణాంకాల ప్రకారం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వెలువరించిన నివేదిక ప్రకారం 2021 నాటికి ఆసియాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందనున్న నగరం?
ఎ) ఢిల్లీ(ఇండియా) బి) హనోయ్(వియత్నాం)
సి) టోక్యో(జపాన్) డి) ముంబై(ఇండియా)

42. యు ట్యూబ్‌కు పోటీగా 2017 ఆగస్టు 10న ఫేస్‌బుక్ ప్రారంభించిన చానల్?
ఎ) బీ మై ఐస్ బి) విర్గో సి) వాచ్ డి) లిటిల్ వండర్

43. ఒలింపిక్ పతకం సాధించే సత్తా కలిగిన క్రీడాకారుల సహాయం కోసం ప్రారంభించిన 'టార్గెట్ ఆన్ ఒలింపిక్ పోడియం'లో చోటు పొందిన అతి పిన్న వయస్కుడు(15 ఏళ్లు) శపథ్ భరద్వాజ్ ఏ క్రీడాకారుడు?
ఎ) బ్యాడ్మింటన్ బి) స్విమ్మింగ్
సి) బాక్సింగ్ డి) షూటింగ్

44. భారత్‌తో సహా 80 దేశాలకు వీసా రహిత ప్రవేశానుమతి ఇస్తున్నట్లు ప్రకటించిన దేశం?
ఎ) సౌదీఅరేబియా బి) టర్కీ సి) ఫిజి డి) ఖతార్

సమాధానాలు

1) సి	7) బి	13) డి	21) బి	29) డి	37) డి
2) బి	8) డి	14) డి	22) ఎ	30) సి	38) డి
3) ఎ	9) సి	15) డి	23) ఎ	31) డి	39) ఎ
4) డి	10) డి	16) బి	24) సి	32) సి	40) ఎ
5) ఎ	11) ఎ	17) ఎ	25) సి	33) ఎ	41) ఎ
6) బి	12) బి	18) డి	26) బి	34) బి	42) సి
		19) డి	27) బి	35) సి	43) డి
		20) సి	28) ఎ	36) బి	44) డి

ఉద్యోగాలు

ఎన్‌హెచ్‌ఎఐ

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఎఐ)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన సైట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 18
కాంట్రాక్ట్ వ్యవధి: రెండేళ్లు
అర్హత: బిఇ/ బిటెక్(సివిల్) ఉత్తీర్ణతతోపాటు రోడ్ & హైవే వర్క్స్‌లో ఏడాది అనుభవం ఉండాలి.
వయసు: దరఖాస్తు నాటికి 30 ఏళ్లు ఉండాలి.
వేతనం: నెలకు రూ.50,000
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 4
చిరునామా: Chief General Manager(Tech) & Regional Officer, Chennai
National Highways Authority of India Regional Office - Chennai
SRI Tower, 3rd Floor, DP - 34(SP), Industrial Estate, Guindy, Chennai, Tamil Nadu - 600032 **వెబ్‌సైట్:** www.nhai.org

ఆర్మీ వార్ కాలేజ్

మధ్యప్రదేశ్, మహౌలోని ఆర్మీ వార్ కాలేజ్ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 10
పోస్టులు: ఎల్‌డిసి 3, సివిలియన్ మోటార్ డ్రైవర్ 2, కుక్ 1, సూపర్‌వైజర్ 3, ఫాటిగ్‌మన్ 1
అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్/ ఇంటర్ ఉత్తీర్ణత + నిమిషానికి 30 పదాల టైపింగ్ వేగం+ ఏడాది అనుభవం ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఫిజికల్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.50
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 27
చిరునామా: The Presiding Officer, Civilian Direct Recruitment(Scrutiny of Applications) Board, Junior Command Wing, Army War College, Mhow, Madhya Pradesh - 453441

పప్పు ధాన్యాల ఉత్పత్తిలో భారతదేశ స్థానం?

భారతదేశ వ్యవసాయ రంగం

1. భారతదేశంలో సుమారు ఎంత శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి ఉంది?
ఎ) 46 బి) 50 సి) 58 డి) 64
2. స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా ఎంత శాతం?
ఎ) 14 బి) 15 సి) 16.5 డి) 17.5
3. భారతదేశంలో ఎంత శాతం జనాభా పేదరికంలో ఉంది?
ఎ) 24 బి) 25 సి) 26 డి) 27
4. ఒక దేశ అభివృద్ధికి సరైన నిర్వచనం దేనితో తెలుస్తుంది?
ఎ) వ్యవసాయ రంగం బి) రవాణా రంగం
సి) స్థూల ఉత్పత్తి రంగం డి) తలసరి ఆదాయం
5. భారత ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా దేనిపై ఆధారపడి ఉంది?
ఎ) తయారీ రంగం బి) కార్పొరేట్ రంగం
సి) ప్రభుత్వ రంగం డి) వ్యవసాయ రంగం
6. 'ఆపరేషన్ ఫ్లడ్'కు పితామహుడు?
ఎ) నార్మన్ బొర్లాగ్ బి) ఎం.ఎస్. స్వామినాథన్
సి) డా. వర్గీస్ కురియన్ డి) విలియం గాండీ
7. భారతదేశంలో నూనె గింజల ఉత్పత్తి పెరగడానికి కారణం
ఎ) వైట్ రెవల్యూషన్ బి) ఎల్లో రెవల్యూషన్
సి) గ్రీన్ రెవల్యూషన్ డి) బ్రౌన్ రెవల్యూషన్
8. భారతదేశంలో అత్యధికంగా తేయాకును ఉత్పత్తి చేసే రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) సిక్కిం
సి) అసోం డి) పశ్చిమ బెంగాల్
9. జాతీయ వ్యవసాయ బీమా పథకం ఎప్పటినుంచి అమల్లోకి వచ్చింది?
ఎ) 1997 అక్టోబరు బి) 1998 అక్టోబరు
సి) 1999 అక్టోబరు డి) 2000 అక్టోబరు
10. కింది వాటిలో ఖరీఫ్ పంట కానిది?
ఎ) జొన్న బి) మొక్క జొన్న
సి) వేరుశనగ డి) గోధుమ
11. కిందివాటిలో భారత జాతీయ ఆదాయాన్ని మదించే సంస్థ?
ఎ) ప్రణాళికా సంఘం
బి) జాతీయ డేటా సెంటర్
సి) జాతీయ గణాంక సంస్థ
డి) ఏదీకాదు
12. నేషనల్ శాంపిల్ సర్వే సంస్థను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1947 బి) 1948
సి) 1949 డి) 1950
13. దేశంలో అత్యధికంగా రబ్బరును ఉత్పత్తి చేసే రాష్ట్రం?
ఎ) పశ్చిమ బెంగాల్ బి) గుజరాత్
సి) ఉత్తరప్రదేశ్ డి) కేరళ
14. 'ద ఫ్యూచర్ ఆఫ్ ఇండియా' గ్రంథ రచయిత?
ఎ) అమర్త్యసేన్ బి) బిమల్ జలాన్
సి) అభిషేక్ నాయర్ డి) చేతన్ భగత్
15. కుద్రేముఖ్ ఇనుప ఖనిజ ఫీల్డ్ ఏ రాష్ట్రంలో ఉంది?
ఎ) కేరళ బి) తమిళనాడు
సి) గుజరాత్ డి) కర్ణాటక
16. కూరగాయల ఉత్పత్తిలో భారతదేశ స్థానం?
ఎ) మొదటి బి) రెండు 3) మూడు 4) నాలుగు



సందీప్ కంభంపాటి
సీనియర్ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

17. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో భారతదేశ స్థానం?
ఎ) మొదటి బి) రెండు
సి) మూడు డి) నాలుగు



18. నాబార్డ్‌ను ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1980 బి) 1981 సి) 1982 డి) 1983
19. హరిత విప్లవం ఎప్పుడు ప్రారంభమైంది?
ఎ) 1964 - 65 బి) 1965 - 66
సి) 1966 -67 డి) 1967 - 68
20. ప్రధాన మంత్రి గ్రామోద్యమ యోజన ఎప్పుడు ప్రారంభమైంది?
ఎ) 1999 బి) 2000 సి) 2001 డి) 2002
21. కింది వారిలో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ చట్టాన్ని ఎవరు ప్రకటించారు?
ఎ) ప్రణబ్ ముఖర్జీ బి) మన్మోహన్ సింగ్
సి) చిదంబరం డి) అరుణ్ జైట్లీ
22. ప్రభుత్వ కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1953 ఏప్రిల్ బి) 1998 ఆగస్టు
సి) 1991 జూలై డి) 1995 నవంబరు
23. కిసాన్ కాల్ సెంటర్లను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 2000 జూలై బి) 2002 మార్చి
సి) 2004 మార్చి డి) 2004 జనవరి
24. మైక్రో ఇరిగేషన్ పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 2002 మార్చి బి) 2004 మార్చి
సి) 2004 జనవరి డి) 2006 జనవరి
25. 2013- 14 లెక్కల ప్రకారం అత్యధికంగా ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసిన రాష్ట్రం?
ఎ) మధ్యప్రదేశ్ బి) పంజాబ్
సి) ఉత్తరప్రదేశ్ డి) మహారాష్ట్ర
26. 2010 లెక్కల ప్రకారం భారతదేశంలో చెరువుల ద్వారా అత్యధిక భూమి సాగులో ఉన్న రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) కర్ణాటక
సి) తమిళనాడు డి) ఉత్తరప్రదేశ్
27. జాతీయ ఆహార భద్రత పథకాన్ని ఏ కాలంలో ప్రారంభించారు?
ఎ) తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక మధ్యలో
బి) పదో పంచవర్ష ప్రణాళిక చివరలో
సి) పదకొండో పంచవర్ష ప్రణాళిక మధ్యలో
డి) పదకొండో పంచవర్ష ప్రణాళిక చివరలో
28. 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన'ను ప్రకటించినవారు?
ఎ) నరేంద్రమోది బి) మన్మోహన్ సింగ్
సి) ఎ.బి. వాజపేయి డి) ఐ.కె. గుజ్రాల్
29. భారత్‌లో జనపనార సాగు, ఏ నదీ పరీవాహక ప్రాంతంలో ఎక్కువగా కేంద్రీకృతమైంది?
ఎ) గంగ బి) మహానది
సి) బ్రహ్మపుత్ర డి) గోదావరి
30. భారత్‌లో అతి పొడవైన సేద్య కాలువ?
ఎ) బకింగ్ హం బి) సర్‌వాంద్
సి) ఇందిరాగాంధీ డి) సట్లెజ్ - యమున
31. అత్యధికంగా పత్తిని ఉత్పత్తి చేసే రాష్ట్రం?
ఎ) మహారాష్ట్ర బి) మధ్యప్రదేశ్
సి) ఆంధ్రప్రదేశ్ డి) గుజరాత్
32. రబీ, ఖరీఫ్‌లే కాక వ్యవసాయ రంగంలోని మరో కాలం?
ఎ) జమాద్ బి) బరేసాతి సి) షరద్ డి) ఝుం
33. నేలకు ఎక్కువ నత్రజనిని అందించాలంటే ఏ పంటను పండించాలి?
ఎ) గోధుమ బి) ఆవాలు
సి) పొద్దు తిరుగుడు డి) చిరుధాన్యాలు
34. కింది వాటిలో ఏ పంటకు నల్ల రేగడి భూమి ఎక్కువగా అనుకూలించదు?
ఎ) పత్తి బి) గోధుమ
సి) వేరుశనగ డి) బంగాళదుంప
35. కింది వాటిలో వాణిజ్య పంట ఏది?
ఎ) వరి బి) గోధుమ
సి) చెరకు డి) జొన్నలు
36. కేరళలో ఎక్కువగా వినియోగించే వరి వంగడాన్ని ఉప్పునేలలో కూడా సాగుచేయవచ్చు. అయితే దాని పేరు?
ఎ) నీవారా బి) పొక్కలి సి) పొన్ని డి) సాంబ
37. పర్వత ప్రాంతాల్లో దేనిని ఎక్కువగా పండిస్తారు?
ఎ) వరి బి) తేయాకు
సి) వేరుశనగ డి) బంగాళదుంప
38. భారత్‌లో ఎక్కువగా ఉత్పత్తయ్యే కాఫీ రకం?
ఎ) ఓల్డ్ చిక్స్ బి) కూర్గే
సి) అరబిక్ డి) కెంట్స్
39. కేంద్రీయ వరి పరిశోధన సంస్థ ఎక్కడ ఉంది?
ఎ) బెంగళూరు బి) కాన్పూరు
సి) కోయంబత్తూరు డి) కటక్
40. ఏ పంచవర్ష ప్రణాళిక కాలంలో వ్యవసాయ రంగంలో రుణాత్మక వృద్ధి నమోదయింది?
ఎ) మూడో బి) రెండో
సి) ఏడో డి) తొమ్మిదో

సమాధానాలు

1) సి	7) బి	13) డి
2) డి	8) సి	14) బి
3) సి	9) సి	15) డి
4) డి	10) డి	16) బి
5) డి	11) సి	17) ఎ
6) సి	12) డి	18) సి

19) సి	27) డి	35) సి
20) బి	28) బి	36) బి
21) ఎ	29) ఎ	37) బి
22) బి	30) సి	38) సి
23) డి	31) డి	39) డి
24) డి	32) ఎ	40) ఎ
25) సి	33) డి	
26) సి	34) సి	

ఉద్యోగాలు

గెయిల్ ఇండియా

గెయిల్ ఇండియా లిమిటెడ్ - కింది విభాగాల్లో **ఎస్ 3 & ఎస్ 5** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 151
విభాగాలు: ఎలక్ట్రికల్, ఫైనాన్స్ & అకౌంట్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, లేబొరేటరీ, మార్కెటింగ్, అఫిషియల్ లాంగ్వేజ్, స్టోర్స్ & పర్చేజ్
పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
వెబ్‌సైట్: www.gailonline.com

ఇండియన్ ఎయిర్ ఫోర్స్

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఎఎఫ్)- **సూపరింటెండెంట్, స్టోర్ కీపర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 95
పోస్టులు - ఖాళీలు: స్టోర్ సూపరింటెండెంట్ 55, స్టోర్ కీపర్ 40
అర్హత: సూపరింటెండెంట్‌కు డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. స్టోర్ కీపర్ పోస్టుకు ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. రెండు పోస్టులకు స్టోర్ అకౌంట్స్ మెయింటైన్ చేయడంలో అనుభవం ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్ ఆధారంగా
పరీక్ష కేంద్రం: ఢిల్లీ
ఆర్డినరీ పోస్టు ద్వారా దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 9
చిరునామా: Director PC(AHC), Air Head quarter, J Block, New Delhi - 110106
వెబ్‌సైట్: www.indianforce.nic.in

ఎఎహెచ్‌సి

అగ్రికల్చర్ & హార్టికల్చర్ కార్పొరేషన్- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 1600
పోస్టులు: డిస్ట్రిక్ట్ ఆఫీసర్(డేటా కలెక్షన్) 1182, డిస్ట్రిక్ట్ మేనేజర్ 197, ఎంఐఎస్ ఆఫీసర్ 197, ఏరియా మేనేజర్ 20, స్టేట్ హెడ్ 4
అర్హత: డిగ్రీ/ పీజీ ఉత్తీర్ణులై ఉండాలి
ఎంపిక: పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.700
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 2
వెబ్‌సైట్: www.aahc.org.in

వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్

వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
మొత్తం ఖాళీలు: 657
పోస్టులు - ఖాళీలు: మైనింగ్ సిర్దార్ 298, స్టాఫ్ నర్స్ 64, టెక్నీషియన్(రేడియోగ్రాఫర్ 1, పాథలాజికల్ 9, రిఫ్రాక్షన్/ ఆప్టోమెట్రీ 1), ఆడియొమెట్రీ టెక్నీషియన్ 4, జూనియర్ టెక్నీషియన్ (ఇసిజి/ ఇఇజి) 4, ఫార్మసిస్ట్ ట్రైనీ 2, ఓవర్సీర్ (సివిల్) 4, జూనియర్ టెక్నీషియన్ ఇన్‌స్పెక్టర్/ జూనియర్ కెమిస్ట్ 48, జూనియర్ డేటా ఎంట్రీ ఆపరేటర్ 32, ట్రాన్స్‌లేటర్ ట్రైనీ 9, క్లర్క్ 139, స్టోర్ ఇష్యూ క్లర్క్ 31, అసిస్టెంట్ లోడింగ్ క్లర్క్ 11
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా/ ఇంటర్/ మెట్రిక్యులేషన్/ డిగ్రీ పాసై ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 30
వెబ్‌సైట్: www.westerncoal.nic.in

ఐఐఎం

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
పోస్టులు: అకౌంటెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(జనరల్ అడ్మినిస్ట్రేషన్), జూనియర్ ఇంజనీర్, సీనియర్ లైబ్రరీ& ఇన్ఫో అసిస్టెంట్, స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్
వెబ్‌సైట్: www.iimv.ac.in/careers

ఐజిఎన్‌టియు

ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ (ఐజిఎన్‌టియు)- ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
క్యాంపస్‌లు: అమర్‌కంటక్ క్యాంపస్ (యోగా డిపార్ట్‌మెంట్, కృషి విజ్ఞాన్ కేంద్ర ఐసిఎఆర్ ప్రాజెక్ట్, మోడల్ ట్రైబల్ స్కూల్), రీజనల్ క్యాంపస్ (మణిపూర్)(డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ, సోషల్ ఆంత్రపాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 11
వెబ్‌సైట్: www.igntu.ac.in/recruitment.htm

ఇసిఐఎల్

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఇసిఐఎల్) - కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది
పోస్టులు: ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(న్యూక్లియర్), జనరల్ మేనేజర్(ఆర్&డి), డిప్యూటీ జనరల్ మేనేజర్(కంపెనీ సెక్రటరీ), పర్చేజ్ మేనేజర్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్
వెబ్‌సైట్: http://careers.ecil.co.in

రైట్స్ లిమిటెడ్

రైట్స్ లిమిటెడ్ - కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
పోస్టులు: అడిషనల్ జనరల్ మేనేజర్ (సివిల్) 2, జాయింట్ జనరల్ మేనేజర్(సివిల్ 2, ఇ&ఎం ఎక్స్‌పర్ట్ 2), మేనేజర్(సోషియాలజీ, సోషల్ వర్క్) 1, అసిస్టెంట్ మేనేజర్(ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ 2, సోషియాలజీ / సోషల్ వర్క్ 2, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ 4), సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (సివిల్) 1, డిప్యూటీ జనరల్ మేనేజర్(సివిల్) 1
పూర్తి వివరాలకు ఆగస్టు 26 నాటి ఎంప్లాయిమెంట్ న్యూస్ చూడవచ్చు
వెబ్‌సైట్: www.rites.com

గణేష్‌పై ఏసీబీ గురి

విచారణ అనంతరం మరికొందరి అరెస్టులు వుండే అవకాశం

అతని ఆస్తులపై దృష్టిసారించాలని సిట్ లేఖ

ఓ మంత్రి ఆశీస్సులతో 2005లో సర్వే శాఖ ఏడీగా నియామకం

కుల ధ్రువీకరణపై ఫిర్యాదులు అందడంతో 15 రోజుల్లోనే పక్కనపెట్టిన ఉన్నతాధికారులు

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

విశాఖ భూకుంభకోణంలో ఇప్పటికే సర్వే ఇన్‌స్పెక్టర్ గణేశ్వరరావును అరెస్టు చేయించిన సిట్ ఆ శాఖలో మరికొందరిపై దృష్టిసారించింది. భీమిలి మాజీ తహసీల్దారు బీటీవీ రామారావును ఇటీవల కస్టడీకి తీసుకుని నాలుగు రోజులపాటు విచారించిన సిట్ అధికారులు సర్వే శాఖలోని అక్రమార్కుల వివరాలను రాబట్టినట్టు తెలిసింది. భీమిలి తహసీల్దార్‌గా రామారావు పనిచేసిన సమయంలో మాన్సాస్ భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులే కాకుండా సర్వే శాఖకు సంబంధించిన ఎఫ్ఎంబీలు, గ్రామపటాలను కూడా ఇష్టానుసారంగా మార్పులు చేర్పులు చేసినట్టు సిట్ గుర్తించింది. ఈ సందర్భంలోనే రెవెన్యూ శాఖతో కలిసి అనేక భూ అక్రమాలకు పాల్పడిన సర్వే ఇన్‌స్పెక్టర్ గణేశ్వరరావు చిట్టాను సేకరించినట్టు తెలిసింది. విశాఖలోని సర్వే ఏడీ కార్యాలయంలో సర్వే ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సమయంలో గణేశ్వరరావు భీమిలి, విశాఖ గ్రామీణ తహసీల్దారు కార్యాలయంలోని కొందరు సిబ్బందితో కలిసి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్టు తెలిసింది.

మాజీ మంత్రి దన్ను

విశాఖలో పనిచేసిన కాలంలో గణేశ్వరరావుకు విజయనగరం జిల్లాకు చెందిన ఒక మంత్రి ఆశీస్సులు పుష్కలంగా వుండేవని తెలిసింది. ఆయన దన్నుతోనే గణేశ్వరరావు సర్వే ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూనే ఏకంగా ఏడీ కుర్చీపై కన్నేసినట్టు సిబ్బంది చెబుతున్నారు. డబ్బు, రాజకీయ బలం మెండుగా వున్న ఆయన ఏడీగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టేలా 2005 డిసెంబర్ పదవ తేదీన ఉత్తర్వులు తెచ్చుకున్నారు. అయితే గణేశ్వరరావు కులధ్రువీకరణ పత్రం, అనర్హతపై సర్వే శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో ఆయన్ను అదే నెల 25వ తేదీ వరకూ అంటే కేవలం 15 రోజులు వరకు మాత్రమే ఏడీగా కొనసాగించారు. తరువాత యథావిధిగా సర్వే ఇన్‌స్పెక్టర్‌గా విశాఖలోనే బాధ్యతలు నిర్వహించిన ఆయన అనేక భూరికార్డుల ట్యాంపరింగ్‌కు పాల్పడినట్టు తెలిసింది. నకిలీ ఎఫ్ఎంబీలు, గ్రామ పటాలు సృష్టించి గణేశ్వరరావు అప్పట్లోనే భీమిలి, కొమ్మాది, మధురవాడ ప్రాంతాల్లో సుమారు 150 ఎకరాలకు పైగా మాన్సాస్ భూములకు నకిలీ రికార్డులు సృష్టించినట్టు సిట్ గుర్తించింది.

గణేశ్వరరావుపై ఏసీబీకి ఫిర్యాదు

ఇప్పటికే ఒకసారి ఏసీబీ కేసులో పట్టుబడిన సర్వేయర్ గణేశ్వరరావుపై మరోసారి దృష్టిసారించాలని అధికారులను సిట్ కోరినట్టు తెలిసింది. ఇటీవల అరెస్టయిన గణేశ్వరరావును తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూనే, మరోవైపు ఆయన అక్రమ సంపాదనపై వివిధ జిల్లాల్లో తనిఖీలు నిర్వహించాలని కోరుతూ సిట్ అధికారులు లేఖ రాసినట్టు సమాచారం. గణేశ్వరరావును విచారించిన అనంతరం ఆయన అక్రమ వ్యవహారాలలో పాలుపంచుకున్న మరికొందరు రెవెన్యూ, సర్వేశాఖ సిబ్బందిపై క్రిమినల్ కేసులు పెట్టించి అరెస్టులు చేయించాలని సిట్ భావిస్తోంది.

అనుచరుడికి 3.5 ఎకరాలు

అదుపులో తీసుకున్న సిట్ ◆ ఒకటి, రెండు రోజుల్లో మరికొందరి అరెస్టుకు సిద్ధం



విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): విశాఖ భూ కుంభకోణంపై విచారణ జరుపుతున్న సిట్ విజయనగరం సర్వే ఇన్‌స్పెక్టర్ గణేశ్వరరావ ప్రధాన అనుచరుడు డాక్యుమెంట్ రైటర్ అయిన దామోదర చంద్రశేఖర్‌రావును బుధవారం అదుపులోకి తీసుకుంది. వివిధ మండలాలకు చెందిన తహసీల్దార్ల సంతకాల ఫోర్జరీ, నకిలీ పాస్ పుస్తకాల తయారీ, రెవెన్యూ రికార్డుల తారుమారు వంటి అక్రమ వ్యవహారాల్లో గణేశ్వరరావుకు చంద్రశేఖర్ సహకరించినట్టు తెలిసింది. పందిమెట్ట ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్‌రావు పేరుతో మధురవాడ మండలంలో రెండు ఎకరాలు, ఎండాడలో ఎకరన్నర భూమి వున్నట్టు అధికారులు గుర్తించి అందుకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. డాక్యుమెంట్ రైటర్ అయిన చంద్రశేఖర్‌రావు సర్వేశాఖలోని ఎఫ్ఎంబీ, వన్‌బీ రికార్డుల్లో మార్పు చేర్పులు చేసినట్టు అధికారులు గుర్తించారు. ఒకటి, రెండు రోజుల్లో ఆయన నుంచి పూర్తి వివరాలు రాబట్టిన తరువాత గణేష్ గ్యాంగ్‌లో మరికొందరిని అరెస్టు చేయాలని సిట్ సిఫారసు చేయనున్నట్టు తెలిసింది.

కొడుకు గర్ల్‌ఫ్రెండ్ తల్లికి ప్రభుత్వ భూమి

ఇదీ సర్వేయర్ గణేశ్ ఘనకార్యం

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): భూ కుంభకోణంలో అరెస్ట్ చేసిన సర్వేయరు గేదెల లక్ష్మీ గణేశ్వరరావు కేసులో కొత్త కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. ఆయన ప్రభుత్వ భూములను ఇష్టమొచ్చినట్టు బంధువులు, స్నేహితులకు రాసిచ్చేశాడు. కొన్ని భూములను కుమారుడు పేరు మీద, అతడితో షార్ట్ ఫిల్మ్ తీసిన వ్యక్తికి మరికొన్ని భూములు రాసేశాడు. ఆ కుమారునికి ఓ గర్ల్‌ఫ్రెండ్ వుందని, ఆమె తల్లి పేరిట కూడా కొన్ని భూములకు డాక్యుమెంట్లు రూపొందించి రిజిష్టర్ చేసినట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అవి ఎక్కడున్నాయి? వాటి వివరాలు ఆరా తీస్తున్నారు.

ఇంటర్మీడియట్ ఫీజు చెల్లింపుకు 31 తుది గడువు

విశాఖపట్నం: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరు కావాలనుకునే ప్రైవేటు విద్యార్థులు హాజరు పట్టి కోసం ఈ నెల 31వ తేదీలోగా వెయ్యి రూపాయలు రుసుము చెల్లించాలని బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఆర్ఐవో ఓ ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం రూ.200 తో సెప్టెంబర్ 11వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. వెయ్యి రూపాయల ఫీజును బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ పేరు మీద ఆంధ్రాబ్యాంకులో డీడీ తీయాలని సూచించారు. మరింత సమాచారం కోసం సమీపంలోని కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

చిన్నారి లోకం పుస్తకావిష్కరణ

అక్కయ్యపాలెం: రాంబిల్లి మండలం గోవిందపాలెం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఏఎస్‌జీ రత్నకుమార్ రచించిన చిన్నారి లోకం పుస్తకాన్ని జగదాంబ జంక్షన్‌లోని జిల్లా సర్వశిక్షా అభియాన్ కార్యాలయంలో ఆ విభాగం ప్రాజెక్టు అధికారి టి.శివరాం ప్రసాద్, విద్యా విషయ పర్యవేక్షణాధికారి పీఎస్ఎన్ మూర్తి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అక్షరమాల, గుణింతాల ఆధారంగా బొమ్మలతో ఆకర్షణీయంగా ఈ పుస్తకాన్ని రూపొందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో రచయిత ఏఎస్‌జీ రత్నకుమార్, ఉపాధ్యాయుడు కె.గంగాధర్ పాల్గొన్నారు.

నేడు ఇంటర్ నాలుగో విడత అడ్మిషన్లు

విశాఖపట్నం: ఇంటర్ జనరల్, వృత్తి విద్యా కోర్సులలో నాలుగో విడిత అడ్మిషన్లు 17వ తేదీ నుంచి జరుగుతాయని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఆర్ఐవో ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31లోగా అడ్మిషన్లు పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల ప్రకారం అడ్మిషన్లు పూర్తి చేస్తామని తెలిపారు.

అనకాపల్లి మార్కెట్ ధరలు

కూరగాయలు (కిలో)



ఉల్లిపాయలు	రూ.35
బంగాళదుంపలు	రూ.15
టొమేటో	రూ.60
వంకాయలు(తెల్లవి)	రూ.35
వంకాయలు(నల్లవి)	రూ.35
బీరకాయలు	రూ.30
బెండకాయలు	రూ.30
దొండకాయలు	రూ.30
క్యారెట్	రూ.40
క్యాబేజీ	రూ.30
బీన్స్	రూ.70
కొబ్బరి కాయ(చిన్నది)	రూ.10
కొబ్బరికాయ(పెద్దది)	రూ.15
బీట్‌రూట్	రూ.40
మిర్చి	రూ.50
చిక్కుడు	రూ.--
గోరుచిక్కుడు	రూ.30
బరబాటీ	రూ.40
అల్లం	రూ.60
చేమదుంపలు	రూ.40
దోసకాయ	రూ.30
కాకరకాయలు	రూ.40
ఆనపకాయ(చిన్నది)	రూ.15
ఆనపకాయ(పెద్దది)	రూ.20
అరటికాయలు (మూడు)	రూ.20


పప్పు దినుసులు (కిలో)

కందిపప్పు	రూ.65
పెసరపప్పు	రూ.65
మినపపప్పు	రూ.70
శనగ పప్పు	రూ.75
పంచదార	రూ.44
ఇడ్లీనూక	రూ.28
గోధుమ రవ్వ	రూ.34
చింతపండు	రూ.100
మైదా	రూ.28

నూనె ధరలు (లీటర్)

పామోలిన్	రూ.62
సన్‌ప్లవర్	రూ.82
వేరుశనగ	రూ.120
కొబ్బరి	రూ.120
డాల్డా (కిలో)	రూ.70

కోడి గుడ్లు(నెక్)



వంద గుడ్లు రూ.లలో

విశాఖపట్నం	362
విజయనగరం	366
శ్రీకాకుళం	366


చికెన్ ధరలు

	వెన్‌కాబ్	బ్యాగ్
లైవ్ ధర	87.00	85.00
విత్ స్కిన్	122.00	140.00
స్కిన్ లెస్	144.00	150.00

బెల్లం ధరలు(రూ.లలో)

	కనిష్ఠ	గరిష్ఠ
మొదటి రకం	3570	4200
రెండో రకం	3150	4080
మూడో రకం	2750	3315

దినఫలాలు



అదృష్టసంఖ్యలు : 3, 8



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. విద్యా సంస్థలతో పనులు పూర్తవుతాయి. ప్రియతముల నుంచి ఆహ్లాదకరమైన సమాచారం అందుకుంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లకు అనుకూలం.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): ఆర్థిక విషయాల్లో మీ వైఖరిని సమీక్షించుకుంటారు. కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక పరమైన లక్ష్యాలు సాధిస్తారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం.



మిథునరాశి: (మే21-జూన్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు ఫలిస్తాయి. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. రాజకీయ, సినీరంగాల వారికి ప్రోత్సాహకరం. శుభవార్త అందుకుంటారు. రవాణా, బోధన రంగాల వారికి అనుకూలం.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూర్చుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. దూరప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులు లాభిస్తాయి.




సింహరాశి: (జూలై24-ఆగస్టు23): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. పెట్టుబడుల విషయాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): వృత్తి, వ్యాపారాలకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వాయిదా పడుతున్న పనులు పూర్తిచేస్తారు.




తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): మిత్రులు, బంధువులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సంకల్పం నెరవేరుతుంది.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు పూర్తవుతాయి. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. మెడికల్ క్లెయిములు పరిష్కారం అవుతాయి.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు సంభవం. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. నూతన భాగస్వామ్యాలు లాభిస్తాయి. జనసంబంధాలు విస్తరిస్తాయి. సంకల్పం నెరవేరుతుంది.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): వైద్య, పరిశ్రమలు, హోటల్, రిటైల్ రంగాల వారికి అనుకూల సమయం. విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): డిపాజిట్లపై మంచి ప్రతిఫలాలు అందుకుంటారు. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. బ్యాంకుల, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బదిలీలు, మార్పులకు అనుకూలం. హోటల్, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి పోత్సాహకరం. సేవల రంగాల వారు సత్ఫలితాలు సాధిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సూక్తి

ఎంత గొప్ప స్థానానికి చేరినా సరే విద్యార్థిగానే ఉండు. అది నిన్ను మరింత ఉన్నత స్థానానికి తీసుకెళుతుంది.

- సర్వేపల్లి రాధాకృష్ణ

నవ్వుల్ నవ్వుల్

టీచర్ : మీ ఇంట్లో దొంగలు పడ్డారట కదా నిజమేనా!

వెంగళప్ప : అవును

టీచర్ : వాళ్లను చూసి నువ్వు భయంతో దాక్కున్నావట కదా.

వెంగళప్ప : నేను భయంతో దాక్కోలేదు.

టీచర్ : మరి!

వెంగళప్ప : మా ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ లేకపోవడం మూలంగా దొంగలకు ముఖం చూపించడానికి సిగ్గేసింది.

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. వియలం ▸ ....
2. ప్రయంళ ▸ ....
3. నయంన ▸ ....

- పత్తిపాక అంకిత, కోరుట్ల

కొంటె ప్రశ్న

సముద్రం మధ్యలో ఏముంటుంది?

చుక్కలు కలపండి





10,000 ఆమ్లెట్ ఫెస్టివల్

ఇంట్లో ఆమ్లెట్ రుచి చూడటం అందరూ చేసేదే. హోటల్‌కెళ్తే డబల్ ఎగ్ ఆమ్లెట్‌ను ఆర్డర్ చేస్తాం. కానీ ఏకంగా పది వేల కోడిగుడ్లతో ఆమ్లెట్ వేయడం ఎక్కడైనా చూశారా? బెల్జియంలోని మాల్‌మెడి పట్టణంలో నిర్వహించిన ఆమ్లెట్ ఉత్సవంలో అలా ఆమ్లెట్ వేశారు. కోడిగుడ్లలో ఫిప్రోనిల్ అనే విషపదార్థం ఉందంటూ వార్తలు రావడంతో ఆ భయాన్ని పోగొట్టేందుకు ఈ ఆమ్లెట్ ఉత్సవాన్ని నిర్వహించారు.

రోజూ గుడ్డు తినండి. ఆరోగ్యంగా ఉండండి అని టీవీల్లో చూస్తుంటాం. డాక్టర్లు సైతం కోడిగుడ్డు ఆరోగ్యానికి మంచిదని చెబుతుంటారు. అయితే యూరప్ దేశాల్లో నిర్వహించిన తనిఖీల్లో కోడిగుడ్లలో ప్రమాదకరమైన ఫిప్రోనిల్ అనే ఇన్‌సెక్టిసైడ్(పురుగులను చంపే రసాయన పదార్థం) ఉన్నట్లు తేలిందని వార్తలు వెలువడ్డాయి. యూరోపియన్ యూనియన్ ఫుడ్ సేఫ్టీ అలర్ట్ సిస్టమ్ ఈ విషయాన్ని ధృవీకరించింది. బెల్జియంతో పాటు నెదర్లాండ్, జర్మనీ వంటి దాదాపు 18 దేశాల్లో ఈ రకమైన రసాయనం ఉన్న గుడ్లు ఉన్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఇది ఆ నోట ఈ నోట జనాల్లోకి పాకిపోయింది. దాంతో ప్రజలు గుడ్లు తినడం మానేశారు. అయితే యూరప్ దేశాల్లో ఉత్పత్తి అయ్యే గుడ్లతో ఎలాంటి ప్రమాదం లేదని, హాంకాంగ్ నుంచి కల్తీ గుడ్లు వచ్చి చేరాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి. అయితే అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయింది. ప్రజలు కొన్ని లక్షల గుడ్లను నాశనం చేశారు. ఫిప్రోనిల్ ఉండే అవకాశం ఉన్న గుడ్లన్నింటినీ సూపర్‌మార్కెట్లలో నుంచి తొలగించారు. ఈ దెబ్బకు దాదాపు 180 పౌల్ట్రీ పరిశ్రమలు మూతపడ్డాయి.



ఆమ్లెట్ ఫెస్టివల్‌తో మళ్లీ కళకళ

ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించేందుకు ఆమ్లెట్ ఫెస్టివల్‌ను వేదికగా చేసుకోవాలని నిర్ణయించాయి వ్యాపార వర్గాలు. ఆమ్లెట్ ఫెస్టివల్ నిర్వహించడం ఇదే మొదటిసారి కాదు. రెండు దశాబ్దాలుగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 'ఆమ్లెట్ ఫెస్టివల్‌ను 22 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ఇది సంప్రదాయంగా వస్తోంది. ఇప్పుడు కోడిగుడ్లతో ప్రమాదం అని భయపడి ఫెస్టివల్ నిర్వహించకుండా ఉండలేం' అని బెల్జియంకు చెందిన ఒక కుటుంబం అభిప్రాయపడింది. నిర్వాహకులు సైతం వెనకంజ వేయకుండా ఆమ్లెట్ ఫెస్టివల్‌ను నిర్వహించారు.

ఆమ్లెట్ ఎలా వేశారంటే...!

ముందుగా నాణ్యమైన గుడ్లను వ్యాపారస్తుల నుంచి, సరఫరాదారుల దగ్గర నుంచి సేకరించారు. పట్టణంలోని సెంటర్‌లో కట్టెల పొయ్యి ఏర్పాటు చేశారు. 4 మీటర్ల వైశాల్యం ఉన్న ప్యాన్ పెట్టారు. అందులో కోడిగుడ్లను కొడుతూ బాగా కలియబెట్టారు. తరువాత ఆమ్లెట్‌లుగా వేస్తూ ఫెస్టివల్‌కు వచ్చిన వారందరికీ పంచారు. 'మా స్థానిక ఉత్పత్తులపై, మా సరఫరాదారులపై మాకు పూర్తి నమ్మకం ఉంది. మేం నిర్వహించిన ఆమ్లెట్ ఉత్సవానికి ఇంత మంది హాజరుకావడం కూడా ఆనందంగా ఉంది. ప్రజల్లో కొంత భయం మాట ఉన్న నిజం, అయితే ఇక్కడికి వచ్చిన వారి సంఖ్యను చూస్తే ముందున్నవి మంచి రోజులేనని అనిపిస్తోంది' అని కార్యక్రమానికి గ్రాండ్‌మాస్టర్‌గా పనిచేసిన గిల్లిస్ అన్నారు. గతంలోనూ బెల్జియంలో ఇలాంటి రూమర్ వ్యాపించింది. చికెన్, గుడ్లలో కార్సినోజన్‌గా పిలిచే డైఆక్సిన్ అనే విషపదార్థం ఉన్నట్లు వార్తలు వెలువడ్డాయి. అప్పటి నుంచి ఏటా ఫెస్టివల్‌ను నిర్వహిస్తూ వస్తున్నారు.

టంగ్‌ట్విస్టర్స్

1. It's not the cough that carries you off,it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.



దారి కనుక్కోండి



జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. UORF ▸ ....
2. RAGE ▸ ....
3. RWEA ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

జవాబులు

జంతర్‌మంతర్ : 1. విలయం 2. ప్రళయం 3.నయనం

జంబ్లింగ్ వర్డ్స్ : 1.FOUR 2.GEAR 3.WEAR

కొంటె ప్రశ్న : నీళ్లే ఉంటాయి.




తిరుమల సమాచారం



వసతి గదులు: రూ.500 : అక్టోబర్ 23 నుంచి డిసెంబర్ 15 వరకు ఉన్నాయి.
రూ.100 : అక్టోబర్ 23 నుంచి డిసెంబర్ 15 వరకు ఉన్నాయి.
శ్రీనివాసమ్: అక్టోబర్ 23 నుంచి డిసెంబర్ 15 వరకు ఉన్నాయి.
రూ.300 దర్శనం : ఆగస్టు 28 నుంచి నవంబర్ 30 వరకు ఉన్నాయి. (మధ్యలో సెప్టెంబరు 2,5,19, 23, 27, 28, 29, 30 అక్టోబర్ 1,7, 14 తప్ప)
రూ.50 దర్శనం : ఖాళీలు లేవు.
ఆర్జిత సేవలు : డిసెంబర్ 16వ తేదీ ఉన్నాయి.

రైల్వే సమాచారం



రైళ్ల రాకపోకల వేళలు, రిజర్వేషన్ ఖాళీల వివరాలు, టికెట్ చార్జీలు, ఇతర సమాచారం కోసం... 139
ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) టోల్ ఫ్రీ నంబరు 182
అనకాపల్లి ఆర్పీఎఫ్ పోస్ట్ ఫోన్... 08924-226965

ఆర్టీసీ సమాచారం



అనకాపల్లి ఎంక్వైరీ	77300 37027
నర్సీపట్నం ఎంక్వైరీ	94932 11969
పాడేరు ఎంక్వైరీ (డీఎం)	73829 14859

నేడు నర్సీపట్నంలో మంత్రుల పర్యటన

పలు అభివృద్ధి పనులు ప్రారంభం, శంకుస్థాపన

అయ్యన్న, కామినేని హాజరు



ప్రాంతీయ ఆస్పత్రిని పరిశీలిస్తున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం : ఇక్కడి ప్రాంతీయ ఆస్పత్రిలో కొత్తగా మంజూరైన 150 పడకల విభాగాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ గురువారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిన హోంమంత్రి చినరాజప్ప పర్యటన చివరి నిమిషంలో రద్దైంది. ఆస్పత్రి ఎదురుగా గల వరహాల దొర పార్కులో సుమారు రూ.25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న స్కేటింగ్ రింక్ నిర్మాణానికి మంత్రులు కామినేని, అయ్యన్నపాత్రుడు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో జరగనున్న బహిరంగ సభలో ఇరువురూ కలిసి నర్సీపట్నం రూరల్ మండలం పరిధిలో గల తొమ్మిది పంచాయితీలకు చెందిన 356 మంది లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి సంబంధించి ఎల్‌పీసీలను అందజేస్తారు. ఆ తర్వాత మధ్యాహ్న భోజన విరామం అనంతరం మాకవరపాలెం మండలం తామరంలో ఆ మండలానికి సంబంధించిన ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీతో పాటు నర్సీపట్నం- తాళ్ల పాలెం ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణ పనులకు కూడా మంత్రులు శంకుస్థాపన చేస్తారు.

నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి అయ్యన్న

ఇదిలావుండగా, గురువారం ప్రారంభం కానున్న అభివృద్ధి పనులను మంత్రి అయ్యన్న పాత్రుడు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే, మున్సిపాలిటీ పరిధిలో వరాహ నదిపై చేపట్టిన లింగాపురం వంతెన నిర్మాణంలో జాప్యాన్ని అడిగి తెలుసుకున్నారు. బలిఘట్టం శ్మశాన వాటిక అభివృద్ధి పనులను చూసి ప్రవేశ ద్వారం వద్ద బోర్డు ఏర్పాటు చేయాలని, శ్మశాన వాటిక ఆవరణలో బురద లేకుండా తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పట్టణ శివారులో కంపోస్టు యార్డు ప్రహరీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సాలూరు మున్సిపాలిటీ మాదిరిగా నర్సీపట్నం కంపోస్టు ఆవరణలో కూడా సీమపందుల పెంపకం చేపడితే మున్సిపాలిటీకి ఆదాయం పెరుగుతుందని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపల్, పంచాయితీ రాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.



- చురుగ్గా కాటేజీలు, రెస్టారెంట్ నిర్మాణం
- పనులను పరిశీలించిన ఐటీడీఏ పీవో రవిపట్టన్ శెట్టి
- జలపాతం అభివృద్ధికి వెల్లడి

కొల్లాపుట్టు జలతరంగిణికి కొత్తకళ

డుంబ్రిగుడ : మండలంలోని కొల్లాపుట్టు జలతరంగిణిలో చేపట్టిన కాటేజీ, రెస్టారెంట్, గార్డెన్, రోడ్డు నిర్మాణ పనులను పాడేరు ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి బుధవారం పరిశీలించారు. పనుల తీరుతెన్నులపై ఆరా తీశారు. వచ్చే నెలకు పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. కొల్లాపుట్టు గ్రామానికి చెందిన చిరంజీవి అనే గిరిజనుడు గ్రామంలోని యువతకు ఉపాధి లభిస్తుందని భావించి తన పట్టా భూమిలోని అర ఎకరాను కాటేజీల నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చినట్టు చెప్పారు. దీంతో కాటేజీలతో పాటు గార్డెన్, రెస్టారెంట్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. వీటి నిర్మాణాల ద్వారా గ్రామంలోని సుమారు 30 మంది గిరిజన యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఇందుకు ఐటీడీఏ నిధులు సుమారు రూ.35 లక్షలు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. ఈ అభివృద్ధి పనులన్నీ త్వరగా పూర్తి చేసి పర్యాటక సీజన్ మొదలయ్యే నాటికి అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. గ్రామస్థులు ఇందుకు పూర్తి సహకారం అందిస్తున్నట్టు చెప్పారు. ఇక్కడ కాటేజీల నిర్మాణంతో పాటు జలపాతం అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. గిరిజనులు, పర్యాటకుల రవాణా సౌకర్యార్థం బీటీ రోడ్డు త్వరగా నిర్మాణమయ్యేందుకు సంబంధిత అధికారులతో చర్చిస్తామని పీవో చెప్పారు. అరకులోయ మ్యూజియం మేనేజర్ మురళీ, డిప్యూటీ తహసీల్దార్ జయ, ఆర్ఐ గోవింద్, ట్రైబల్ వెల్ఫేర్ టెక్నికల్ అసిస్టెంట్ సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

చాపరాయి జలపాతం అభివృద్ధి

ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారిని త్వరలో అభివృద్ధి చేస్తామని పీవో రవి పట్టన్‌శెట్టి తెలిపారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులకు భోజన సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నందున ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రెస్టారెంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.



కొల్లాపుట్టు జలతరంగిణిని సందర్శిస్తున్న పీవో రవి పట్టన్‌శెట్టి

కొల్లాపుట్టులో పైనాపిల్, కాఫీ సాగు భేష్

కొల్లాపుట్టులో పైనాపిల్, కాఫీసాగు ఆశాజనకంగా ఉందని పీవో చెప్పారు. ఇక్కడి పైనాపిల్‌ను పర్యాటకులకు విక్రయించి గిరిజనులు తద్వారా లాభపడేందుకు అవకాశం ఉంటుందన్నారు. పైనాపిల్ దిగుబడి మరింత బాగా వచ్చేందుకు నూతన విత్తనాలు అందివ్వాలని గిరిజనులు కోరగా, కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నూతనంగా కాఫీ మొక్కలు నాటేందుకు ఐటీడీఏ సహకారం అందిస్తుందన్నారు.

సీతాఫలాలకు భలే గిరాకీ



కోల్‌కతాకు ఎగుమతి చేసేందుకు ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం

- ఎగబడి కొంటున్న వ్యాపారులు
- కావిడి ధర రూ.2500
- ఆనందం వ్యక్తం చేస్తున్న గిరిరైతులు

అనంతగిరి/రూరల్ : మధుర ఫలాలు మన్యంలోనిజ గిరిజనులకు సిరులు కురిపిస్తున్నాయి. ఈ ఏడాది దిగుబడి ప్రారంభమైన సీతాఫలాకు గిట్టుబాటు ధర లభిస్తుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం జరిగిన కాశీపట్నం, డముకు సంతలకు నర్సింహరాజపురం, ఎగువబూడి, దిగువబూడి, డెంజానివలస, గుత్తాపుగుడ్డి, సీతారాంపురం తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కావిళ్లతో గిరి రైతులు పండ్లను తీసుకువచ్చారు. ఏటా ఇక్కడి నుంచి కోల్‌కతా, బెంగళూరు తదితర దూర ప్రాంతాలకు వ్యాపారులు కొనుగోలు చేసి తీసుకువెళ్తుండడంతో మంచి గిరాకీ ఉంటుంది. సంతలో బుధవారం సీతాఫలాల కావిడ (200 పండ్లు)కు రూ.2500 ధర లభించడంతో రైతుల ఆనందానికి అవధులు లేవు. మంచి సైజున్న పండ్లను రూ.2800కు కూడా వ్యాపారులు కొనుగోలు చేయడం విశేషం. సీతాఫలం ధర యాపిల్‌ను తలపిస్తుండడంతో స్థానికులు సైతం ప్రస్తుతం వీటిని రుచి చూడలేకపోతున్నారు.

సేంద్రియ సాగు వల్లే డిమాండ్

ఏటా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సీతాఫలాలు అధికంగా ఇక్కడ లభిస్తాయి. నర్సింహరాజపురం పంచాయతీలో ఉండే గిరిజనులు ఈ తోటలకు ఎలాంటి ఎరువులు ఇతర క్రిమిసంహార మందులు వాడరు. కేవలం సేంద్రియ ఎరువుల ద్వారానే ఈ తోటలను పెంచడం వల్ల ఈ పండ్లు మంచి రుచితో పాటు చూడడానికి నిగనిగలాడుతుంటాయి. దీంతో మంచి డిమాండ్ ఉంటుంది.



కాశీపట్నం సంతకు అమ్మకానికి తీసుకువచిచ్చన సీతాఫలాలు

మంచి ధర



నేను సంతకు తెచ్చిన సీతాఫలాలకు రూ.2500 గిట్టుబాటు ధర లభించింది. సుమారు తొమ్మిది కిలో మీటర్లు నడిచి రెండు కావిడ్లతో పండ్లను తీసుకువచ్చాను. గిట్టుబాటు ధర రావడంతో ఆ కష్టం నాకు కనిపించడం లేదు. ఈ వారం నాతోపాటు రైతులందరికీ మంచి ధల లభించడం ఆనందంగా ఉంది.

\- మోటు చిన్నయ్య, డెంజానివలస

కష్టానికి తగ్గ ప్రతిఫలం



ఎగువ బూడి గ్రామం నుంచి బుట్టతో పండ్లను మోసుకుని వచ్చాను. పండ్లు నిగనిగలాడడంతో గంప పండ్లు రూ.1400కు అమ్మడయ్యాయి. కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కింది. ఈ సీజన్ అంతా ఇలా వుంటే మా కష్టాలు కొంతవరకు గట్టెక్కుతాయి.

\- జన్ని లక్ష్మి, ఎగువబూడి

పంపిణీకి సిద్ధంగా రాజ్‌మా విత్తనాలు

పాడేరు రూరల్: గిరిజన రైతులకు రాయితీపై పంపిణీ చేసేందుకు రాజ్‌మా విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి సంధ్య తెలిపారు. మండల రైతుల కోసం ఐదు వేల కిలోల విత్తనాలను సిద్ధం చేశామన్నారు. కిలో రూ.83 విలువైన ఈ విత్తనాలకు రూ.25 రాయితీ ఇస్తున్నట్టు చెప్పారు. రైతులు కిలోకు రూ.58 చెల్లించి ఈ నెలాఖరులోగా విత్తనాలను తీసుకోవాలని ఆమె సూచించారు.

ఏదీ పింఛన్

మూడు నెలలుగా అందని పింఛను మొత్తం

- ఎంపీడీవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల అష్టకష్టాలు
- పంచాయతీ కార్యదర్శుల కొరతతోనే సమస్య
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని అధికారులు

ఎప్పుడు ఒకటో తేదీ వస్తుందా..? అని ఎదురుచూస్తారు ఆదివాసీ పింఛన్‌దారులు. ఆ రోజు రావడమే తరువాయి.. చేతిలో పుస్తకం పట్టుకుని పంచాయతీ కార్యాలయానికి తెల్లవారే వెళ్లిపోతారు. ఏదైనా బండి శబ్దం వినిపిస్తే చాలు, తమకు పింఛన్ అందించే ఉద్యోగి వచ్చేశాడేమోనని ఆదుర్దా పడతారు. తీరా ఆ వాహనం వేరెవరిదోనని తెలుసుకుని నిరాశ చెందుతారు. రోజంతా ఇలాగే గడుపుతారు. ఈ దయనీయ స్థితిని దాదాపు వంద రోజులుగా ఎదుర్కొంటున్నారు. ఇదీ జి.మాడుగుల మండలంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు దుస్థితి. దీనికి కారణం... మూన్నెల్లుగా పింఛన్ మొత్తం అందకపోవడమే!



కార్యాలయ ఆవరణలో నిరీక్షిస్తున్న వృద్ధులు



ఎంపీడీవో కార్యాలయం ఎదుట పడిగాపులు కాస్తున్న దృశ్యం

జి.మాడుగుల:

మండలంలోని 17 పంచాయతీల పరిధిలో 3460 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 1వ తేదీ నుంచి వారంలోగా పింఛను సొమ్ము పంచాయతీ కార్యదర్శులు అందించాల్సి ఉంది. గత మూడు నెలలుగా పింఛన్ పంపిణీలో జాప్యం జరుగుతోంది. దీంతో పింఛన్ అందుకునే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ప్రతి రోజూ పంచాయతీ కార్యాలయం.. అక్కడి నుంచి మండల పరిషత్‌కు తిరుగుతున్నారు. ఎవరిని అడిగినా సరైన సమాధానం లభించకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

పంచాయతీ కార్యదర్శుల లేకపోవడంతోనే..

మండలంలోని 17 పంచాయతీలకు కేవలం ఏడుగురే కార్యదర్శులు ఉన్నారు. వీరిలోనూ ఐదుగురు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. దీంతో ఉన్న ఇద్దరిపై పని భారం ఎక్కువవుతోంది. ఫలితంగా వారు కూడా బాధ్యతలు సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రతి నెలా పింఛన్ పంపిణీ చేయడానికి కార్యదర్శులు లేకుండా పోయారు. అధికారులు కూడా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో మూడు నెలలుగా పింఛన్ పంపిణీలో జాప్యం జరుగుతోంది.

బయోమెట్రిక్ కొందరికి ఇబ్బందులు

గతంలో కార్యదర్శులు పంచాయతీ కార్యాలయానికి వచ్చి పింఛను సొమ్ము నగదు రూపంలో అందించేవారు. దీంతో లబ్ధిదారులు ప్రతి నెలా సకాలంలో పింఛను అందుకునేవారు. కొన్ని నెలలుగా బయోమెట్రిక్ పద్ధతిని అమలు చేస్తున్నారు. పింఛన్‌దారుల్లో కొంత మందికి బయోమెట్రిక్‌లో వేలిముద్రలు పడకపోవడంతో పంపిణీ జరగడం లేదు. దీనికితోడు ఆరు మాసాలుగా పంచాయతీ కార్యదర్శులు అందుబాటు లేకపోవడంతో పింఛను సొమ్ము అందుకునేందుకు ఎక్కడికి వెళ్లాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి ప్రతి రోజూ వెళ్తున్నామని, అక్కడ ఎవరిని అడగాలో తెలియక ప్రదక్షిణలు చేస్తూ పడిగాపులు కాస్తున్నామని, కనిపించే వారెవరినైనా అడిగితే వారు కూడా సమాధానం చెప్పడం లేదని వాపోయారు. కాగా, ఈ నెల నుంచి పింఛన్ పంపిణీ చేసే బాధ్యతను కార్యదర్శులకు ప్రత్యామ్నాయంగా సీఆర్పీలకు అప్పగించారు. వారు కూడా ఇంకా పంపిణీ ప్రక్రియను ప్రారంభించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే పింఛన్లను పంపిణీ చేయాలని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు వేడుకుంటున్నారు.



మండల కేంద్రానికి వచ్చిన పింఛనుదారులు

ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదు



మూడు నెలలుగా పింఛను సక్రమంగా అందడం లేదు. పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో లేరు. దీంతో పింఛను సొమ్ము పొందేందుకు ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదు. ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి అడుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

-వనుగు కర్రమ్మ, నేరేడివలస గ్రామం

సీఆర్పీలు ఎక్కడ ఉంటారు తెలియదు



పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేరు. దీంతో పింఛను కోసం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్తున్నాం. సీఆర్పీలు ఇస్తారని అక్కడ కొంత మంది అంటున్నారు. సీఆర్పీలు ఎక్కడ ఉంటారో మాకు తెలియదు. అధికారులు స్పందించి పింఛను అందేలా చర్యలు తీసుకోవాలి.

-కె.రాములమ్మ, సంగులోయ గ్రామం

ఉపాధి బిల్లులను వేగవంతంగా చెల్లించండి

ఎంపీడీవో ప్రేమాకరరావు

జి.మాడుగుల: మండలంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన బిల్లులను వేగవంతంగా చెల్లించాలని ఎంపీడీవో ప్రేమాకరరావు ఆదేశించారు. ఉపాధి హామీ పథకం, కాఫీ యూనిట్ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులు చేసిన కూలీలకు త్వరితగతిన వేతనాలు అందించాలని ఆదేశించారు. అలాగే కాఫీ పనులకు సంబంధించి ఆ శాఖ సిబ్బంది బిల్లులు బకాయిలు పెట్టకుండా చెల్లింపులను వేగవంతం చేయాలన్నారు. బ్యాంకుల్లో బకాయి పడ్డ బిల్లులను లబ్ధిదారుల ఖాతాల్లో చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. వంద రోజులు పని దినాలు పూర్తయిన వారికి పని దినాలను మరింత పెంచి పని కల్పించాలని సూచించారు. జాబ్ కార్డులు లేని వారిని గుర్తించి వెంటనే అందించాలని చెప్పారు. ముఖ్యంగా బిల్లులు బకాయిలు లేకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీడీవో స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉపాధి పథకం ఏపీవో రామేశ్వరం పాల్గొన్నారు.

కషాయం తయారీ యంత్రాల పంపిణీ

ప్రకృతి వ్యవసాయానికి దోహదం: ఏడీ శంకరరెడ్డి

పాడేరు రూరల్: మండలంలో ఏర్పాటు చేసిన నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ (ఎన్‌పీఎం) దుకాణాలకు కషాయం తయారీ యంత్రాలను పూర్తి రాయితీపై పంపిణీ చేస్తున్నట్టు వ్యవసాయ శాఖ ఏడీ పి.శంకరరెడ్డి తెలిపారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయానికి ఉపయోగపడే ఈ యంత్రం విలువ రూ.31 వేలు ఉంటుందని చెప్పారు. మండలంలో కందమామిడి, వంజంగి, మినుములూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఈ దుకాణాలకు యంత్రాలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. పంటలకు పురుగుల మందులకు బదులుగా ఈ యంత్రాలతో ప్రకృతిలో లభించే వివిధ ఆకులతో కషాయాన్ని తీసి చల్లితే పురుగు సమస్య తీరుతుందన్నారు. ఈ యంత్రాలను గిరిజన ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామానికి చెందిన మాసాడి కొండలరావుకు బుధవారం రాయితీపై పవర్ టిల్లర్‌ను అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఎం.సూర్యనారాయణనాయుడు, ఎ.నూకశ్రీనివాస్, సిహెచ్.పార్వతి పాల్గొన్నారు.



ఎన్‌పీఎం దుకాణాలు అందించనున్న యంత్రాలతో ఏడీ, ఏఈవో

తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె

అరకు రూరల్: జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ తపాలా శాఖ ఉద్యోగులు బుధవారం సమ్మె బాట పట్టారు. సబ్ పోస్టాఫీసు పరిధిలోని మూడు మండలాలకు చెందిన సిబ్బంది సమ్మెకు ఉపక్రమించారు. ముఖ్యంగా పే కమిటీ రిపోర్టును తక్షణమే ప్రభుత్వానికి సమర్పించాలని, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే తగిన చర్యలు చేపట్టకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అరకు డివిజన్ గ్రామీణ డాక్ సేవక్స్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, ఎస్.ప్రసాద్, కె.సుందరరావు, బి.గుండు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం రేపు

పాడేరు రూరల్: తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్టు త్రిసభ్య కమిటీ సభ్యుడు బొర్రా నాగరాజు తెలిపారు. పాడేరులో జిల్లా పరిషత్ అతిథి గృహంలో జరగనున్న ఈ సమావేశానికి నియోజకవర్గ త్రిసభ్య కమిటీ సభ్యులు ఎం.మణికుమారి, ఎంవీవీఎస్.ప్రసాద్ కూడా హాజరవుతారని చెప్పారు. నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల ముఖ్య నాయకులు, పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు తప్పరిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు కినపర్తిలో మన ఊరు-మన విశాఖ

కొయ్యూరు: మండలంలోని కినపర్తి గ్రామంలో గురువారం మన ఊరు-మన విశాఖ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎంపీడీవో ఇమ్మానుయేలు తెలిపారు. ప్రభుత్వ పథకాలు, గ్రామ సమస్యలపై చర్చించనున్న ఈ కార్యక్రమానికి మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

మాడుగుల ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-224233
ఎంపీడీఓ	9000 01928
తహసీల్దార్	88977 01286

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	జయ జానకీ నాయక
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	నక్షత్రం

సస్య రక్షణతో అధిక దిగుబడులు : ఏడీ

కె.కోటపాడు : వరి, చెరకు పంటలకు సస్య రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని చోడవరం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టి.సత్యనారాయణ అన్నారు. బుధవారం దాలివలస, సింగన్నదొరపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు పొట్ట, పిలకల దశల్లో నీరందించాలన్నారు. చెరకు ఉడిచిన నెలరోజుల తర్వాత పూర్తి స్థాయిలో నీరందిస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.సత్తిబాబు, ఏవో కేవీ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రుణాల కోసం నేటి నుంచి ఇంటర్వ్యూలు

దేవరాపల్లి: ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 17 నుంచి 21 వరకూ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి.చంద్రశేఖర్ తెలిపారు. 2017-18లో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు ఈ నెల 17న ఉదయం 11గంటలకు యూకో బ్యాంకు, మధ్యాహ్నం 2.30 గంటలకు ఎం.అలమండ ఎస్‌బీహెచ్, 18న ఉదయం 11 గంటలకు గవరవరం గ్రామీణ బ్యాంకు, మధ్యాహ్నం 3 గంటలకు దేవరాపల్లి డీసీసీబీ, 19న మధ్యాహ్నం 2 గంటలకు ఎస్‌బీఐ, 21న మధ్యాహ్నం 2 గంటలకు ఏపీజీవీబీ బ్యాంకుల పరిధిలోని దరఖాస్తు చేసిన నిరుద్యోగులకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

రూ.63 లక్షలతో తాగునీటి సమస్య పరిష్కారం : ఎంపీపీ

చీడికాడ: కోనాం పంచాయతీ ఏజెన్సీ గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి రూ.63లక్షలు మంజూరయ్యాయి ఎంపీపీ కుచ్చు కళావతి తెలిపారు. పనసగెడ్డ, కొండ్ల కొత్తూరు, రెల్లలపాలెం, వాకపల్లి, చెరుకుపల్లి గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణానికి, పైప్‌లైన్ ఏర్పాటుకు ఈ నిధులు వెచ్చిస్తామన్నారు. జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసి నాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు కొల్లి సూరినాయుడు పాల్గొన్నారు.

వికలాంగురాలిని...న్యాయం చేయండి

తహసీల్దార్‌కు బడ్డీ దుకాణం నిర్వాహకురాలి వినతి


విలేఖరులతో మాట్లాడుతున్న దేవి

చీడికాడ: మండలంలోని మంచాల గ్రామకంఠంలో కిరాణాషాపు పెట్టుకుని జీవనోపాది సాగిస్తున్న తనను కొందరు వేధిస్తున్నారని ఆ గ్రామానికి చెందిన దివ్యాంగురాలు బొడ్డు దేవి ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఇచ్చిన రూ.60వేలు సబ్సిడీ రుణంతో ఓ చిన్న కిరాణాషాపు పెట్టుకొని జీవిస్తుంటే అదే గ్రామానికి చెందిన పెద్దింటి దేముడుబాబు, ఆయన కుమారులు నాయుడు, మహేష్ ఆ స్థలం తమదంటూ వాదిస్తున్నారంది. షాపుపై కమ్మలపాక వేయడానికి ప్రయత్నిస్తున్న తనను అడ్డుకున్నారన్నారు. వీరిపై తహసీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశానని, అధికారులు తనకు న్యాయం చేయాలని కోరుతోంది. పోలీస్ స్టేషన్‌లకు ఫిర్యాదు చేశానని, అధికారులు తనకు తగిన న్యాయం చేయాలని ఆమె కోరుతోంది.

మంత్రి ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలు అనుచితం : దళిత నేతలు



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నేతలు

దేవరాపల్లి: మంత్రి ఆదినారాయణరెడ్డి ఎస్సీ, ఎస్టీల పట్ల అవమానకరమైన రీతిలో వ్యవహరించడం శోచనీయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న, కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా నాయకుడు కాటపల్లి అప్పారావు అన్నారు. దళితులు, గిరిజనులపై మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు చదువు రాదు, శుభ్రం తెలీదు, అందుకే వాళ్లు వెనుకబడిపోతున్నారని మంత్రి వ్యాఖ్యానించడం శోచనీయమని అన్నారు. దళితులంటే ఎలా ఉండాలో భవిష్యత్తులో చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సీహెచ్.రాజు, ఇ.సన్నిబాబు, ఎస్.సుధాకర్, జి.ఈశ్వరరావు, ఎస్.నరసింహ మూర్తి, స్థానిక దళిత సంఘం నాయకుడు రొప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

పైలాపై అధిష్ఠానానికి ఫిర్యాదు

టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జయరామ్, దేముడుబాబు


విలేఖరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కె.కోటపాడు : మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ టిక్కెట్ తనకే కేటాయిస్తారని ప్రకటనలు చేస్తున్న పైలా ఫౌండేషన్ చైర్మన్, ఏపీ జన్మభూమి కమిటీ సమన్వయకర్త పైలా ప్రసాదరావుపై టీడీపీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొరుపోలు జయరామ్, బండారు దేముడుబాబు తెలిపారు. బుధవారం ఇక్కడ విలేఖరులతో వారు మాట్లాడుతూ క్రమశిక్షణ గల పార్టీలో ఇలాంటి వ్యాఖ్యలు కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తాయన్నారు. పార్టీ కేడర్‌తో, నాయకులతో ఎటువంటి సంబంధమూ లేని పైలా టిక్కెట్ తనకేనంటూ ప్రకటనలు చేయడం తగదన్నారు. ఏడాదికోసారి నియోజకవర్గంలో పర్యటించి పార్టీలో గందరగోళ ం సృష్టించడానికి పైలా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. టిక్కెట్ ఎవరికి కేటాయించాలన్నది అధిష్ఠానానికి తెలుసునన్నారు. పైలా తీరుమార్చుకోకపోతే సహించేదిలేదని హెచ్చరించారు. నియోజకవర్గంలో పార్టీ బాధ్యతలును గవిరెడ్డి రామానాయుడుకు అధిష్ఠానం అప్పగించిందని, ఆయన సూచనల మేరకు పని చేస్తామని అన్నారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు జూరెడ్డి రాము, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వంటాకు శ్రీను, సర్పంచ్‌లు సీమూసురు రమణ, బోళెం అక్కన్నపాత్రుడు (బుల్లిదొర), టీడీపీ నాయకులు పైలా నారాయణమూర్తి, శీరంరెడ్డి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన



మాడుగుల: తమ డిమాండ్‌లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తపాలాశాఖ ఉద్యోగులు బుధవారం మాడుగల కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. కమలేష్ చంద్ర కమిటి సిఫారసులను అమలు చేయాలని, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం కార్య నిర్వాహక కార్యదర్శి కన్నబాబు, అసోసియేట్ కార్యదర్శి కన్నయ్య, మాడుగుల, కేజే పురం తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు మన గ్రామం-మన విశాఖ

చీడికాడ: మండలంలోని కోనాంలో గురువారం మన గ్రామం-మన విశాఖ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆర్‌ఎం గ్లాడ్స్ తెలిపారు. మండల ప్రత్యేక అధికారి టి.సత్యనారాయణ హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ రావాలని ఆమె కోరారు.

సుజల స్రవంతి పనులు ప్రారంభించాలి

ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల సాధన సమితి కన్వీనర్ కుమార్


పోస్ట్‌కార్డు ఉద్యమంలో పాల్గొన్న సాధన సమితి నాయకులు

మాడుగుల: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించాలని మాడుగుల నియోజకవర్గ ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల సాధన సమితి కన్వీనర్ పీవీజీ కుమార్ అన్నారు. మండలంలోని సత్యవరం గ్రామంలో బుధవారం నిర్వహించిన పోస్టుకార్డు ఉద్యమంలో ఆయన మాట్లాడుతూ పోలవరం సహా ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయాలని అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పూర్తయ్యే వరకూ పోస్టుకార్డు ఉద్యమం వివిధ జరుగుతుందన్నారు. సాధన కమిటీసభ్యులు టి.సత్యవతి, అడపా నరసింహమూర్తి, గొల్లవిల్లి శ్రీరామ్మూర్తి, ఎలమంచిలి రమణ, సూర్యనారాయణ, రాజశేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు చూపించాలని పేదల వినతి

దేవరాపల్లి: పట్టాలు ఇచ్చిన తమకు స్థలాలు చూపించాలని మండలంలోని సీతంపేట పంచాయతీకి చెందిన పలువురు పేదలు బుధవారం తహసీల్దార్ వైఎస్.నాగరాజును కోరారు. ఈ మేరకు మండల ఫుడ్ కమిటీ సభ్యుడు పరవాడ రవి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013లో అప్పటి ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఆధ్వర్యంలో అప్పటి తహసీల్దార్ రాజకుమారి గ్రామానికి చెందిన నల్లిగొండ జాన్, నిడుగండ మహలక్ష్మి, వానపల్లి రాము, షేక్ పేరమ్మ, షేక్ మీరంబీ, రెడ్డి గోవిందమ్మలతోపాటు 15మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారన్నారు. ఆ ఇళ్ల స్థలాలను కొందరు ఆక్రమించుకున్నారని, అడిగితే దౌర్జన్యం చేస్తున్నారని అన్నారు. అధికారులు సర్వే జరిపి పట్టాలు మంజూరైన నిరుపేదలకు స్థలాలను అప్పగించాలని కోరారు. అదే విధంగా వారి స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలని కోరారు.

నేడు మన గ్రామం-మన విశాఖ

కె.కోటపాడు : మండలంలోని గొండుపాలెంలో గురువారం మన గ్రామం-మన విశాఖ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఆర్.పూర్ణిమాదేవి తెలిపారు. మండల కో-ఆర్డినేటింగ్ అధికారి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటారని పేర్కొన్నారు. అనంతరం గ్రామసభ జరుగుతుందని, గ్రామస్థులు హాజరై తమ సమస్యలను విన్నవించుకోవాలని కోరారు.

మర్రివలసలో అంగన్వాడీ కేంద్రం ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రమణ

కె.కోటపాడు : మండలంలోని మర్రివలసలో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని సర్పంచ్ సీమూసురు రమణ బుధవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలకు సంపూర్ణ పౌష్టికాహారం అందజేయాలని, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని అన్నారు. మాజీ సర్పంచ్ కొటాన సూరిదేముడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీవీవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

చోడవరం ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-245033
ఎంపీడీఓ	9959550097
తహసీల్దార్	8500632088

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	జయ జానకీ నాయక
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	నక్షత్రం

పడకేసిన పశువైద్యం



భర్తీకి నోచని వైద్యాధికారుల పోస్టులు

వడ్డాది, బుచ్చెయ్యపేటల్లో మూగజీవాలకు అందని వైద్యసేవలు

నిరుపయోగంగా వడ్డాది, బుచ్చెయ్యపేట పశు వైద్యకేంద్రాలు

బుచ్చెయ్యపేట : వైద్యాధికారులు లేక వడ్డాది, బుచ్చెయ్యపేట పశువైద్య కేంద్రాల పరిధి 20 గ్రామాల్లో పశువైద్యసేవలు పడకేశాయి. ఆయా కేంద్రాల్లో పని చేసే వైద్యాధికారులు వెంకటరమణ, వీర్రాజు ఇద్దరూ మే నెలలో బదిలీ అయ్యారు. వారి స్థానంలో వేరే ఎవర్నీ నియమించలేదు. దీంతో వాటి పరిధిలోని గ్రామాల్లో మూగ జీవాలకు వైద్యసేవలు అందడం లేదు.

వడ్డాది పశువైద్య కేంద్రం పరిధిలో వడ్డాది, బంగారుమెట్ట, లోపూడి, ఎల్‌బీ పీ.అగ్రహారం, ఎల్.సింగవరం, పొట్టిదొర పాలెం, కోమళ్లపూడి, గంటి కొర్లాం, పి.భీమవరం, మంగళాపురం, విజయరామరాజుపేట గ్రామాలకు చెందిన 6273 ఆవులు, గేదెలు, ఎద్దులు, దున్నలు, 5469 మేకలు, గొర్రెలు, 10 వేల కోళ్లు ఉన్నాయి.



బుచ్చెయ్యపేట పరిధిలో పొలేపల్లి, కందిపూడి, కేపీ.అగ్రహారం, దిబ్బిడి, కొండెంపూడి, కొండపాలెం, గున్నెంపూడి, పెదమదీనా, చింతపాక తదితర గ్రామాల్లో 5725 ఆవులు, గేదెలు, ఎద్దులు, దున్నలు, 4515 మేకలు, గొర్రెలు, 11 వేల కోళ్లు ఉన్నాయి. ఇటీవల రాజాం ఉప పశు వైద్య కేంద్రాన్ని పూర్తిస్థాయిలో పశువైద్య కేంద్రంగా ప్రకటించిన జిల్లా పశువైద్య శాఖ అధికారులు అక్కడ వైద్యాధికారి గణేష్‌ను నియమించారు. ఆయననే వడ్డాది, బుచ్చెయ్యపేట పశువైద్యకేంద్రాల ఇన్‌చార్జ్‌గా నియమించారు. అయితే తొలకరి కాలం అవడంతో రాజాం పరిధిలో గల మూగజీవాలకు వైద్యసేవలు అందించడానికే పశువైద్యాధికారి గణేష్‌కు సమయం చాలడంలేదు. దీంతో వడ్డాది, బుచ్చెయ్యపేట కేంద్రాల పరిధిలో పశువులకు సరైన వైద్యసేవలు అందడం లేదు.

ఫలితంగా గొర్రెలు, మేకలు చిటుకు, గొంతువాపు, జబ్బవాపు, మశూచి, గాలి కుంటు వ్యాధులు, పాడి పశువులు రక్తం పారు వ్యాధులతో అల్లాడుతున్నాయి. వీటికి సకాలంలో వైద్య సేవలు అందకపోవడంతో పొట్టిదొరపాలెం, ఎల్‌బీపీ అగ్రహారం, లోపూడి, పెదమదీనా, బంగారుమెట్ట, వడ్డాది, బుచ్చెయ్యపేట, నేతవానిపాలెం గ్రామాల్లో పశువులు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

65 మందికి కంటి వైద్య పరీక్షలు

చోడవరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంభేరుపురంలో ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరంలో 95 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 8 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరికి తాము ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ మేనేజర్ పల్లి పాలబాబు తెలిపారు. శిబిరంలో విశాఖ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది సాయికృష్ణ, ప్రభాకర్, ధనలక్ష్మి, అంభేరుపురం సర్పంచ్ వేగి మహలక్ష్మి, స్థానిక నేత ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ఠ

రోలుగుంట : మండలంలోని జె.నాయుడుపాలెంలోనూతనంగా నిర్మించిన దేవాలయంలో మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది. అనంతరం అమ్మవారికి పూజాది కార్యక్రమాలు జరిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన గావించారు. టీడీపీ మండల నాయకుడు గండి సింహాద్రి, వైఎస్ ఎంపీపీ లోవరాజు, నాయకులు కిల్లాడ అప్పలరాజు, కశిరెడ్డి వెంకటరమణ, కిల్లాడ నాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

చోడవరం: ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ ప్రాంత కళాశాల విద్యార్థులకు యువకిరణ్ పథకం కింద స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్నట్టు సృజన వాణి సంస్థ కో ఆర్డినేటర్ ఆర్. రామారావు తెలిపారు. పట్టణంలోని వివిధ కళాశాలల్లో చదువులో ప్రతిభ కనపరుస్తున్న విద్యార్థులకు బుధవారం స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాటు, ప్రైవేటు కళాశాలలో పేద ప్రతిభ గల విద్యార్థులు 40 మందికి ఒకొక్కక్కరికి రూ.6 వేల నుంచి రూ.12వేల రూపాయల వరకూ అందజేశారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళు బి. మోహనరావు, ఎస్‌వీ వాసు, సృజనవాణి సంస్థ సభ్యులు ఉమాశంకర్, సురేష్, జ్ఞాని పాల్గొన్నారు.

నిండుగొండ పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్‌ను అందజేస్తున్న త్రిమూర్తులు

రోలుగుంట : మండలంలోని నిండుగొండ గ్రామానికి చెందిన లగుడు త్రిమూర్తులు అక్కడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్‌ను బహూకరించారు. విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై మక్కువ పెంచుకునేందుకు, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లో కూడా కంప్యూటర్ విద్యను ప్రోత్సహించేందుకు తన వంతు సాయంగా కంప్యూటర్‌ను అందజేసినట్లు ఆయన తెలిపారు. ఉపసర్పంచ్ సుర్ల బాబులునాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

బుచ్చెయ్యపేట : మండల సర్వసభ సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ చొడే కొండమ్మ అధ్యక్షతన జరగనున్నదని ఎంపీడీవో టి.కొండలరావు తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి : ఏవో

రోలుగుంట: నాట్లు వేసే ముందు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా అధిక దిగుబడిని సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.విజేత తెలిపారు. చంద్రన్న రైతు క్షేత్రంలో భాగంగా కొవ్వూరులో వరినాట్లు వేస్తున్న రైతులకు నాట్లు వేయడంపై అవగాహన కల్పించారు. నాట్లు వరుస పద్ధతిలో వేసుకోవడం వల్ల చేను ఏపుగా పెరుగుతుందని, వేర్లు పుష్కలంగా పెరుగుతాయని అన్నారు. లోపలి పొరల నుంచి పోషకాలను వేర్లు గ్రహిస్తాయన్నారు. నాట్లు వేసేటప్పుడు నీరు పలుచగా ఉండాలన్నారు. వరి పచ్చబడిన తర్వాత దుబ్బు చేసే దశ వరకు ఒక అంగుళం నీరు ఉండాలన్నారు. చీడపీడల ఉధృతిని అదుపులో ఉంచుకోవడానికి సమగ్ర సస్యరక్షణ పద్ధతులను విధిగా అవలంబించాలన్నారు. ఒకవేళ నాట్లు ఆలస్యమైనప్పుడు నారు కొనలు తుంచి నాటాలన్నారు. నత్రజని ఎరువులను సిఫారసు చేసిన మోతాదులో మాత్రమే దఫదఫాలుగా వేయాలన్నారు. ఈ కారక్రమంలో ఏఈఓ చిరంజీవి, ఎంపీఈవోలు కె.వాణి, భాగ్యలక్ష్మి, నీటి సంఘం అధ్యక్షుడు బంటు రాజు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

దళారులను నమ్మవద్దు : తహసీల్దార్



మాట్లాడుతున్న అప్పలనాయుడు

రోలుగుంట : మండలంలోని అర్ల, కొంతలం, లోసింగి, పనసలపాడు, అడ్డసరం, గ్రామాల్లో భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలిప్పిస్తామని చెప్పే దళారుల మాటలను విశ్వసించవద్దని తహసీల్దార్ పెంటకోట అప్పలనాయుడు అన్నారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గతంలో ఆయా గ్రామాల్లో 200 మంది వరకు గిరిజనులు తమకు పట్టాలు మంజూరు చేయాల్సిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకున్నారని, వాటిని జాయింట్ వెరిఫికేషన్ కోసం నర్సీపట్నం అటవీశాఖ అధికారికి పంపించామని అన్నారు. అనంతరం జిల్లా అటవీశాఖ అధికారి ద్వారా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుందన్నారు. అయితే కొందరు దళారులు తాము పట్టాలిప్పిస్తామని చెప్పి గిరిజనుల నుంచి సొమ్ము వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయా గ్రామాల గిరి రైతులు ఎవరికీ ఎటువంటి సొమ్మూ చెల్లించాల్సిన అవసరం లేదని, పట్టాలు అవసరమైన వారు తమను నేరుగా సంప్రదించాలని కోరారు. దళారులను నమ్మవద్దని పునరుద్ఘాటించారు. ఇప్పటి వరకూ మీ ఇంటికి మీ భూమి కార్యక్రమంలో రైతులను నుంచి అందిన 5028 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశామన్నారు. రెండో విడతలో 4125 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సీవీ చయనులు తదితరులు పాల్గొన్నారు.



దివ్యదర్శన యాత్రను ప్రారంభిస్తున్న అధికారులు

దివ్య దర్శన యాత్ర ప్రారంభం

రోలుగుంట : రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా కల్పిస్తున్న 5 పుణ్యక్షేత్రాల దివ్యదర్శన యాత్ర బుధవారం రోలుగుంట నుంచి ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు కొనసాగే ఈ దివ్యదర్శన యాత్రకు మండలంలోని పలు గ్రామాల నుంచి 200 మంది ఎంపికయ్యారు. ఒక్కో బస్సులో 40 మంది వంతున ఐదు బస్సుల్లో వీరు బయలుదేరారు. మాజీ సర్పంచ్ పోతల శ్రీనివాసరావు, సామిరెడ్డి ముసలయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అఖిలభారత కాపు సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా సీతా

బుచ్చెయ్యపేట : అఖిలభారత కాపు సమాఖ్య రూరల్ జిల్లా అధ్యక్షుడిగా పొలేపల్లి గ్రామ సర్పంచ్ సీతా వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో సమాఖ్య జాతీయ అధ్యక్షుడు చలమలశెట్టి రామానుజయ్య నియామక పత్రాన్ని అందజేశారు. అదే విధంగా ప్రధాన కార్యదర్శిగా సాలాపు మోహనరావు నియమితులయ్యారు. కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులాల వారి పురోభివృద్ధికి పాటుపడతానని ఈ సందదర్భంగా వెంకటమరణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్జి రమణమ్మ, పరవాడ మాజీ ఎంపీపీ మాధవశెట్టి నీలబాబు, సాలపు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వెంకటరమణకు నియామక పత్రాన్ని అందిస్తున్న రామానుజయ్య

ఎంపీడీవోల ఫోన్ నంబర్లు

నర్సీపట్నం	9849900151
గొలుగొండ	9000013921
నాతవరం	9000013925
మాకవరపాలెం	9000013920

శ్రీకన్య - ఫిదా
కన్య - దర్శకుడు
కన్యమిని - వశం
సాయిశ్రీకన్య - ఇదేమి! దెయ్యం
రాజమూవీమ్యాక్స్ - నక్షత్రం
బంగార్రాజు - గౌతమ్‌నందా

'పటా'్నకి ఆధునిక నిఘా వ్యవస్థ

నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్య రస్తోగీ

లాక్ హౌస్ మోనటరింగ్ సిస్టం ఏర్పాటు

సేవలు అందించడానికి ప్రచారం



విలేకరులతో మాట్లాడుతున్న నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్య రస్తోగీ





లాక్ హౌస్ మోనటరింగ్ సిస్టం పనితీరును వివరిస్తున్న దృశ్యాలు

నర్సీపట్నం: నేరాల నియంత్రణకు పోలీస్ సబ్‌డివిజన్ కేంద్రమైన నర్సీపట్నంలో మరో ఆధునిక నిఘా వ్యవస్థను ప్రవేశపెడుతున్నట్లు నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్య రస్తోగీ వెల్లడించారు. బుధవారం రాత్రి ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను వివరాలను విలేకరులకు వెల్లడించారు. లాక్ హౌస్ మోనటరింగ్ సిస్టం పేరుతో ప్రవేశపెడుతున్న ఈవ్యవస్థ ద్వారా తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో ఆస్తి దొంగతనాలను అరికట్టవచ్చునని ఆయన తెలిపారు. అనంతవరం జిల్లాలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ వ్యవస్థ విజయవంతం కావడంతో మిగతా జిల్లాల్లో కూడా పోలీస్ శాఖ అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా విశాఖ రూరల్ జిల్లాలో తొలిసారిగా నర్సీపట్నం, అనకాపల్లి, ఎలమంచిలి పట్టణాల్లో కొత్త వ్యవస్థను ప్రారంభిస్తున్నామన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉంటున్న వారు ఎవరైనా ఎక్కువ రోజులపాటు ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇళ్లల్లో దాచుకునే బంగారం, వెండి వంటి విలువైన వస్తువులతో పాటు నగదు భద్రతపై అనుమానాలు ఉంటాయని దొంగల బెడద భయం ఉంటుందన్నారు. అటువంటి వారు లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టంకు సంబంధించిన యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎల్‌హెచ్ఎమ్ఎస్ ఏపీపోలీసు పేరుతో డౌన్‌లోడింగ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. సదరు యాప్ ద్వారా ఇంటి యజమానులు వారు పేరు, చిరునామా, మొబైల్ నంబర్ ఫీడ్ చేయడం ద్వారా వారికి ఒక యూజర్ ఐడీ లభిస్తుందన్నారు. సదరు రిజిస్ట్రేషన్ ద్వారా ఎల్‌హెచ్ఎమ్ఎస్ వ్యవస్థను ప్రజలు ఎవరైనా ఉచితంగా పొందవచ్చన్నారు. ఇందుకు సంబంధించి రిక్వెస్టు పోలీస్ వాచ్ అనే అప్షన్ ద్వారా సమీప పోలీస్‌స్టేషన్ నుంచి సేవలు పొందవచ్చన్నారు. అటువంటి వారికి వారు ఇళ్లల్లో లేని రోజుల్లో సెన్సార్‌తో కూడిన కెమెరా ఫోన్‌ను వారి ఇంట్లో పోలీస్ శాఖ అమరస్తుందన్నారు. అటువంటి ఇళ్లల్లో అపరిచితులు ప్రవేశిస్తే సీసీ కెమేరా విజువల్స్ రికార్డు కావడమే కాకుండా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు, ఇంటి యజమానికి కూడా మేసెజ్ వస్తుందన్నారు. దీంతో పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి జీపీఎస్ ద్వారా సదరు ఇంటిని గుర్తించి పోలీస్ బృందాలను పంపిస్తారని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉచితంగా అందజేస్తున్న ఈ సేవను ప్రజలు ఎవరైనా ఒకటి రెండు కంటే ఎక్కువ రోజులు ఇంటికి తాళం వేసి వెళ్లినప్పుడు ఉపయోగించుకోవచ్చునని ఏఎస్పీ తెలిపారు. నర్సీపట్నంలో ఐదువేల మందికి ఈ సేవలను అందించేందుకు పోలీస్‌శాఖ అపార్టుమెంట్లు, కాలనీల్లో, విద్యాసంస్థల్లో ప్రచారం చేపడుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ సింహాద్రినాయుడు, రూరల్ సీఐ రేవతమ్మ పాల్గొన్నారు.

యువజన సర్వీసుల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



విలేకరులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ సత్యనారాయణమూర్తి

మాకవరపాలెం: యువజన సర్వీసుల శాఖ ఇచ్చే శిక్షణకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ సూపరింటెండెంట్ కె.సత్యనారాయణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉదయశ్రీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 9న విజయవాడలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ హైదరాబాద్ గ్రూపు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్టేడియంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా అభ్యర్థులు 1998, జనవరి 13వ తేదీ నుంచి 2001 జూన్ 27 తేదీల మధ్య జన్మించి వుండాలన్నారు. ఇంటర్ పరీక్షల్లో 50 శాతం మార్కులు వచ్చి వుండాలన్నారు. డిప్లమా అభ్యర్థులు అనర్హులు అని తెలిపారు. ఆసక్తిగల యువతీ యువకులు విశాఖపట్నం జిల్లా పరిషత్ ఎదురుగా ఈనెల 18,19 తేదీల్లో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు కుల, ఆదాయ, ఆధార్ కార్డు వంటి సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు.

సుబద్ర ఛారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులకు సహాయం



విద్యార్థులకు నగదును పంపిణీ చేస్తున్న దృశ్యం

మాకవరపాలెం: మండలంలోని జి.గంగవరానికి చెందిన సుబద్ర ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు 2016-2017 సంవత్సరానికి గాను మాకవరపాలెం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో పదవతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టి పదవతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మొగిలి దుర్గ వాసుకి ఏడువేల రూపాయిలు, ద్వితీయ స్థానం సాధించిన మేడిశెట్టి కాసుకి ఐదువేల రూపాయలు, తృతీయ స్థానం సాధించిన దలియా ఉమా కళ్యాణికి, సబ్బవరపు లచ్చబాబుకి వెయ్యి రూపాయల నగదును పంపిణీ చేశారు.తల్లి దండ్రుల పేరు మీద ఏర్పాటు చేసిన ట్రస్ట్ ప్రారంభించి మూడేళ్ల అయ్యిందన్నారు. ఇప్పటివరకు పలువురు పేద విద్యార్థులకు సహకారం అందిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు పి.రమణమూర్తి,పి.రఘురామ్.పి.రాజారావు తెలిపారు.జడ్పీటీసీసభ్యురాలు కసిపల్లి కుమారి, ఎంపీపీ రుత్తల చిన్నయ్యమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

ఇబ్బందుల్లో తామరం పాఠశాల విద్యార్థులు

పట్టించుకోని అధికారులు



తుప్పల మధ్య వున్న తామరం పాఠశాల మరుగుదొడ్డి

మాకవరపాలెం: పాఠశాలల్లో మరుగుదొడ్లు సక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ తామరం పాఠశాలలో మరుగుదొడ్లు తుప్పలతో దర్శనమిస్తున్నాయి. ఈ పాఠశాలలో 30మంది విద్యార్థులు వున్నప్పటికి మరుగుదొడ్లు నిర్మాణాలు మాత్రం అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాల శుభ్రతకు వెలుగు సిబ్బందిని నియమించినప్పటికీ ఇక్కడ మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయని విద్యార్థుల తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు అధ్వానంగా ఉంటున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరుగుదొడ్ల నిర్మాణాలు శుభ్రత పాటించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పోస్టల్ సిబ్బంది నిరవధిక సమ్మె



సమ్మెలో పాల్గొన్న పోస్టాఫీస్ సిబ్బంది

కృష్ణాదేవిపేట: పోస్టల్ సిబ్బందికి ఏడో వేతన కమిటీని వెంటనే అమలు చేయాలని బుధవారం నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నామని గ్రామీణ డాక్ సేవక్‌ల యూనియన్ కార్యదర్శి ఎల్.శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ డిమాండ్లు అయిన పింఛను, జీతాల పెంపు తదితర రాయితీలను తక్షణమే అమలయ్యేవరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందన్నారు. ఈసమ్మెలో సంఘం సభ్యులు అప్పారావు, ప్రసాద్, సాయి, నాగరాజు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సమావేశం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నర్సీపట్నం రూరల్: సుస్థిర అభివృద్ధి అనే అంశాలపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిదులతో సమావేశం నిర్వహించారు. సుస్థిర అభివృద్ధికి పంచ సూత్రాలు అమలు చేయాలని అన్ని రకాల పేదరికాన్ని,ఆకలిని అన్ని కోణాల నుంచి అంతమొందించాలని, ప్రకృతి వనరులను, వాతావరణాన్ని, భవిష్యత్తు తరాల కోసం సురక్షితంగా ఉంచాలని ప్రగతిసిరి సంస్థ కార్యదర్శి గెడ్డం విజయలక్ష్మి అన్నారు. 2030 వరకు ఇందుకు సంబంధించిన అజెండా పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో పైసా సంస్థ కార్యదర్శి సత్యనారాయణ, ప్రాంతం సంఘం కార్యదర్శి గెడ్డం శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



స్టేషన్ వద్ద ఇసుక ట్రాక్టర్లు

మాకవరపాలెం: మండలంలో అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో తూటిపాల గెడ్డ నుంచి ఇసుకను తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్టు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో ఇసుకను తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. తూటిపాల గెడ్డ నుంచి ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్టు ఆయన తెలిపారు. వాటిపై కేసులు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. మరో రెండు ఇసుక లారీలను పట్టుకున్నట్టు ఆయన తెలిపారు.

నేడు ఓరుగంటాలమ్మ జాతర

పాయకరావుపేట : మండలంలోని అరట్లకోట గ్రామదేవత ఓరుగంటాలమ్మ అమ్మవారి జాతర ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు విస్తృత ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సినిమా గైడ్

గౌతమ్ : లై
సూర్యమహల్ : జయ జానకి నాయక
సాయిమహల్ : నేనే రాజు నేనే మంత్రి
లక్ష్మీ (ఏసీ) : ఫిదా

శ్రీరాంపురంలో చెత్త సమస్య

- డంపింగ్‌యార్డుగా మారిన నివాసిత ప్రాంతం
- నిలిచిపోతున్న వర్షపు నీరు
- దుర్గంధం.. దోమల విజృంభణ
- వ్యాధులు వ్యాపిస్తాయన్న ప్రజల ఆందోళన


చెత్తను చూపిస్తున్న మహిళలు

పాయకరావుపేట : మండలంలోని శ్రీరాంపురం గ్రామ మెరకవీధిలో నివాసాల మధ్య ఉన్న చెత్తతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ దశాబ్దాల కిందట తాగునీటి బావి ఉండేది. ప్రస్తుతం పూడుకుపోవడంతో బావి పరిసరాల ప్రాంతాలను ప్రజలు చెత్త వేయడంతో డంపింగ్ యార్డుగా మారిపోయింది. గత కొంత కాలంగా ఇదే పరిస్థితి ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ పేరుకుపోయిన చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుండగా దోమల ఆవాస కేంద్రంగా మారింది. ఈ పరిసర ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా దోమలు చేస్తున్నాయి. వర్షపు నీరు పోయే మార్గం మూసుకుపోవడంతో ఏ మాత్రం వర్షం పడినా మురికికూపంలా మారుతోంది. పాడైన బావిని ఆనుకుని పంచాయతీ ఏర్పాటు చేసిన కుళాయి నుంచి రోజూ సుమారు 30 కుటుంబాలు నీరు పట్టుకుంటున్నాయి. చెత్త కుప్పల్లో విషపురుగులు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడిపోతున్నారు. గ్రామానికి చెందిన కొర్రా లక్ష్మి, బొప్పిన అమ్మాజి, గంగిరెడ్ల దుర్గాదేవి, జె.రత్నం, జి.పార్వతి, ముప్పిన శ్రీను, దాసరి దుర్గాప్రసాద్ తదితరులు మాట్లాడుతూ గ్రామంలో నివాసాల మధ్య పేరుకుపోయిన చెత్తచెదారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో వర్షాకాలంలో నరకాన్ని చవిచూస్తున్నామని గ్రామస్థులు వాపోయారు.

ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించి, మురుగునీరు పోయే మార్గం ఏర్పాటు చేయాలని, బావిని స్థానంలో తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దోమలతో ఇబ్బందులు పడుతున్నాం



ఇళ్ల మధ్య చెత్త పేరుకుపోయి డంపింగ్ యార్డుగా మారడం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దోమలు రాత్రి నిద్రలేకుండా చేస్తున్నాయి. దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగించి వర్షపు నీరు పోయే మార్గం ఏర్పాటు చేయాలి.

- గంగిరెడ్ల దుర్గారావు, శ్రీరాంపురం

డంపింగ్ యార్డుగా మారిపోయింది



దశాబ్దాల కిందట గ్రామస్థులు ఈ బావి నీరు తాగేవారు. పూడుకుపోయిన బావిని పంచాయతీ అధికారులు బాగుచేయకుండా వదిలేశారు. దీంతో చుట్టుపక్కల వాళ్ళు చెత్తచెదారం వేసి డంపింగ్ యార్డుగా మార్చేశారు. చెత్తను తొలగించి శుభ్రం చేసి మినీ ట్యాంకు ఏర్పాటు చేయాలి.

- బొప్పిన సత్యనారాయణ, శ్రీరాంపురం

మన్యంలో డాక్టర్ల కొరత అధికం

జిల్లా వైద్యవిధానపరిషత్ కో-ఆర్డినేటర్ నాయక్


భవనాన్ని పరిశీలిస్తున్న నాయక్

కోటవురట్ల: మన్యంలో డాక్టర్ల కొరత అధికంగా ఉందని జిల్లా వైద్యవిధాన పరిషత్ కో-ఆర్డినేటర్ నాయక్ అన్నారు. బుధవారం కమ్యూనిటీ ఆస్పత్రి కొత్త భవనాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మందులు కొరత లేదని చెప్పారు. పాడేరు, చింతపల్లి, అరకు ఆస్పత్రులకు స్త్రీ, చిన్నపిల్లల, మత్తు వైద్యనిపుణులు కొరత ఉందన్నారు. కోటవురట్లలో రూ. 3.8 కోట్ల ఆస్పత్రి భవనాలు నిర్మించామన్నారు. విద్యుత్ పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు.

నక్కపల్లి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా సురేష్

నక్కపల్లి : నక్కపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కక్కిరాల సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు మామిడి తాతాజీ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. సంఘ ప్రధాన కార్యదర్శిగా నున్న నర్సింహమూర్తి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ సంఘ అభివృద్ధితోపాటు నక్కపల్లి పరిసర గ్రామాల్లో పలు సామాజిక సేవా కార్యక్రమాలను కూడా తమ సంఘం తరపున విస్తృతపరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు నున్న వాసు, భగవాన్, కొత్తశ్రీను, సందీప్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెట్టుగోళ్లపల్లిలో శ్రీకృష్ణాలయం ప్రారంభం


పూజలు చేస్తున్న చలపతిరావు

ఎస్.రాయవరం(నక్కపల్లి) : ఎస్.రాయవరం మండలం పెట్టుగోళ్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణాలయాన్ని బుధవారం ప్రారంభించారు. అర్చకుల వేదమంత్రోచ్ఛరణల మధ్య కలశ స్థాపన, స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరిగాయి. గ్రామ పెద్దలు అల్లు నర్సింహమూర్తి, మోహన్, ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తగా ప్రారంభించిన కృష్ణాలయాన్ని ఎమ్మెల్సీ చలపతిరావు, ఎంపీపీ ఏజర్ల వినోద్‌రాజు, జడ్పీటీసీ సభ్యురాలు బొట్టాలక్ష్మి, టీడీపీ నాయకులు లాలం కాశీనాయుడు, నల్లపురాజు వెంకట్రాజు, గుర్రం రామకృష్ణ, జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు మాతా గుర్నాధరావు, ఏపీ యాదవ సంక్షేమసంఘం ప్రతినిధి కురందాసు నూకరాజు తదితరులు దర్శించుకున్నారు.

ఎయిర్‌ఫోర్స్ సెలక్షన్‌కి ఉచిత శిక్షణ

పాయకరావుపేట : వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించే ఎయిర్ ఫోర్స్ సెలక్షన్‌కు సంబంధించి ప్రభుత్వం ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఈఓపీఆర్డీ పి.వెంకటనారాయణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎయిర్‌ఫోర్స్‌లో వివిధ కేటగిరీల్లో సిబ్బంది నియామకానికి హైదరాబాద్‌లో ఎయిర్స్ ఫోర్స్ సెలక్షన్లు ఉన్నాయి. వీటికి హాజరయ్యే అభ్యర్థులకు రాష్ట్ర యవజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచిత భోజనం, వసతి కల్పించబడుతుందన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 19వ తేదీలోగా యువజన సర్వీసుల శాఖ సంక్షేమాధికారికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఉత్తమ ఉద్యోగులకు పురస్కారాలు


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న దృశ్యం

నక్కపల్లి : స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన స్థానిక ఎంపీడీఓ పిడుగు ఉమామహేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీఓ నానిబాబులకు మంగళవారం విశాఖలోని జరిగిన కార్యక్రమంలో హోంమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చినరాజప్ప, కలెక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే డివిజన్ స్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన తహసీల్దార్ రాణీ అమ్మాజీ, ఆర్ఐ బంగార్రాజు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, వీఆర్ఓ డి.వి.రామారావులకు నర్సీపట్నం ఆర్డీఓ కోరాడ సూర్యారావు ప్రశంసాపత్రాలను అందజేశారు.

మండలంలో బలపడుతున్న వైసీపీ

నియోజకవర్గ కో-ఆర్డినేటర్ రామకృష్ణ

నక్కపల్లి : మండలంలో వైసీపీ బలపడుతుందని ఆ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వీసం రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని అమలాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు వంకా సత్తిబాబు, వార్డు సభ్యురాలు వి.కాసులమ్మ, మత్స్యకార నాయకులు దొంగ బాబు, రాకతి జగ్గారావు, ఎం.ఎల్లమ్మ తదితరులు గ్రామ సర్పంచ్ సూరకాసుల రామలక్ష్మి ఆధ్వర్యంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు నక్కపల్లిలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గం వైసీపీ కో-ఆర్డినేటర్ వీసం రామకృష్ణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు వారికి కండువాలతో పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు లొడగల చంద్రరావు, జె.శేషారత్నం, పార్టీ నాయకుడు సూరకాసుల గోవింద్, అల్లాడ కొండ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా మరిణమ్మ ఆలయ ప్రారంభోత్సవం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన మరిణమ్మ తల్లి ఆలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఉదయం కలశస్థాపన, ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేక హోమాలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా చినదొడ్డిగల్లు గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు వీరంకి శ్రీనివాసరావు, రామాయణం సాయినాథ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులతోపాటు సర్పంచ్ వెలగా శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు వెలగా ఈశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు గట్టెం వీర రాఘవులు పాల్గొన్నారు. మూడు వేల మందికి అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, వైసీపీ కో-ఆర్డినేటర్ రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, దర్శించుకుని పూజలు చేశారు. అలాగే మండల టీడీపీ అధ్యక్షుడు కురందాసు నూకరాజు, మండల పరిషత్ చీఫ్ అడ్వయిజర్ కళ్లేపల్లి బాబ్జీరాజు, వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, టీడీపీ నాయకులు దేవవరపు శివ, గింజాల లక్ష్మణరావు,

పుస్తకాలతో జ్ఞాన సముపార్జన

- శ్రీప్రకాష్ విద్యా సంస్థల సహాయ కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్
- ఘనంగా ప్రారంభమైన 'చిల్టూరివారి అరుగులు'


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాయకరావుపేట : జ్ఞాన సముపార్జనకు పుస్తకాలు ఎంతో అవసరమని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సహాయ కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అన్నారు. బుధవారం శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో చిల్టూరివారి అరుగులు పేరిట ఏర్పాటు చేసిన రీడర్స్ క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిరకాల పుస్తకాలు అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో చిట్టూరివారి అరుగులు పేరుతో రీడర్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ క్లబ్‌లో అన్నిరకాల 4 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక నుంచి క్లబ్ ద్వారా ప్రతినెల రచయితల అభిప్రాయాలు, విశ్లేషణలతో పుస్తక సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. రీడర్స్‌క్లబ్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను శ్రీప్రకాష్ వెబ్ సైట్‌లో పొందుపరిచామన్నారు. అనంతరం శ్రీప్రకాష్ విద్యా సంస్థల మాజీ ఉపాధ్యాయుడు ఆదాళ్ళ శ్రీనివాసరావు(ఏఎస్ఆర్) రచించిన 'నాలో నేను' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ రచయిత, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు కె.ఆర్.జె.శర్మ, శ్రీప్రకాష్ విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి, ఎండీ ముక్తార్, పొన్నాడ శ్రీనివాసరావు, కె.నాగభూషణం పాల్గొన్నారు.



విద్యుత్ లైటింగ్‌లో ఆలయం

నేడు పోలిమేరమ్మ జాతర



ఎలమంచిలి : మున్సిపాలిటీ పరిధి లోని యర్రవరం సమీపంలో ఉన్న పోలి మేరమ్మ తల్లి జాతర గురువారం జరగ నుంది.ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా ఆగస్టు నెలలో ఈ జాతర చేయడం ఆనవాయితీ. పట్టణవాసులతో పాటు మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయను న్నారు. యర్రవరానికి చెందిన ఏఎంసీ డైరెక్టర్ మునగపాక నానాజీ ఆలయ ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఆల యాన్ని సర్వాంగ సుందరంగా తీర్చారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే ఆలయం నుంచి కిలోమీటరు వరకు లైటింగ్ ఏర్పాటు చేశారు.తెల్లవారు నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తనుండడంతో కమిటీ సభ్యులు వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు.

వివాహ నమోదులో నిర్లక్ష్యం

- పంచాయతీల్లో కానరాని రిజిస్ట్రేషన్లు
- ప్రజల్లో అవగాహన లేమే కారణం
- కాగితాలకే పరిమితమైన చట్టం
- పట్టించుకోని కార్యదర్శులు



లైనుకొత్తూరు పంచాయతీ కార్యాలయం

ఎలమంచిలి : ప్రజల్లో అవగాహన లోపమో...అధికా రుల నిర్లక్ష్యమో...తెలియదు గాని గ్రామాల్లో వివాహ నమోదు చట్టం సక్రమంగా అమలు కావడం లేదు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న నేటిరోజుల్లో కూడా పంచాయతీల్లో వివాహనమోదు రిజిస్ట్రేషన్ పట్ల ప్రజలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. చట్టం అమలులో కార్య దర్శుల వైఖరిపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీల్లో వివాహాలు జరిగేటప్పుడు ముందుగా తెలియజేయాలని చట్టంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికితోడు ప్రజల్లో కూడా అవగాహన లేకపోవడంతో చట్టం సక్రమంగా అమలు కావడం లేదు.

ఇదీ.. చట్టం

వివాహ నమోదు చట్టాన్ని 2002లో జీఓ నంబర్ 193 మేరకు అమలు చేశారు. దీని ప్రకారం ప్రతి పంచాయ తీలో వివాహాల నమోదును ఆయా పంచాయతీ కార్యద ర్శులు చేపట్టాలి. ఇప్పటివరకు ఉన్న వివాహ రిజిస్ట్రేషన్ చట్టంలో కుల, మతాల ప్రాతిపదికన కొన్ని మినహాయిం పులు ఉండగా ఇటీవల అన్ని మతాల వారికి రిజిస్ట్రేషన్ చట్టం వర్తించేలా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు వివాహ నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫ లం కావడంతో ఆశించిన స్థాయిలో ఈ చట్టం అమలు కావడం లేదు.

దరఖాస్తు నమోదు

వివాహం జరిగిన పంచాయతీలో సదరు పంచాయతీ కార్యదర్శికి ముందుగా సమాచారం అందించి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును పరిశీలించి వివాహం జరిగిన ట్టు కార్యదర్శి రిజిస్ట్రేషన్ చేసి ధ్రువీకరణ పత్రం అందజే స్తారు. వివాహం జరిగిన నెల రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.నెల దాటితే అదనపు రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.

అవగాహన లేమి

గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ వివాహ నమోదుపై ప్రజలకు అవగాహన లేదు. అధికారులు కూడా నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు దీనిపై ఆసక్తి చూపడం లేదు. నిరక్షరాస్యులకు ఈ చట్టం విధి విధానా లపై అవగాహన లేకపోయినప్పటికీ గ్రామాల్లో విద్యా వంతులైన వారు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం
సందీప్, ఎంపీడీఓ

గ్రామీణ ప్రాంతాల్లో వివాహ నమోదుపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సి ఉంది. ముఖ్యంగా చదువు కున్న యువత దీనిపై ప్రజలకు వివరించాలి. అధి కారులు కూడా గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో ప్రజ లకు అవగాహన కల్పిస్తున్నారు. వివాహాల నమోదుపై పల్లెల్లో బాగా ప్రచారం జరగాలి

రాయితీపై వ్యవసాయ పనిముట్లు



పనిముట్లు అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరాజు

అచ్యుతాపురం రూరల్ : ప్రభుత్వం రైతులకు రాయితీపై అందజేసే వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవా లని ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ సభ్యుడు జనప రెడ్డి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం వారు వ్యవసాయ కార్యాలయంలో హరిపాలెం, పెదపాడు, చీమలాపల్లి రైతులకు 50 శాతం రాయితీపై దమ్ము నాగలి, నైన్ టైన్ కల్టివేటర్ అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆధునిక పద్ధతిలో పంటలు సాగు చేసి, అధిక దిగుబడులు సాధించాల న్నారు. ఏఓ రంగాచారి మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకర ణలో భాగంగా అన్ని రకాల నాగలి సెట్లు, ఆయిల్ ఇంజన్లు సగం ధరకే అందిస్తున్నామని, అవసరమైన రైతులు వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేడు, రేపు రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

రాంబిల్లి/అచ్యుతాపురం: రాంబిల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురు, శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు సంబంధించి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి. నిర్మల తెలిపారు. బుధవారం ఆమె ఇక్కడి విలేఖరులతో మాట్లాడారు.ఎస్సీ కార్పొరేషన్‌కు 181, బీసీ కార్పొరేషన్‌కు 308, కాపు కార్పొరేషన్‌కు 1212, ఎస్టీ-2, మైనార్టీ-2, కుమ్మరి-2, కోఆపరేటివ్ సొసైటీ - 23, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు-12 చొప్పున దరఖాస్తులు వచ్చా యన్నారు. ఈ మేరకు గురువారం రాంబిల్లి, దిమిలి ఎస్‌బిఐ, ఎలమంచిలి డీసీసీబీ, మామిడివాడ కెనరా బ్యాంక్ అధికారులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహి స్తారన్నారు. అలాగే శుక్రవారం రాంబిల్లి, దిమిలి, హరిపాలెం, పూడి మండక ఎస్‌బిఐ, గోకివాడ కెనరా బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.దరఖాస్తుదారులు ఒరి జినల్ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయంలో కూడా ఇంటర్వ్యూలు జరగనున్నట్టు ఎంపీడీఓ బలరాం తెలిపారు.ఉదయం 10.30లకు అభ్య ర్థులు హాజరుకావాలని సూచించారు.

నిర్వాసితులకు ఉపాధి చూపండి

నేవీ ఎస్‌డీసీకి సీపీఎం నాయకుల వినతి



ఎస్‌డీసీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి : నేవల్ బేస్‌లోని నిర్మాణ పనుల్లో స్థానికు లకు ఉపాధి కల్పించాలని సీపీఎం నాయకులు డిమాం డ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారునేవీ ఎస్‌డీసీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి జి. దేముడునాయుడు,మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగరాజు మాట్లా డుతూ నేవల్ బేస్ ఏర్పాటు వల్ల నిర్వాసితులైన వారికి నిర్మాణ రంగంలో ఉన్న కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవ కాశాలు కల్పించడం లేదన్నారు. నేవల్‌బేస్ ఏర్పాటు వ ల్ల భూములు, ఇళ్ల కోల్పోయిన నిర్వాసితులను పక్కన పెట్టి స్థానికేతరులకుఉపాధి కల్పిస్తే నిర్వాసితులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు.దీనిపై స్పందించిన నేవీ ఎస్ డీసీ నిర్వాసితులకు ఉపాధి విషయమై ఇప్పటికే ఉన్న తాధికారులతో మాట్లాడామని, నిర్మాణ రంగంలో ఉన్న కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు.

కళాసీ సంఘం అధ్యక్షుడి మృతి పట్ల నివాళి

అచ్యుతాపురం : కళాసీ సంఘం మండల శాఖ అధ్యక్షుడు ధర్మిరెడ్డి రాంబాబు (62) బుధవారం మృతి చెందారు. రామన్నపాలెనికి చెందిన ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఏళ్ల తర బడి అచ్యుతాపురం జంక్షన్‌లో కళాసీ వృత్తి చేస్తూ ఇంటి పేరునే కళాసీగా మార్చుకున్నారు. స్థానికంగా ఆయనకు కళాసీ అప్పారావుగా మంచి పేరు ఉంది. ఆయన మృతి పట్ల ఎంపీపీ శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివా సరావు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

పోస్టల్ ఉద్యోగుల నిరవధిక సమ్మె



నిరవధిక సమ్మెలో గ్రామీణ పోస్టల్ సిబ్బంది

ఎలమంచిలి : తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఎలమంచిలి తపాలా కార్యాలయం పరిధిలోని 20 బ్రాంచిల గ్రామీణ పోస్టల్ సిబ్బంది బుధవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. ఈ మేరకు తపాలా కార్యాలయానికి ఎదురుగా టెంట్ వేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ పిలుపుమేరకు చేపట్టిన సమ్మెను డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు కొనసాగి స్తామని చెప్పారు. జీడీఎస్‌లను రెగ్యులరైజేషన్ చేసి డిపార్టు మెంటు ఉద్యోగులకు ఇస్తున్నఅన్ని బెనిఫిట్స్ మంజూరు చేయా లని, జీడీఎస్ వేతనాల పరిస్థితి పరిశీలనకు న్యాయ నిపుణు లతో కమిటీవేయాలని,టాస్క్‌ఫోర్సు నివేదిక ఆధారంగా తపాలా శాఖను కార్పొరైజేషన్ చేసే ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు.కాగా సిబ్బంది నిరవధిక సమ్మె వల్ల పట్టణం తో పాటు పలు గ్రామాల్లో పోస్టల్ సేవలు నిలిచిపోయాయి. ముఖ్యంగా పోస్టల్ ద్వారా బట్వాడా చేసే జాబులకు ఆటంకం ఏర్పడనుంది.అలాగే ఉపాధి కూలీలకు చెల్లింపులు నిలిచిపోయే అవకాశం ఉంది.

నారుతీతలో జాగ్రత్తలు అవసరం

రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు

అచ్యుతాపురం రూరల్ : వరినారు తీసే ముందు రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధి కారి రంగాచారి సూచించారు. బుధవారం ఆయన చోడ పల్లి, హరిపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో మాట్లాడారు. నారు తీతకు వారం రోజుల ముందుగా కార్బోఫ్యూరాన్ త్రీజీ గుళికలు చల్లుకోవాలని, దీని వల్ల 15 రోజుల వరకు కాండం తొలిచే పురుగు, ఆకు ముడతతెగులు రాకుండా నివారించవచ్చునన్నారు. అలాగే నారు ఊడ్చే ముందు చివరలను త్రుంచి నాటు కోవడం వల్ల కాండం తొలిచే పురుగు గుడ్లను నివారించ వచ్చునని చెప్పారు.

ఉడుపుల సమయంలో...

రాంబిల్లి : రైతులు వరి నాట్లు వేసేటప్పుడు పలు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి ఆర్. గాయత్రి సూచించారు. మండలంలోని రజాల, కు మ్మరాపల్లి గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలు స్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.వరి ఉడుపులు ప్రారంభం కావడంతో రైతులు మొదటిదమ్ములో సింగిల్ సూపర్ పాస్పేట్ 75 కిలోలు వేసి 3 రోజులు తరువాత ఆఖరి దమ్ములో 20 కిలోల జింక్ వేయాలన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ జింక్, సూపర్ పాస్ఫేట్ కలపరాదన్నారు. నాట్లు వేసేటప్పుడు నారు చివర్లు తుంచి నాట్లు వేసుకో వడం వల్ల కాండం తొలుచు పురుగు ఉధృతి తగ్గించుకో వచ్చునన్నారు.ఈకార్యక్రమంలో ఏఈవో ప్రసాద్, ఎంపీ ఈఓ మోహన్, తదితరులు పాల్గొన్నారు.



రాంబిల్లి : మాట్లాడుతున్న ఏఓ గాయత్రి



రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ రంగాచారి

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

కశింకోట రూరల్ : మండలంలో జి.భీమవరం, అడ్డాం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి హరికృష్ణ మాట్లాడుతూ వరి నారుమళ్ళు నాటినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో పి.మహేష్, సర్పంచ్ రెడ్డి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర- నిన్నుకోరి
శ్రీసత్య - లై
రాజా - జయ జానకి నాయక
షిర్డీసాయి - లై
పర్తిసాయి- ఫిదా
రామచంద్ర : నేనే రాజు నేనే మంత్రి
శ్రీసత్యనారాయణ : జయ జానకి నాయక

శ్రావణ మాసంలో గృహ ప్రవేశాలు

• పేదలకు ఎమ్మెల్యే 'పీలా' తీపికబురు • 2,220 ఇళ్లను ఏడాదిలోపు నిర్మిస్తామని వెల్లడి • లబ్ధిదారుల నుంచి డీడీల స్వీకరణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీలా

అనకాపల్లి టౌన్ : వచ్చే ఏడాది శ్రావణ మాసంలో నూతన ఇళ్లల్లో గృహప్రవేశాలు చేసే విధంగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో బుధవారం సత్యనారాయణపురం లే అవుట్‌లో నిర్మించనున్న ఇళ్ల లబ్ధిదారుల నుంచి డీడీలు తీసుకునే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం విషయంలో ఎటువంటి అపోహలకు తావివ్వరాదన్నారు. 2,220 గృహాలను ఏడాదిలోపు నిర్మించి లబ్ధిదారులకు అందిస్తామని వివరించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా శంకరం వద్ద రాజీవ్ గృహ కల్ప నిర్మాణం నిలిచిపోయిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ గృహ కల్ప పనులు వేగవంతం చేయడానికి రూ.9.2కోట్లు ముఖ్యమంత్రి మంజూరు చేయడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయని వివరించారు. పేదలందరికీ పక్కా ఇళ్లు ఇవ్వడమే తన ధ్యేయంగా చెప్పారు. సత్యనారాయణపురం లేఅవుట్ 80 అడుగుల రహదారి, కల్యాణ మండపం, పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులోకి వస్తాయన్నారు. లబ్ధిదారులు ఇంట్లో గృహప్రవేశం చేసిన దగ్గర నుంచే బ్యాంకు రుణం వాయిదాల పద్ధతిలో చెల్లించాలని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు లాటరీ విధానంలో ఇళ్ల కేటాయింపు జరుగుతుందని వివరించారు. హౌసింగ్ పీడీ శ్రీనివాస్ మాట్లాడుతూ లబ్ధిదారులు స్థోమతను బట్టి రుణాలకు సంబంధించి వాయిదాలు చెల్లించుకోవచ్చన్నారు. కార్యాలయం ఆవరణలో ఎనిమిది కౌంటర్లను ఏర్పాటు చేయడం చేశామని, డీడీల పూర్తి వివరాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ షేక్ సుభానీ, టీడీపీ నాయకులు బుద్ద నాగ జగదీశ్వరరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, మళ్ల సురేంద్ర, కొణతాల వెంకటరావు, బీఎస్ఎంకే జోగినాయుడు, బొడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలకు పాడైన గుడ్లు సరఫరా'


పాడైన గుడ్లు చూపుతున్న నిర్వాహకులు

అనకాపల్లి రూరల్ : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అందించే గుడ్లు కరిగిపోయాయని మధ్యాహ్న భోజనం నిర్వాహకులు ఆరోపించారు. మండలంలోని జీవీఎంసీ విలీన గ్రామం కొత్తూరు నర్సింగరావుపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం భోజనంతో వడ్డించే గుడ్లు కరిగిపోవడంతో వాటిని విద్యార్థులకు వడ్డించలేదని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలకు వచ్చే గుడ్లు చిన్నవిగా, కుళ్లినవి వస్తున్నాయని అధికారులు ఈ తక్షణమే దృష్టి సారించాలని కోరారు. దీనిపై ఎంఈవో దివాకర్ మాట్లాడుతూ పలు పాఠశాలల నుంచి తమకు ఈ విషయమై ఫిర్యాదులు అందినట్టు చెప్పారు.

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి


విజయరామరాజుపేటలో నివాళి

నెహ్రూచౌక్ : విజయరామరాజుపేటలో గల వినాయకు ఆలయం వద్ద బుధవారం యాత, శెట్టిబలిజ, గౌడ యూత్ ఆధ్వ ర్యంలో డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చన్న చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐఆర్ గంగాధర్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పిట్ల బుడ్డేసు, రెడ్డి రంగారావు, యల్లంకి సత్తిబాబు, యంద్ర రామకృష్ణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కె.గోవిందరావు భవనంలో..

అనకాపల్లి రూరల్ : బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి గౌతు లచ్చన్న జయంతిని బుధవారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. కె.గోవిందరావు భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. లచ్చన్న సేవలను పలువురు కీర్తించారు. కార్యక్రమంలో వైఎన్ భద్రం, విత్తనాల పోతురాజు, రాజాన దొరబాబు, కోన లక్ష్మణ్, కట్టా పైడిరాజు, మామిడి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ


వేడుకల్లో పాల్గొన్న మహేష్ తదితరులు

కొత్తూరు : గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మికతను మరింత పెంపొందించేందుకు దేవాలయాలు దోహద పడతాయని పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ సోదరుడు ముత్తంశెట్టి మహేష్ అన్నారు. సీతానగరంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర ఆలయంలో బుధవారం జరిగిన విగ్రహ ప్రతిష మహోత్సవంలో మాట్లాడారు.సమష్టిగా ఆలయ నిర్మాణం గొప్ప విషయమన్నారు. సర్పంచ్ గంగుపాం రామలక్ష్మి, మండల టీడీపీ నాయకుడు పచ్చికూర రాము, కొణతాల శ్రీనివాసరావు, శెట్టి వెంకటరమణ, తాడి రామకృష్ణ, శ్రీరామదాసు గోవింద, సకల గోవింద, నక్కా చెల్లయ్య, కర్రి దేముళ్ళు, ఎంపీటీసీ రాము తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు రూ.42.33 కోట్ల రుణాలు

అనకాపల్లి రూరల్ : మండలంలోని స్వయం సహాయక సంఘాలకు 2016-17 సంవత్సరానికి సంబంధించి రూ.42.33 కోట్ల బ్యాంకు రుణాలు ఇప్పించినట్టు వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ అరుణకుమారి తెలిపారు. సిరసపల్లి వద్ద గల మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద బుధవారం జరిగిన మండల మహిళా సమాఖ్య వార్షికోత్సవ సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఆర్.రామకృష్ణనాయుడు, మండలంలోని స్వయం సహాక సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, సీసీలు పాల్గొన్నారు.

ఎంపీ దత్తత గ్రామంలో రహదారి సమస్యపై వినూత్న నిరసన

రోడ్డుపై వరినాట్లు వేసిన మహిళలు

కశింకోట రూరల్ : మండలంలోని తాళ్లపాలెం తారకరామ కాలనీలో రహదారి సమస్యపై గ్రామస్థులు బుధవారం వినూత్నంగా నిరసన తెలిపారు. అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు దత్తత గ్రామమైన ఇక్కడ కనీసం నడవడానికి కూడా వీలు లేకపోవడంతో ఈ కాలనీ రోడ్డుపై మహిళలు వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. నిత్యం ఈ రోడ్డులో మురుగు తిష్ఠవేస్తోందని వివరించారు. ఈ సమస్యపై అధికారులు స్పందించాలని కోరారు.


రోడ్డుపై వరినాట్లు వేస్తున్న వేస్తున్న దృశ్యం

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

అనకాపల్లి టౌన్ : స్థానిక కన్యకాపరమేశ్వరీ దేవస్థానం కమిటీ నిరుపేద విద్యార్థులకు బుధవారం ఉపకార వేతనాలు పంపిణీ చేసింది. ఆలయానికి దాతలు ఇచ్చిన విరాళాలతో వచ్చిన వడ్డీ లక్షా యాభై వేల రూపాయలను వంద మంది విద్యార్థులకు అందజేశారు. విశాఖ కంకటాల స్కిల్స్ అధినేత కంకటాల మల్లికార్జునరావు (మల్లిక్) దంపతులు వీటిని విద్యార్థులకు అందించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు టీవీ వెంకటరమణమూర్తి, కొరుపోలు జగదీశ్వరరావు, నూకయ్యశెట్టి, బిళ్లపాటి కృష్ణకుమార్, కోరుకొండ బుచ్చిరాజు, గ్రంధి లక్ష్మణకుమార్, బీఎం గాంధీ పాల్గొన్నారు.

పోలీసు యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



అనకాపల్లి టౌన్ : నేరాల నియంత్రణకు పోలీసుశాఖ ప్రవేశ పెట్టిన ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి డిఎస్పీ కేవీ రమణ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం రింగ్ రోడ్డులోని లక్ష్మీనారాయణనగర్, పరిసర అపార్టుమెంట్లులో నివాసం ఉంటున్న వారికి పోలీసు యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐలు బీవీజీ ప్రసాద్, సంపతిరావు విద్యాసాగర్, కాలనీవాసులు బుద్ద రామకృష్ణ, అమరేంద్రబాబు, డీవీఎన్ కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పీలా' జన్మదిన వేడుకలకు సన్నాహాలు

అనకాపల్లి : ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఈ నెల 18న జరగనున్న నేపథ్యంలో బుధవారం నూకాంబిక అమ్మవారి కల్యాణ మండపంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీలా జన్మదిన వేడుకలను అమ్మవారి కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయించారు. అలాగే పేదలకు చీరలు పంచాలని, సాంస్కృతిక కార్యక్రమాలు, ఫొటో ఎగ్జిబిషన్, వైద్యాలయంలో రోగులకు, పాలు రొట్టెల పంపిణీ వంటివి చేపట్టాలని తీర్మానించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కేకేవీఏ నారాయణరావు, మళ్ల సురేంద్ర, కొణతాల వెంకటరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, బీఎస్ఎంకే జోగినాయుడు, బోడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నూరుపాలెంలో పూర్వ విద్యార్థుల కలయిక



కశింకోట రూరల్ : కన్నూరుపాలెం జడ్పీపాఠశాలలో 2000-2001 సంవత్సరంలో పదో తరగతి చదివిన వారంతాబుధవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. సాయంత్రం వరకు ఆటపాటలతో సరదాగా గడిపారు. అనంతరం అంతా కలిసి కొత్తగా కట్టిన స్కూల్ భవనానికి ఎలక్ట్రికల్ వైరింగ్ నిమిత్తం నిధులను సర్పంచ్‌కు అందజేశారు.

బీజేపీ సీనియర్ నాయకుడు 'కర్రి' కన్నుమూత



అనకాపల్లి టౌన్ : పట్టణానికి చెందిన భారతీయ జనతాపార్టీ సీనియర్ నాయకుడు కర్రి వెంకటరమణ (87) బుధవారం కన్నుమూశారు. అనారోగ్యంతో విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ పట్టణశాఖ అధ్యక్షునిగా కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షునిగా , ప్రధానకార్యదర్శిగా పనిచేశారు.



ఆరోగ్య తనిఖీల కోసం ఆస్పత్రిలో చేంతాడంత క్యూలో నిల్చొన్న గర్భిణులు

క్యూలో నిండు గర్భిణుల తిప్పలు
కుర్చీలు, బెంచీలు లేక నిల్చొని నిరీక్షణ
పాడేరు ఏరియా ఆస్పత్రిలో దుస్థితి

సహనానికి పరీక్ష

పాడేరు రూరల్: నిండు గర్భిణుల సహనానికి ఏరియా ఆస్పత్రి సిబ్బంది పరీక్ష పెట్టారు. ఆరోగ్య తనిఖీల కోసం వచ్చిన వారికి బెంచీలు ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు క్యూలో అగచాట్లు పడ్డారు. గైనిక్ ఒక్కరే ఉండడం... అధిక సంఖ్యలో గర్భవతులు తరలి రావడంతో గంటల తరబడి నిల్చొని నిరీక్షించారు.

ఏరియా ఆస్పత్రిలో ప్రతి నెలా 9వ తేదీన గర్భిణులకు ప్రత్యేకంగా ఆరోగ్య తనిఖీలు చేస్తున్నారు. దీంతో వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో గర్భిణులు తరలి వచ్చేవారు. వారి సౌకర్యార్థం ఆస్పత్రి సిబ్బంది కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేసేవారు. అయితే, ఇటీవల ఆస్పత్రికి డిప్యుటేషన్‌పై గైనిక్‌న నియమించడంతో వారానికోసారి గర్భిణులకు తనిఖీలు చేస్తున్నారు. ఈ ప్రక్రియను ప్రతి బుధవారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ వారం మండలంలోని వివిధ పంచాయతీల నుంచి దాదాపు 68 మంది గర్భిణులు ఆరోగ్య తనిఖీల కోసం వచ్చారు. వారు కూర్చొవడానికి ఈసారి కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేయలేదు. దీంతో నిండు గర్భవతులు ఆరోగ్య తనిఖీల కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చింది. ఈ క్రమంలో వారంతా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏరియా ఆస్పత్రిలోని గైనికాలజిస్టు ఒక్కరే ఉండడం.. గర్భవతులు అధిక సంఖ్యలో రావడంతో తనిఖీల్లో కొంత వరకు ఆస్యమైంది. దీంతో కూర్చొనేందుకు కుర్చీలు, బెంలుఉ లేక గర్భిణులకు కష్టాలు తప్పలేదు. అధికారులు స్పందించి ఇకపై నిర్వహించే తనిఖీల రోజుల్లోనైనా కుర్చీలు ఏర్పాటు చేయాలని గర్భిణులు వేడుకున్నారు.

52 మంది చిన్నారులకు వైద్య సేవలు

ఏరియా ఆస్పత్రికి వివిధ వ్యాధులతో అధిక సంఖ్యలో బుధవారం చిన్నారులను తీసుకు వచ్చారు. నవజాత శిశు సంవరక్షణ కేంద్రంలో దాదాపు 52 మంది చిన్నారులకు చిన్న పిల్లల వైద్య నిపుణుడు సందీప్ సేవలు అందించారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులతో చిన్నారులు ఇబ్బంది పడుతుండడంతో ఏరియా ఆస్పత్రిలోని నవజాత శిశు సంవరక్షణ కేంద్రానికి తీసుకు వచ్చారు. ఎక్కువ మంది చిన్నారులు జ్వరం, జలుబు, ఊపిరి సమస్యతో బాధ పడుతున్నవారే ఉన్నారని వైద్య నిపుణుడు సందీప్ తెలిపారు.



చిన్న పిల్లల వైద్యం కోసం నిరీక్షిస్తున్న తల్లిదండ్రులు

నేడు ట్రైకార్ రుణాల దరఖాస్తుల పరిశీలన

జి.మాడుగుల: మండల పరిషత్ కార్యాలయంలో ట్రైకార్ రుణాల దరఖాస్తులు గురువారం పరిశీలిస్తామని ఎంపీడీవో ప్రేమాకరరావు తెలిపారు. 2015-16, 2017-18 సంవత్సరాలకు సంబంధించి ట్రైకార్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు. దరఖాస్తుదారులంతా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులతో రావాలని తెలిపారు.

నకిలీ కానిస్టేబుల్ వ్యవహారంలో..
ముగ్గురిపై కేసు నమోదు

సీలేరు: నకిలీ ఎక్సైజ్ కానిస్టేబుల్ వ్యవహారంపై ఎస్ఐ విభూషణరావు చర్యలు చేపట్టారు. ధారకొండలో సోమవారం ఎక్సైజ్ కానిస్టేబుల్‌నని చెప్పి కొంత మంది సారా తయారీదారుల వద్ద వసూళ్లు చేసిన చేయడం, అనుమానం వచ్చి బాధితులు నిలదీయగా ఆగంతుకుడు పోలీసు దుస్తులు, ఆధార్ కార్డు విడిచి వెళ్లడం పాఠకులకు తెలిసిందే. దీనిపై మంగళవారం ఎక్సైజ్ ఎస్ఐ విచారణ చేపట్టారు. చాకీరేవుగెడ్డకు చెందిన కిముడు సీతమ్మ, కిముడు బుద్రాల నుంచి నకిలీ ఎక్సైజ్ కానిస్టేబుల్ రూ.3000 అపహరించుకుపోయారని, ఈ వ్యవహారంలో చింతపల్లి మండలం కిన్నర్లకు చెందిన లంబసింగి శివతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నారని వీఆర్‌ఏ బాబూలాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లంబసింగి శివతో పాటు మరో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ విభూషణరావు తెలిపారు.

వర్తక సంఘం నూతన కార్యవర్గం

సీలేరు: వర్తక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. సంఘం గౌరవ అధ్యక్షుడు సాంబ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా నసీర్ షపిక్, కార్యదర్శిగా డి.చక్రధరరావు, కోశాధికారులుగా ఎన్.నాధరరావు, కె.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా మరి కొంత మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భూ బదలాయింపు చట్టం ఉల్లంఘిస్తే చర్యలు

పాడేరు ఆర్డీవో వేణుగోపాల్

చింతపల్లి: ఏజెన్సీలో భూ బదలాయింపు చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పాడేరు ఆర్డీవో వేణుగోపాల్ హెచ్చరించారు. మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. అంతర్ల, రౌరింతాడ, లంబసింగి గ్రామాల్లో వివాదాస్పద భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ఏజెన్సీలో భూ బదలాయింపు చట్టం అమలుల్లో ఉందని, గిరిజనేతరులు భూములను కొనుగోలు చేయడం, విక్రయించడం చెల్లదని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులకు భూములపై ఎటువంటి హక్కు లేదని ఆయన పేర్కొన్నారు. లంబసింగిలో కోర్టు పరిధి విచారణలో ఉన్న భూముల్లో నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఆయా భూముల్లో ఎటువంటి పనులు నిర్వహించకూడదని చెప్పారు.

మావోయిస్టు బాధితులకు భూముల పంపిణీ

సీసీఐ మావోయిస్టుల కారణంగా నష్టపోయిన బాధితులకు ఇళ్ల స్థలాలు, సాగు భూములను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో వేణుగోపాల్ తెలిపారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 63లో ఉన్న 73 ఎకరాల భూములను ఒక్కొక్క కుటుంబానికి రెండు, మూడు ఎకరాల చొప్పున పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభా అవార్డును పొందిన ఆర్డీవోను తహసీల్దార్ ఉమామహేశ్వర రావు, ఎంఈవో ప్రసాద్, గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు యూవీ గిరి, గెమ్మెలి మోహన్ తదితరులు సన్మానించారు.



అంతర్లలో వివాదాస్పద భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో

'అవుట్‌పోస్టులపై ఎందుకంత శ్రద్ధ'



విలేకరులతో మాట్లాడుతున్న సర్పంచ్, సీపీఐ నేత

సీలేరు: ఆదివాసీలకు ఉపయోగం లేని పోలీసు అవుట్ పోస్టుల ఏర్పాటుపై ప్రభుత్వం ఎందుకు శ్రద్ధ తీసుకోవడమని ధారకొండ సర్పంచ్ రాజుఏసువరరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకర విష్ణుమూర్తి ప్రశ్నించారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ, గూడెంకొత్తవీధి మండలంలో అనేక పంచాయతీల పరిధిలోని గ్రామాలకు కనీస సదుపాయాలు కూడా లేవని, వాటిపై దృష్టిసారిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. రహదారి, తాగునీరు, విద్య, వైద్యం తదితర సదుపాయల లేమితో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల గ్రామాల్లో పాఠశాలలను ఎత్తి వేయడంతో గిరిజన పిల్లలు విద్యకు దూరమైపోతున్నారని వాపోయారు. అలాగే డిగ్రీలు చదువుకుని చాలా మంది గిరిజన యువతీ, యువకులు ఉపాధి లేక ఖాళీగా ఉంటుంటున్నారని చెప్పారు. ఆస్పత్రుల్లో అరకొర సిబ్బందితో వైద్యం అందక అనేక మరణాలు సంభవిస్తున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం వీటిపై స్పందించకుండా అవుట్‌పోస్టుల ఏర్పాటు గురించి ఆలోచించడం సరికాదని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి అవుట్‌పోస్టుల ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని, గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు విన్నవించారు.

యూనియన్ బ్యాంకు రద్దీ

వరుస సెలవుల అనంతరం పోటెత్తిన ఖాతాదారులు

సీలేరు: సీలేరులో యూనియన్ బ్యాంకు సోమవారం రద్దీగా కనిపించింది. వరుస సెలవులు రావడంతో బుధవారం ఖాతాదారులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో బ్యాంకు ఒక్కసారిగా తాకిడి పెరిగిపోయింది. శనివారం నుంచి మంగళవారం వరకూ నాలుగు రోజుల పాటు బ్యాంకులకు సెలవులు రావడంతో రోజువారీ లావాదేవీలు, డ్వాక్రా రుణాలు, గిరిజన రైతులకు రుణాల పంపిణీ వంటి కార్యక్రమాలు స్తంభించిపోయాయి. దీంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం బ్యాంకు తెరచుకోవడంతో ఉదయం 10 గంటలకే ధారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల పంచాయతీలకు చెందిన గిరిజనులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వారంతా లావాదేవీల కోసం గంటల తరబడి క్యూల్లో నిల్చొన్నారు.

కొండ నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు



పాడేరు రూరల్: వంట చెరకు కోసం కొండకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడిన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు బుధవారం ఏరియా ఆస్పత్రికి తీసకురాగా, మెరుగైన వైద్య సేవల కోసం కేజీహెచ్‌కు వెళ్లాలని వైద్యులు సూచించారు. హుకుంపేట మండల కేంద్రానికి చెందిన సమిడ మత్స్యరాజు(47) బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని కొండకు వెళ్లి వంటకు కట్టెలు సేకరించారు. కట్టెలతో తిరిగి వస్తున్న సమయంలో కొండపై కాలు జారి పడిపోయాడు. దీంతో అతని ఎడమ కాలు విరిగిపోయింది. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకు వచ్చారు. కాలు విరిగిపోవడంతో మత్స్యరాజుకు మెరుగైన వైద్య సేవలు అవసరమని వైద్యులు గుర్తించారు. దీంతో విశాఖ కేజీహెచ్‌కు వెళ్లాలని వారు సూచించారు.

సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలి

జి.మాడుగుల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ మండల కార్యదర్శి కళ్యాణం సూచించారు. మండల కేంద్రంలో బుధవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో పాటు పడుతున్నదని చెప్పారు. అలాగే గిరిజనుల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నదన్నారు. వీటిని ప్రజలకు చేరువ చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆయన సూచించారు. తద్వారా పార్టీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. అలాగే మారుమూల గ్రామాల్లో మంజూరైన గ్రావిటీ పథకాలన్నీ పూర్తి స్థాయిలో నిర్మాణం జరిగి, ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



శిథిలమైన ఎల్.కృష్ణాపురం ప్రాథమిక పాఠశాల భవనం



అర్ధంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణం

అటు శిథిలం.. ఇటు అసంపూర్ణం

- అవస్థల నడుమ విద్యార్థుల చదువులు
- అర్ధంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణం
- అందులోనే కటిక నేల మీద విద్యాభ్యాసం
- ఎల్.కృష్ణాపురం ప్రాథమిక పాఠశాల దుస్థితి



అసంపూర్తి భవనంలో కటిక నేలమీద కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు

మాడుగుల: మండలంలోని ఎల్.పొన్నవోలు పంచాయతీ ఎల్.కృష్ణాపురం ప్రాథమిక పాఠశాల భవనం శిథిలమై ఏ క్షణమైనా కూలిపోవటానికి సిద్ధంగా ఉంది. శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. వర్షం వస్తే గదులన్నీ కారిపోతున్నాయి. ఈ పరిస్థితిని గమనించి ప్రభుత్వం కొత్త భవన నిర్మాణానికి మూడేళ్ల క్రితం సర్వశిక్ష అభియాన్ కింద రూ.5.5 లక్షలు మంజూరు చేసింది. తొలివిడతగా రూ.3 లక్షలు విడుదల చేసింది. దరిమిలా భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ రూ.3 లక్షలు ఖర్చు చేసి మిగిలిన నిధులు విడుదల కాక నిర్మాణాన్ని అర్ధంతరంగా నిలిపివేశాడు. కాగా, పాత భవనం శిథిలం కావడం, శ్లాబ్ పెచ్చులూడి పడుతుండడంతో ఆ భవనం ఏ క్షణంలో కూలిపోతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో 40 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మా ణాన్ని పూర్తి చేయించాలని విద్యాశాఖ అధికారులను ఎన్ని పర్యాయాలు కోరినా ఫలితం లేకుండాపోతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తరగతులు జరుగుతుండగా భవనం కూలి జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని భావించిన ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అసంపూర్తిగా ఉన్న భవనంలోనే విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. ఈ భవనం గోడలకు ప్లాస్టింగ్ జరగలేదు. గచ్చులు పూర్తి కాలేదు. ఇక్కడ ఫర్నిచర్ లేకపోవడంతో విద్యార్థులు కటిక నేలమీదే కూర్చుని పాఠాలు చదవాల్సి వస్తోంది. కాగా అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవోను కోరినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సప్పా శివ తెలిపారు. శిథిలమైన పాత భవనంలో చదువు చెప్పలేక గత్యంతరం లేని పరిస్థితుల్లో అసంపూర్తి భవనంలోనే పాఠాలు చెప్పాల్సి వస్తోందని అన్నారు. దీనిపై ఎంఈవో దేముడమ్మను వివరణ కోరగా పాఠశాల పరిస్థితి గురించి ప్రధానోపాధ్యాయుడు లిఖితపూర్వకంగా వివరించారని అన్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో, జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లామన్నారు.

హామీలు లేకుండా రుణాలివ్వలేం

తహసీల్దార్‌కు తేల్చిచెప్పిన బ్యాంకర్లు



బ్యాంకర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

దేవరాపల్లి: ఎటువంటి హామీలూ లేకుండా కౌలు రైతులకు రుణాలు ఇవ్వలేమని బ్యాంకర్లు తేల్చి చెప్పారు. కౌలు రైతులకు ఖరీఫ్ రుణాలివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బ్యాంకర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ వైఎస్.నాగరాజు మాట్లాడుతూ, మండలంలో 614మంది కౌలు రైతులు ఉన్నారని, వారికి పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను కోరారు. బ్యాంకు మేనేజర్లు మాట్లాడుతూ, కౌలు రైతులకు భూయజమాని పాస్‌పుస్తకాలు ఇచ్చి సర్టిఫికెట్ ఇస్తే రుణాలు మంజూరు చేయగలమని అన్నారు. నిర్దిష్టమైన హామీ ఉంటేగాని రుణాలు ఇవ్వలేమని తేల్చిచెప్పారు. సమావేశంలో దేవరాపల్లి ఎస్‌బీఐ దేవరాపల్లి, ఎం.అలమండ ఎస్‌బీహెచ్, యూకో బ్యాంకు, ఏపీజీవీబీ, జిల్లా కోఆపరేటివ్ బ్యాంకుల అధికారులు, మండల వ్యవసాయ అధికారి డి.అప్పారావు పాల్గొన్నారు.

శరవేగంగా ఆలయ మండప నిర్మాణ పనులు



నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

మాడుగుల: మండలంలోని కస్పా జగన్నాధపురం జంక్షన్‌లో సంతోషిమాత ఆలయ మండప నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు మాట్లాడుతూ ఈ గ్రామ చుట్టుపక్కల ప్రజలు, భక్తుల నుంచి విరాళాలు సేకరించి ఈ మండపం నిర్మాణం చేపడుతున్నామన్నారు. దాతల సహకారంతో ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రతి శుక్రవారమూ ఆలయానికి వచ్చే భక్తులకు అన్న సమారాధన గావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాపేటి జోగినాయుడు, వీకేపీ అప్పారావు, వేగి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం



రోడ్డును ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సత్యవతి

చీడికాడ: గ్రామీణ అభివృద్ధికి కృషి చేస్తానని జడ్పీటీసీ సభ్యురాలు పి.సత్యవతి అన్నారు. చీడికాడ ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి హైస్కూల్ వరకూ రూ.2లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆమె ప్రారంభించారు. రాగల రెండేళ్లలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తానని ఆమె అన్నారు. ఉప సర్పంచ్ యర్రా అప్పారావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు జి.సత్యనారాయణ రాజు, హెచ్‌ఎం జయలక్ష్మి, అజయ్, దేముడునాయుడు, పీవీజీ .కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉండే వ్యక్తికి పార్టీ టిక్కెట్ ఎలా వస్తుంది?

ఏపీ జన్మభూమి కమిటీ సమన్వయకర్త పైలా ప్రసాదరావు వ్యాఖ్యలపై మాడుగుల, చీడికాడ మండల టీడీపీ నేతల మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

మాడుగుల: మండలంలో ఉమ్మడిగా ఉన్న తెలుగుదేశం పార్టీని అసంబద్ధ ప్రకటనలతో గ్రూపులుగా విడదీయవద్దని ఏపీ జన్మభూమి కమిటీ సమన్వయకర్త పైలా ప్రసాదరావుకు టీడీపీ మండల నాయకులు హితవు పలికారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పార్టీ మండల కమిటీ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మజ్జి రామారావు తదితరులు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో మాడుగుల నియోజకవర్గం టీడీపీ టిక్కెట్ తనకు ఖాయమని ప్రసాదరావు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజల మధ్యన ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే నాయకుడు ఎవరన్నది ఇంటిలిజెన్స్ నివేదిక ఇప్పటికే పార్టీ అధిష్ఠానం వద్ద ఉందన్నారు. సమావేశంలో ఓండ్రు కృష్ణ, టౌన్‌పార్టీ అధ్యక్షుడు శ్రీనాధు మధు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి మరువాడ ఈశ్వరరావు, మండల కార్యదర్శి నందారపు సన్యాసిరావు, పొంగలిపాక ఎంపీటీసీ సభ్యుడు ఉండూరు దేముడు, సాగరం సర్పంచ్ బుద్ధాల రమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న చీడికాడ టీడీపీ నేతలు

చీడికాడ: ఏపీ జన్మభూమి కమిటీ సమన్వయకర్త పైలా ప్రసాదరావు అనాలోచిత ప్రకటనల వల్ల టీడీపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటున్నాయని చీడికాడ మండల టీడీపీ నాయకులు అన్నారు. 2019లో మాడుగల నియోజకవర్గంలో టీడీపీ టిక్కెట్ తనకే వస్తుందన్న ప్రసాదరావు ప్రకటనపై పార్టీ మండల నాయకులు స్పందించారు. బుధవారం ఎంపీపీ కుచ్చు కళావతి, పేరపు కొండబాబు విలేఖరులతో మాట్లాడుతూ, 2009 ఎన్నికల్లో పోటీ ఓటమిపాలైన పైలా తరువాత విదేశాలకు వెళ్లిపోయారని, ప్రతిసారి ఎన్నికలకు ముందు వచ్చి హడావిడి చేసి పోతుంటారని అన్నారు. విదేశాల్లో ఉంటూ వ్యాపారం చేసుకునేవారికి పార్టీ అధిష్ఠానం టిక్కెట్ ఎలా ఇస్తుందని వారు ప్రశ్నించారు. కార్యకర్తలను అయోమయంలోకి నెట్టే ప్రకటనలు చేయవద్దని పైలా ప్రసాదరావుకు హితవు పలికారు. జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు, జలాశయం చైర్మన్ గండి ముసలినాయుడు, నాయకులు కొల్లి సూరినాయుడు, పంచాడ దాలెంనాయుడు, పోతల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చతికిలబడిన చెత్త నుంచి సంపద కేంద్రాల ఏర్పాటు

అనుకూలంగా లేనిచోట స్థలాల కేటాయింపు

27 గ్రామాల్లో ఏర్పాటుకు నోచుకోని కేంద్రాలు

ఐదు గ్రామాల్లో సాగుతున్న నిర్మాణాలు



వడ్డాదిలో నిర్మితమవుతున్న చెత్త సంపద కేంద్రం

బుచ్చెయ్యపేట : మండలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ఏర్పాటు లక్ష్యం కుంటుపడింది 2016లో రాష్ట్ర ప్రభుత్వం ఈ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించింది. జనాభా ప్రాతిపదికపై కనిష్ఠంగా రూ. 3 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.7 లక్షల వరకు కేంద్రం నిర్మాణానికి అంచాన వ్యయాలను ఉపాధి పథకం అధికారులు తయారు చేశారు. నిబంధనలకు లోబడి స్థలాలు కేటాయించాలని జిల్లా కలెక్టరు ప్రవీణ్‌కుమార్ తహసీల్దార్‌లను ఆదేశించారు. ఈ మేరకు మండలంలో 32 గ్రామ పంచాయతీలకు గాను బుచ్చెయ్యపేట, వడ్డాది, గున్నెంపూడి, ఎల్‌బీపీ.అగ్రహారం, తురకలపూడి గ్రామాల్లో మాత్రమే అనుకూలం కావడంతో ఈ గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దిబ్బిడి, మంగళాపురం, విజయరామరాజుపేట, లోపూడి, ఎల్.సింగవరం, పొట్టిదొర పాలెం, కోమళ్లపూడి, గంటి కొర్లాం, కొండెంపూడి, కేపీ. అగ్రహారం, పెదమదీనా, కొండ పాలెం, మల్లాం, ఆర్.శివరామపురం, ఆర్.భీమవరం, రాజాం, నీలకంఠాపురం, తైపురం, చిట్టియ్యపాలెం, కరక, చింత పాక, పెదపూడి, పీపీ.అగ్రహారం, పొలేపల్లి, కందిపూడి గ్రామాల్లో కేటాయించిన స్థలాలు చెరువు గర్భాలు, శ్మశానాలు కావడంతో అవి కేంద్రాల ఏర్పాటుకు అనువుగా లేవని మండల పరిషత్ అధికారులు నిర్మాణ పనులు చేపట్టలేదు. బుచ్చెయ్యపేటలో చెత్త నుంచి సంపద కేంద్రం నిర్మాణ పనులు పూర్తి కాగా, వడ్డాది, గున్నెంపూడి, ఎల్‌బీపీ.అగ్రహారం, తురకలపూడిలో పనులు జరుగుతున్నాయి. దీనిపై ఎంపీడీవో కొండలరావును వివరణ కోరగా స్థలాల కేటాయింపులో జాప్యం కారణంగా నిర్మాణాలు చేపట్టలేకపోయామన్నారు. కేటాయించిన స్థలాలు అనువుగా లేకపోవడంతో 27 పంచాయతీల్లో నిర్మాణాలు చేపట్టలేదన్నారు. అనువైన చోట స్థలాలు కేటాయిస్తే వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.



విద్యార్థులకు ప్రోత్సాహకాల అందజేత

రోలుగుంట : మండంలోని కొవ్వూరు గ్రామానికి చెందిన పవర్ యూత్ ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆ సంస్థ ప్రతినిధులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాకాలు అందజేశారు. 9.5 పాయింట్లు సాధించిన వై.భార్గవి దుర్గ, 9.3 పాయింట్లు సాధించిన ఎం.పూర్ణ, 9.2 పాయింట్లు సాధించిన మలసాల కుమారి, కరణం నాగమణిలకు సంస్థ అధ్యక్షుడు మలసాల గణేష్ ఆధ్వర్యంలో జ్ఞాపికలు, పుస్తకాలను అందజేశారు. అలాగే పాఠశాలకు వివేకానంద చిత్రపటాన్ని బహుమానంగా అందజేశారు. జడ్పీటీసీ సభ్యురాలు బోనంగి రామలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా నగదు పంపిణీ



బీమా నగదు అందజేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

బుచ్చెయ్యపేట : పేదలను చంద్రన్న బీమా ఆదుకుంటుందని సర్పంచ్ సుంకర సత్యనారాయణ తెలిపారు. బుచ్చెయ్యపేటకు చెందిన మేడిశెట్టి లక్ష్మి ఇటీవల చనిపోయింది. ఆమెకు చంద్రన్న బీమా కింద మంజూరై రూ.5 వేల తక్షణ సహాయాన్ని బుధవారం సర్పంచ్ సత్యనారాయణ ఆమె బంధువు గణేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గోవాడ షుగర్స్ డైరెక్టర్ డొంకిన అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పాతాళ శ్రీను, సుంకర భవానీ, సుంకర శ్రీను పాల్గొన్నారు.

నేడు మన గ్రామం-మన విశాఖ

రావికమతం: మండల కేంద్రంమైన రావికమతంలో గురువారం మన గ్రామం-మన విశాఖ కార్యక్రమం నిర్వహించనున్నామని ఎంపీడీవో జయప్రకాశరావు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి శివరాంప్రసాద్ హాజరుకానున్న ఈ కార్యక్రమంలో మండల స్థాయి అన్ని శాఖల అధికారులంతా విధిగా పాల్గొనాలన్నారు.

పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహావిష్కరణ



సరస్వతిదేవి విగ్రహాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శివయ్యనాయుడు

రావికమతం: సంపద ఉంటే సరిపోదని, వ్యక్తిత్వం గలవారే సేవా కార్యక్రమాల్లో ముందుంటారని గుమ్మళ్లపాడు సర్పంచ్ కె.శివయ్యనాయుడు అన్నారు. మండలంలో గుమ్మళ్లపాడు పాఠశాలలో ఆ గ్రామానికి చెందిన స్వర్గీయ అమరపల్లి రామునాయుడు, అతని భార్య రాములమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు రామజోగి నరసింగరావు సరస్వతిదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని బుధవారం సర్పంచ్ శివయ్యనాయుడు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నరసింగరావు దాతృత్వాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏడవ వేతన సవరణ బిల్లు అమలు చేయాలి

గ్రామీణ డాక్ సేవక్‌ల డిమాండ్



కొత్తకోట తపాలా కార్యాలయం వద్ద నిరసన గ్రామీణ డాక్ సేవక్‌లు

రావికమతం: తపాలా కార్యాలయాల్లో పనిచేస్తున్న తమకు 7వ వేతన సవరణ బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కొత్తకోట, రావికమతం శాఖ కార్యాలయాల వద్ద గ్రామీణ డాక్ సేవక్‌లు బుధవారం ధర్నా చేశారు. మండలంలోని కొత్తకోట శాఖ కార్యాలయం వద్ద బుధవారం కొత్తకోట పోస్టాఫీస్ పరిధిలోనున్న 12మంది జీడీఎస్‌లు ఈ ధర్నాలో పాల్గొన్నారు. సంఘ ప్రతినిధి పరవాడ నూకరాజుదొర మాట్లాడుతూ తపాలా శాఖలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం పీఆర్‌సీ అమలు చేస్తుందని, వారికంటే ముందే తామంతా ఆ శాఖలో చేరి ఎక్కువ సేవలు అందిస్తున్నామని అన్నారు. అయినా తమకు చాలీచాలని జీతాలు ఇస్తున్నారన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కమలేష్ చంద్ర కమిటీ సిఫారసును తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జీడీఎస్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైనప్పటికీ ప్రభుత్వం వారి సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. తమ న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం ఆమోదించే వరకూ ఆందోళన కొనసాగుతుందన్నారు. వజ్రపు నాగరాజు, పులిగ అచ్యుతరావు, రావికమతం శాఖ పరిధిలో ఎల్‌టి.అచార్యులు, బి.అమ్మాజీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అభివృద్ధి ఫలాలు : ఎమ్మెల్యే రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం: పట్టణంలో అన్ని వర్గాకు అభివృద్ధిఫలాలు అందించే లక్ష్యంతో ఉన్నామని ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు తె లిపారు. బుధవారం పట్టణంలో ఫిషర్స్‌మెన్ కాలనీలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న కల్యాణ మండపానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే దుడ్డువీధిలో కల్యాణ మండపం పూర్తయ్యే దశలో ఉందని, ఇతర ప్రాంతాల్లో కూడా వాటి నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించనున్నామని అన్నారు. గోవాడ షుగర్స్ ఛైర్మన్ గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, ఎంపీటీసీ సభ్యులు పొట్నూరు.మణితల్లి, ముడుసు గోవింద్, ఆస్పత్రి కమిటీ ఛైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, మాదిరెడ్డి జోగినాయుడు, సకల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 7 లోగా వ్యాక్సినేషన్ పూర్తిచేయాలి

రోలుగుంట : లక్ష్యాలకు అనుగుణంగా వైద్య సిబ్బంది పనిచేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి అన్నారు. బుధవారం బుచ్చెంపేట,రోలుగుంట ఆరోగ్యకేంద్రాలను ఆమె సందర్శించారు. వచ్చే నెల 7 లోగా మీజిల్స్-రూబెల్లా వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని ఆయా కేంద్రాల వైద్యాధికారులను ఆదేశించారు. ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రులోనే జరిగేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారులు జి.బాపిరాజు, కుసుమ మౌనిక తదితరులు పాల్గొన్నారు

రేపటి నుంచి ఐఏఎఫ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

రావికమతం: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ గ్రూప్ వై ఐఏఎఫ్ (ఎస్) ట్రేడ్ కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 18న, 19న విశాఖ సెట్విస్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపీడీవో జయప్రకాశరావు బుధవారం తెలిపారు. వచ్చే నెల 9న విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనురని, అందులో పాల్గొనేందుకు ఈ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారని పేర్కొన్నారు. ఇంటర్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఇంగ్లీష్‌లో 50 శాతం మార్కులు వచ్చిన అభ్యర్థులే ఈ ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. ఆసక్తి గలవారు తమ కుల, ఆదాయ, విద్యార్హతల అసలు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డుతో పాటు జెరాక్స్ సెట్‌ను తీసుకుని హాజరు కావాలని కోరారు.

ఉపాధి కోర్సులలో శిక్షణ

చోడవరం: ప్రముఖ ఐటీసీ ప్రధం కంపెనీల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కోర్సులలో శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఐటీసీ ప్రాంతీయ లీడర్ పీఎస్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. నిర్మాణరంగం, హెల్త్‌కేర్, బ్యూటీషియన్, ఆటోమోటివ్, ఎలక్ట్రీషియన్ కోర్సులలో శిక్షణ ఉంటుందని, శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 9581489837, 9849568169 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని కోరారు.

దుడ్డుపాలెంలో పొలం పిలుస్తోంది

చోడవరం: వరినాట్లు వేసేసమయంలో ఆకు చివర్లు తుంచి నాటుకుంటే తెగుళ్ల సమస్య నివారణ అవుతుందని మండల వ్యవసాయాధికారి ఈఆర్‌ఏ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని అడ్డూరు, దుడ్డుపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడతూ నాట్లు వేసే సమయంలో కాలిబాటలు దూరం దూరంగా ఉండేలా చూసుకుంటే కుదుళ్లకు గాలి, వెలుతురు ధారాళంగా అందుతాయన్నారు. ఏఈవోలు జగన్నాథం, రమణమూర్తి, సంతోష్‌కుమార్, గంగాభవానీ, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

స్కూల్‌బ్యాగుల పంపిణీ

చోడవరం: పట్టణంలోని ద్వారకానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి జొన్నాడ శ్రీనివాసరావు బుధవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. దళిత కులాల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వేచలపు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ టీచర్లకు సమాజంలో గుర్తింపు



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న శ్రీరాంపురం గ్రామస్థులు

గొలుగొండ: ఉత్తమ ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ సమాజంలో గుర్తింపు వుంటుందని ఎంఈవో జీఎమ్.నాగేంద్ర అన్నారు. బుధవారం మండలంలోని శ్రీరాంపురం గ్రామం నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు లక్ష్మీనర్సింహమూర్తి(నాగు)ను గ్రామస్థులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులను విద్యాపరంగా ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఎనలేని కృషి చేసిన ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పారేపల్లి నాగేశ్వరరావు, గొలుగొండ ఉపసర్పంచ్ రాయుపురెడ్డి రాంబాబు, గ్రామస్థులు రాయపురెడ్డి జమీలు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ రాయపురెడ్డి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొమిరలో మన గ్రామం-మన విశాఖ

గొలుగొండ: మండలంలో గురువారం కొమిర గ్రామంలో మన గ్రామం -మన విశాఖ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎమ్‌వీ. సువర్ణరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరై సమస్యలు గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.



వర్మీకంపోస్టు గుంతకు బిల్లు మంజూరు కాలేదని చెబుతున్న రైతు సీహెచ్.రాజుబాబు



బిల్లులు చెల్లించకపోవడంతో నిరుపయోగంగా ఉన్న గుంతను చూపిస్తున్న రైతు రుత్తల చినపోతురాజు

నిరుపయోగంగా వర్మీకంపోస్టు గుంతలు

- బిల్లులు చెల్లించక ఇబ్బందుల్లో రైతులు
- పట్టించుకోని అధికారులు

నాతవరం: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మించిన వర్మీకంపోస్టు గుంతలకు బిల్లులు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కొక్క వర్మీకంపోస్టు గుంతను రూ.19,466 వ్యయంతో రైతులు నిర్మించారు. ముందస్తుపెట్టుబడితో రైతులు నిర్మించుకున్న ఈగుంతలకు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు అధికారులు బిల్లులు చెల్లించకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

మండలంలోని గునిపూడి, చెర్లోపాలెం, జిల్లెడపూడి, వైడిపేట తదితర గ్రామాల్లో 400కు పైగా వర్మీకంపోస్టు గుంతలను నిర్మించారు. వీటిలో గెత్తం వేసి వానపాముల ద్వారా వర్మీకంపోస్టు ఎరువులను తయారుచేసి వుండగా బిల్లులు చెల్లించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి ఈ గుంతలకు బిల్లులను తక్షణమే చెల్లించాలని రైతులు కోరారు.

వచ్చేనెల 9న ఐఎఎఫ్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

నర్సీపట్నం రూరల్: యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న విజయవాడలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు కోఆర్డినేటర్ కె.వి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే వారు 1998-2001 మధ్య జన్మించి, ఇంటర్మీడియట్ పరీక్షలో 50 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ఈ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులకు ఉచిత శిక్షణ కూడా ఇస్తున్నట్టు ఆయన తెలిపారు.

యూత్ అధ్యక్షుడి నుంచి నన్ను తొలగించలేదు

పరవాడ కవిళేశ్వరావు



కృష్ణాదేవిపేట: వైసీపీ గొలుగొండ యూత్ అధ్యక్షుడిగా తనను తీసివేసినట్టు ఆదేశాలు రాలేదని పరవాడ కవిళేశ్వరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ గొలుగొండ మండల అధ్యక్షుడు రాయపురెడ్డి నాగేశ్వరరావు తనను వైసీపీ యూత్ అధ్యక్ష పదవి నుంచి తొలగించినట్టు చెప్పడం విడ్డూరంగా వుందన్నారు.

నేడు మరిడిమాంబ జాతర



కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలం ఏఎల్ పురం గ్రామదేవత అయిన మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పండగకు కొయ్యూరు, గొలుగొండ, నర్సీపట్నం, చింతపల్లి తదితర మండలాలతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. రహదారులు, భవనాల శాఖామంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు రానున్నారని నిర్వాహకులు తెలిపారు.

పేదలకే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు
- పెట్టుగోళ్లపల్లిలో గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

ఎస్.రాయవరం(నక్కపల్లి) : అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించడమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు చెప్పారు. బుధవారం మండలంలోని పెట్టుగోళ్లపల్లి గ్రామంలో దీపం పథకం కింద లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగ రహిత ఏపీగా తయారు చేయాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమన్నారు. ఇందుకోసం గ్రామాల్లో గ్యాస్ కనెక్షన్లు తక్కువ ధరకు ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. ఎస్.రాయవరం ఎంపీపీ ఏజర్ల వినోద్‌రాజు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పార్టీలకతీతంగా పథకాలను అందజేస్తున్నామని అన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన అప్పలరాజు, మత్స్యకార సొసైటీ జిల్లా అధ్యక్షుడు మాతా గుర్నాధరావు, టీడీపీ నాయకులు అల్లు నర్సింహమూర్తి, కురందాసు నూకరాజు పాల్గొన్నారు.


గ్యాస్ కనెక్షన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్సీ చలపతిరావు

గ్రామాల్లో గణపతి నవరాత్రుల ఉత్సవాల సందడి ప్రారంభం


ఉపమాకలో రాట వేస్తున్న దృశ్యం

నక్కపల్లి : గణపతి నవరాత్రులకు పలు గ్రామాలు ముస్తాబవుతున్నాయి. ఈ నెల 25 నుంచి తొమ్మిది రోజులపాటు ఉత్సవాలను గ్రామాల్లో వైభవంగా నిర్వహిస్తుంటారు. ఇందుకోసం బుధవారం పలు గ్రామాల్లో ఉత్సవాల శ్రీకారం చుడుతూ ఉత్సవ రాటలు వేస్తున్నారు. బుధవారం ఉపమాకలో మెరకవీధి రామాలయం వద్ద జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు కొప్పిశెట్టి కొండబాబు, మాజీ ఉప సర్పంచ్ ప్రగడ వీర్రాజు, గ్రామపెద్దలు కొప్పిశెట్టి వెంకటరమణ, సిద్దాబత్తుల కృష్ణ తదితరులు చవితి ఉత్సవ రాటను వేశారు. మండలంలోని రాజయ్యపేట,చందనాడ, ఎన్.నర్సాపురం, కాగిత, న్యాయంపూడి తదితర గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమాలు జరిగాయి. గురువారం ఉదయం మరికొన్ని గ్రామాల్లో ఉత్సవ రాట వేయడానికి ముహూర్తం నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మీగడ ఈశ్వరరావు, సిద్దాబత్తుల నూకతాత తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు రుణాల కోసం ఇంటర్వ్యూలు

కోటవురట్ల: మండలంలో ఎస్సీ, బీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 17,18 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్‌డీ ప్రభాకర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగు ఇంటర్వ్యూలకు కులధ్రువీకరణ పత్రాలు, ఆధార్, విద్యార్హత ధ్రువీకరణలతో పాటు వాటికి సంబంధించి రెండు జెరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. 17న స్టేట్ బ్యాంకు, డీసీసీబీ, ఏపీజీవీబీ, ఆంధ్ర బ్యాంకు సంబంధించిన అభ్యర్థులకు, 18న కొడవటిపూడి స్టేట్‌బ్యాంకు, పాములవాక, గుమ్మాలూరు, ఏపీజీవీబీ, నర్సీపట్నం బ్యాంకులకు సంబంధించిన అభ్యర్థులు హాజరు కావాలన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేయాలి

సాక్షర భారత్ కో-ఆర్డినేటర్ల సమావేశంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు

నక్కపల్లి : గ్రామీణ ప్రాంతంలో నిరక్షరాస్యతను నిర్మూలించడానికి కృషి చేయాలని ఎంపీడీఓ పిడుగు ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాక్షరభారత్ కో-ఆర్డినేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ నెల 20న జరగునున్న 15వ రౌండ్ ఎన్ఐఓఎస్ పరీక్షల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు అవసరమైన సామగ్రిని కో-ఆర్డినేటర్లకు ఆయన అందజేశారు. గతంలో నిర్వహించిన పరీక్షల్లో సీ గ్రేడ్ వచ్చిన వారు, డ్రాపౌట్లను గుర్తించి, వారికి ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు సాక్షర భారత్ మండల కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు చెప్పారు. మండల పరిధిలో 960 మంది అభ్యాసకులు పరీక్ష రాయనున్నారని, ఒక్కో పంచాయతీ పరిధిలో 30 మంది ఉన్నారని చెప్పారు.


పరీక్ష సామగ్రి అందజేస్తున్న దృశ్యం

నేడు కాగితలో 'మన గ్రామం మన విశాఖ'

నక్కపల్లి : మండలంలోని కాగితలో గురువారం 'మన గ్రామం-మన విశాఖ' కార్యక్రమం జరుగుతుంది. ఉదయం పది గంటల నుంచి ఈ గ్రామంలో అధికారుల బృందం పర్యటిస్తుంది. ఈ సందర్భంగా గ్రామసభలు నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుంటామని ఈవోఆర్డీ పీఎస్ కుమార్ చెప్పారు.



సిబ్బందికి ప్రశ్న పత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో నిర్మల

అక్షరాస్యతతోనే అభివృద్ధి

రాంబిల్లి : గ్రామాల్లో సాక్షరభారత్ కేంద్రాలను విధిగా తెరవాలని ఎంపీడీఓ నిర్మల అన్నారు. బుధవారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో సాక్షరభారత్ గ్రామ కోఆర్డినేటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోజనులను సంపూర్ణ విద్యావంతులుగా చేయాలన్నారు. అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమన్న విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. ఈ మేరకు విధిగా కేంద్రాలను తెరవాలని, బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. కేంద్రాలను తెరవడం లేదని ఫిర్యాదులు వస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. అనంతరం ఆమె సిబ్బందికి ఎన్ఐఓఎస్ ప్రశ్నపత్రాలు అందజేశారు.ఈ సమావేశంలో టీడీపీ మండల నాయకుడు కె. తిరుపతిరావు, సాక్షరభారత్ మండల కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'అంతా బ్రాంతియేనా' నాటక ప్రదర్శన



అంతా బ్రాంతియేనా నాటికలో ఓ సన్నివేశం

మునగపాక: కళారంగం ఎక్కడ ఆదరించబడుతుందో అక్కడ దేవతలు నాట్యం చేస్తుంటారని ప్రతీతి అని,నాటక రంగాన్ని ఆదరించడం వల్లే ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉందని రాష్ట్ర ఉత్తమ నాటక దర్శకుడు పిళ్లా సన్యాసిరావు అన్నారు. గ్రామీణ యువజనసాంస్కృతిక సంస్థ యువజన మందిరం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మునగపాకలో బళ్లారి రాఘవ అవార్డు గ్రహీత సన్యాసిరావును ఘనంగా సన్మానించారు. అనంతరం పెందుర్తి నటరాజ క్రియేషన్స్ వారితో పిళ్లా సన్యాసిరావు దర్శకత్వం వహించిన 'అంతా బ్రాంతియేనా' నాటిక ప్రదర్శించారు. అత్యాశకు పోయి స్కీమ్‌లు, చీటీల పేరుతో మోసపోవద్దని ఈ నాటిక ద్వారా సందేశం ఇచ్చారు.అనంతరం మునగపాక నుంచి ఇటీవల ఎస్ఐగా ఎంపికైన యువకుడిని, ఎంబీబీఎస్‌కు ఎంపికైన విద్యార్థిని, ఐఐటీకి ఎంపికైన విద్యార్థులను సత్కరించారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఎలమంచిలి రూరల్ : మండలంలోని పులపర్తి, క్రిష్ణాపురం గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీఓ సందీప్ బుధవారం పరిశీలించారు. రెండు గ్రామాలను దత్తత తీసుకున్న ఆయన వీధుల్లో ఎక్కడా చెత్త లేకుండా పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు.ఈ మేరకు ఆయా గ్రామాల్లో కొద్ది రోజులుగా జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.ఆయనతో పాటు కార్యదర్శి ఈశ్వరరావు, సర్పంచ్ ఈటి వెంకట పద్మావతి, ఉప సర్పంచ్ కొలగాని నాగేశ్వరరావును ఉన్నారు.

పోస్టుకార్డు ఉద్యమం

కశింకోట రూరల్ :ఉత్తరాంధ్ర జిల్లాలకు సాగు నీరందించే సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు తక్షణం ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిశోర్ ఆధ్వర్యంలో బుధవారం పోస్టు కార్డు ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొణతాల రామకృష్ణ పిలుపుమేరకు ఈ ఉద్యమం చేపడుతున్నామన్నారు.

- అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు విస్తరణ చేపట్టాలని ప్రయాణికుల డిమాండ్
- గంటన్నర పాటు రహదారిపై రాస్తారోకో
- రోడ్డుకి ఇరువైపులా స్తంభించిన ట్రాఫిక్



స్తంభించిన ట్రాఫిక్

ఇంకెన్నాళ్లీ కష్టాలు..?

మునగపాక : అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డును తక్షణమే విస్తరించాలని డిమాండ్ చేస్తూ ప్రయాణికులు బుధవారం మునగపాక మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. దీంతో రహదారికి ఇరువైపులా పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ఉదయం పదిన్నర నుంచి 11 గంటల వరకు ఈ ఆందోళన కొనసాగింది. ఏఎన్‌వీ మహేష్, పీపీసీఎస్ అధ్యక్షుడు టెక్కలి వీరకొండలరావు, దాడి సాంబశివ, ఆడారి సూరిబాబు, దాడి పోలీస్, భీశెట్టి కోటేశ్వరరావు, దాడి భీమునాయుడు తదితరులు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఏఎన్‌వీ మహేష్, దాడి సాంబశివరావు మాట్లాడుతూ ఇటీవల ఈ రహదారిలో ట్రాఫిక్ పెరిగిపోవడం, భారీ వాహనాలు తిరగడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రాణాలతో చెలగాట మాడకుండా తక్షణమే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే భారీ ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇంతలో ఏఎస్ఐ మణికుమారి, హెచ్‌సీలు దొర, రమణమూర్తి తదితరులు ఆందోళన వద్దకు వచ్చి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారు.



రోడ్డుపై బైఠాయించిన ప్రయాణికులు

యువత క్రీడల్లో రాణించాలి



యువకులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న గొన్నబత్తుల శివ

ఎలమంచిలి రూరల్ : యువత క్రీడల్లో రాణించి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని గ్రామీణ స్వచ్ఛంద సేవా ట్రస్టు చైర్మన్ గొన్నాబత్తుల శివ అన్నారు. పద్మనాభరాజుపేట, బయ్యవరం గ్రామాలకు చెందిన యువకులకు ఆ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వాలీబాల్ కిట్లు, షెటిల్ కిట్లు, కబడ్డీ తదితర క్రీడా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనీయర్ నేత ఎడ్ల నారాయణరావు, ట్రస్టు సభ్యులు శానా నానాజీ, జోగారావు, మొగ్గా సతీష్, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

చూచుకొండకు ఆర్‌టీసీ సర్వీసు

మునగపాక/అచ్యుతాపురం రూరల్ : అనకాపల్లి నుంచి చూచుకొండకు ఆర్‌టీసీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించారు.బుధవారం నుంచి రోజుకు నాలుగు సర్వీసులతో బస్సును ప్రారంభించారు. ప్రయాణికులు లేక ఐదేళ్ల క్రితం ఈ సర్వీసును ఆర్‌టీసీ యాజమాన్యం నిలిపివేసింది. దీంతో పదిగ్రామాల ప్రజలకు ప్రయాణ కష్టాలు మొదలయ్యాయి. ఈ విషయమై పలుమార్లు వారు ఫిర్యాదు చేసినా..యాజమాన్యం స్పందించలేదు. అప్పటి నుంచి ప్రయాణికులు ప్రైవేటు వాహనాలు, ఆటోలను ఆశ్రయించి ప్రమాదాల బారిన పడటం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో మావూరి కోసం సంస్థ ఆధ్వర్యంలో చూచుకొండ,ఎం.జగన్నాథపురం గ్రామస్థులు పట్టుబట్టడంతో యాజమాన్యం వారికి కొన్ని బాధ్యతలు అప్పగించింది. వనిత కార్డులు చేయిస్తే బస్సు పునరుద్ధరిస్తామని చెప్పడంతో గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన 300 వరకూ కార్డులు చేయించారు. త్వరలో ఉదయం, సాయంత్రం వేళల్లో కేవలం విద్యార్థుల కోసం మరో స్కూల్ బస్సు కూడా ఏర్పాటు చేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది.తమ గ్రామాలకు బస్సు సౌకర్యం పునరుద్ధరించడం పట్ల ఎం. జగన్నాథపురం సర్పంచ్ కరెడ్ల ప్రకాష్, ఉప సర్పంచ్ చిన్నయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పీలా కాసుబాబు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. కాగా బస్సు అనకాపల్లి నుంచి ఉదయం ఆరున్నర గంటలకు, ఎనిమిదిన్నర, సాయంత్రం నాలుగు గంటలు, ఐదు గంటల 50 నిమిషాలకు బయలుదేరుతుంది. అలాగే చూచుకొండ ఉదయం ఏడున్నర, 9.20నిమిషాలకు, సాయంత్రం ఐదు గంటలకు, ఆరు గంటల 40 నిమిషాలకు బయలుదేరుతుంది.



ఆర్‌టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్న సర్పంచ్, తదితరులు



తమ్మిరాజుకు స్వీటు తినిపిస్తున్న ఎంపీపీ మంజు

ఘనంగా 'మావూళ్లో గ్రంథాలయం' తొమ్మిదవ వార్షికోత్సవం

మునగపాక : పాటిపల్లి, మంగళవరపుపేట గ్రామాల్లో మంగళవారం రాత్రి మావూళ్లో గ్రంథాలయం తొమ్మిదవ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల పదవీ విరమణ పొందిన ఆడారి దక్షిణామూర్తి, మొల్లేటి సత్యనారాయణను నిర్వాహకులు సన్మానించారు. అలాగే టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్పందించే హృదయం సంస్థ చైర్మన్, విశ్రాంత ఎంఈవో తమ్మిరాజు జన్మదిన వేడుకలను కూడా ఇదే కార్యక్రమంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆడారి మంజు, ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, మావూళ్ళో గ్రంథాలయం నిర్వాహకులు ఏవీఎన్ మూర్తి, బి. ధనశ్రీను, యల్లపు సంజీవరావు, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, సర్పంచ్ రమణబాబు పాల్గొన్నారు.

వెదురువాడలో ఎమ్మెల్యే నివాసం



అచ్యుతాపురం రూరల్ : ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు బుధవారం రాత్రి కొత్త ఇంట్లో దిగనున్నారు. ఈ మేరకు ఆయన వెదురువాడలో కొత్తగా ఇల్లు కట్టుకున్నారు. స్థానికేతరుడు అన్న అపవాదును తొలగించుకొనేందుకు ఎన్నికల్లో తాను ఎలమంచిలిలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటానని ప్రజలకు చేసిన వాగ్ధానం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

రాంబిల్లి : హరిపురం గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకలు బుధవారంతో ముగిశాయి. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు, ఎలమంచిలి ఏఎంసీ అధ్యక్షుడు దూళి రంగనాయకులు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ మేరకు చివరి రోజు శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం రెండు వేల మందికి అన్నసమారాధన జరిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



రాంబిల్లి : మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ కుమార్‌స్వామి హెచ్చరించారు. బుధవారం ఆయన ఇక్కడి విలేఖరులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో సెజ్, నేవల్‌బేస్ ఏర్పాటుతో వాహనాలు రద్దీ పెరిగిందన్నారు. రాంబిల్లిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వాహనచోదకులు మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదన్నారు.ప్రతి ఒక్కరూ విధిగా లైసెన్‌తో పాటు వాహనానికి సంబంధించి అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు.

పొలానికి పోలేం.. రాలేం..?

- నాలుగు గ్రామాల రైతులకు రహదారి సమస్య
- చెరువు గట్టుపై నిర్మించారంటూ మధ్యలో తవ్వేసిన ఇరిగేషన్ అధికారులు
- పంచాయతీ తీర్మానంతోనే చేపట్టామంటున్న రైతులు
- పునర్నిర్మాణానికి వేడుకోలు


రహదారిని పునర్నిర్మించాలని కోరుతున్న రైతులు


ఇరిగేషన్ అధికారులు రహదారికి మధ్యలో తీసిన గొయ్యి

కొత్తూరు : మండలంలోని సుందరయ్యపేట, అచ్చియ్యపేట, మొండుపాలెం, వేటజంగాలపాలేలకు చెందిన సుమారు 70 మంది రైతులు తమ పంట పొలాలకు వెళ్లి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటి వరకు వీరికి అనువుగా ఉన్న రహదారికి అనుమతులు లేవంటూ ఇరిగేషన్ అధికారులు మధ్యలో తవ్వేశారు. దీంతో వారి అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. సుందరయ్యపేట పంచాయతీ శివారు మొండుపాలెంలో కొందరు రైతులు చెరువు గట్టుపై నుంచి రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. పొలాలకు చేరుకోవడానికి, పొలాల నుంచి ఫలసాయం ఇళ్ల తెచ్చుకోవడానికి వీలుగా క్వారీ, క్రషర్ యాజమానులతో కలిసి రహదారిని నిర్మించుకుంటామని పంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఇందుకు పంచాయతీ తీర్మానం చేసింది. అయితే రహదారిని నిర్మించుకునేంత స్థోమత లేకపోవడంతో రైతులు క్వారీ, క్రషర్ యాజమానులతో చర్చించి కొంతమంది రహదారికి అవసరమైన తమ భూములను ఇచ్చారు. దీంతో రహదారి నిర్మాణం పూర్తయ్యింది.

సిట్‌కు అందిన ఫిర్యాదుతో కదిలిన అధికారులు

ఇదిలావుండగా, గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అక్రమంగా చెరువు గట్టుపైన, గ్రామ కంఠంలో నుంచి రహదారి నిర్మించారంటూ సిట్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. తమ అవసరాల మేరకు గ్రామ కంఠంలో నుంచి రహదారిని నిర్మించామని రైతులు తహసీల్దార్ బి.సత్యనారాయణకు వివరించారు. దీనిపై ఉన్నాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పి ఆయన ఇక్కడి నుంచి వెళ్లారు. అయితే ఇరిగేషన్ అధికారులు చెరువు గట్టుపై రహదారి నిర్మాణానికి అనుమతులు లేవని పేర్కొంటూ రహదారికి అడ్డంగా వారం క్రితం గోతులు తీశారు. ఫలితంగా సుందరయ్యపేట, అచ్చియ్యపేట, మొండుపాలెం, వేటజంగాలపాలేలకు చెందిన రైతులు సుమారు డబ్బై మంది అవస్థలు పడుతున్నారు.

అనుమతులు లేనందునే తొలిగించాం

ఎటువంటి అనుమతులు లేకుండా మొండిపాలెంలో చెరువు గట్టుపై రహదారిని నిర్మించారు. ఈ కారణంగానే రహదారిని తొలగించాం. గతంలో రహదారి నిర్మిస్తున్నారని తెలిసినప్పుడు చెరువు గట్టుపై రహదారి నిర్మాణానికి అనుమతులు తప్పనిసరి అని తెలియజేశాం. సిట్ ఫిర్యాదుతో జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్య వెళ్లింది. దీంతో రహదారిని తొలిచివేయాల్సి వచ్చింది. రైతులకు వ్యవసాయ అవసరాలకు రహదారి కావాల్సినప్పుడు కలెక్టర్ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి.

- కేవీ రామకృష్ణ, ఏఈ ఇరిగేషన్, అనకాపల్లి

పొలానికి వెళ్లడానికి రహదారి కరువైంది



పంట పొలాలకు వెళ్లి వచ్చేందుకు అనువుగా చెరువు గట్టుపై రహదారిని నిర్మించుకున్నాం. ఇంతభారాన్ని మోసే పరిస్థితి లేకపోవడంతో క్వారీ, క్రషర్ యాజమానులతో మాట్లాడి ఈ రోడ్డు వేశాం. ఇప్పుడేమో ఇరిగేషన్ అధికారులు వచ్చి రహదారికి అనుమతులు లేవంటూ అడ్డంగా గొయ్యి తవ్వేశారు. ఉన్నతాధికారులు మా సమస్యపై స్పందించాల్సిందిగా కోరుతున్నాం.

- తేలపోలు అప్పారావు, రైతు, మొండిపాలెం

రహదారిని పునర్నిర్మించాలి



పొలాలకు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు ఎదురవుతుండడంతో ఈ రోడ్డును నిర్మించుకున్నాం. ఈ పనులు చేపట్టేంత ఆర్థిక స్థితి లేకపోవడంతో పంచాయతీ అనుమతితో క్వారీ, క్రషర్ యజమానుల ద్వారా ఈ పనులు చేపట్టాం. ఇది మాకు చాలా సౌకర్యవంతంగా ఉంది. ఇరిగేషన్ అధికారులు తవ్వేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి రహదారిని పునర్నిర్మించాలి.

- బి.రాజు, రైతు, సుందరయ్యపేట

పంచాయతీ తీర్మానంతోనే నిర్మించారు



సుందరయ్యపేట పంచాయతీలో తీర్మానం చేసి గ్రామ కంఠం నుంచి రహదారిని నిర్మించామని గ్రామ రైతులు తెలిపారు. తీర్మానం కాపీని కూడా చూశాను. గ్రామ కంఠంలో నుంచి కొంతమేర రహదారి నిర్మాణానికి ఉపయోగించడం వాస్తవం. ఇదే వివరాలతో సిట్ ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. రైతులు తమ గోడును లిఖిత పూర్వకంగా జిల్లా కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు తెలియజేయాలి.

- బి.సత్యనారాయణ, తహసీల్దార్, అనకాపల్లి

'సుజల స్రవంతి' ప్రారంభానికి పోస్టుకార్డు ఉద్యమం


నూతనగుంటపాలెంలో పోస్టు కార్డుల ప్రదర్శన

కశింకోట రూరల్ : ఉత్తరాంధ్ర జిల్లాలకు సాగు నీరందించే సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు తక్షణం ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిశోర్ ఆధ్వర్యంలో బుధవారం పోస్టు కార్డు ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పిలుపుమేరకు ఈ ఉద్యమం చేపడుతున్నామన్నారు. ఉత్తరాంధ్రలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలని, గోదావరి నదితో ఉత్తరాంధ్రలో ఉన్న నదులన్నింటినీ అనుసంధానం చేయాలని కోరారు. ఎన్‌జీపాలెం సర్పంచ్ కడిగట్ల బాపునాయుడు, నర్సింగబిల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు కడిగట్ల సింహాద్రిరావు, పిట్టా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు ఘన సత్కారం

కశింకోట రూరల్ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విశాఖలో మంగళవారం జరిగిన వేడుకల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, హోం మంత్రి చినరాజప్ప కశింకోట మండలానికి చెందిన పలువురు అధికారులను ప్రశంసించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్ఐ మధుసూదనరావు, ఏపీవో శ్రీనువాసరావు, బయ్యవరం ఏఎన్ఎం శివకుమారిలకు ఉత్తమ సేవా పురస్కారాలను అందజేశారు. వీరిని అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు బుధవారం అభినందించారు.


ఉత్తమ పురస్కారం అందుకుంటున్న ఎస్ఐ మధుసూదనరావు

జార్జిక్లబ్ ఆధ్వర్యంలో..


ఏఎస్ఐ బోడిరాజును సత్కరిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్ : ఉత్తమ సేవలందించిన పోలీసులను స్థానిక జార్జిక్లబ్ సత్కరించింది. క్లబ్ ఆవరణలో జరిగిన ఈ వేడుకల్లో వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు పట్టణ సీఐ సంపతిరావు విద్యాసాగర్ బహుమతులు అందించారు. ఇందులో భాగంగా పట్టణ పోలీసు స్టేషన్‌లో ఉత్తమ సేవలందిస్తున్న ఏఎస్ఐ బోడిరాజు, హెడ్‌కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ కిరణ్‌లను సీఐ సమక్షంలో క్లబ్ అధ్యక్షుడు కొణతాల మురళీకృష్ణ, కార్యదర్శి మళ్ల సూరిబాబులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల రామచంద్రరావు, బుద్ద శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సెన్సార్ బోర్డు సభ్యుడిగా బుదిరెడ్డి చిన్నా

కశింకోట రూరల్ : తాళ్లపాలేనికి చెందిన బుదిరెడ్డి చిన్నా సెన్సార్ బోర్డు సభ్యుడుగా నియామకమయ్యాడు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. తనకు ఈ పదవిని కట్టబెట్టినందుకు చిన్నా ఎంపీకి, పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.


సెన్సార్‌బోర్డు నియామక పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

31 వరకు వనిత కార్డు మేళా

- ఈ విధానంతో తెల్లకార్డుదారులకు మేలు
- ప్రయాణికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి
- ఆర్టీసీ డీఎం ప్రవీణ



అనకాపల్లి టౌన్ : ఆర్టీసీలో వనిత కార్డు మేళా నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ వి.ప్రవీణ తెలిపారు. బుధవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఈ నెల 31 వరకు చేపడతామన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న వారెవరైనా వంద రూపాయలు చెల్లించి వనిత కార్డు తీసుకోవచ్చన్నారు. కార్డు పొందినవారు ఆర్టీసీలో ప్రయాణం సాగించినప్పుడు టిక్కెట్ ధరలో పది శాతం సబ్సిడీ పొందవచ్చన్నారు. ఇన్సూరెన్స్ సదుపాయం కూడా ఉంటుందన్నారు.

కండీషన్‌లో లేని అద్దె బస్సుల స్థానే సంస్థ బస్సులు

కండీషన్‌లో లేని అద్దె బస్సులను తిప్పడానికి అనుమతించేది లేదన్నారు. అనకాపల్లి డిపోలోని 33 అద్దె బస్సులలో ఎనిమిది బస్సులు కండీషన్‌లో లేనట్లు గుర్తించామని, వాటి స్థానంలో సంస్థ బస్సులను నడుపుతున్నామన్నారు. ఎ.కొత్తపల్లి, కింతలి, పాయకరావుపేట, విజయనగరం ప్రాంతాలకు నడిచే అద్దె బస్సుల స్థానంలో ఆర్టీసీ బస్సులను నడుపుతున్నామన్నారు.

విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు

అనకాపల్లి-తాళ్లపాలెం గ్రామాల మధ్య బుధవారం నుంచి మరో బడి బస్సును అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు చెప్పారు. విద్యార్థుల సౌకర్యార్థం చోడవరం రెండు, అచ్యుతాపురం రెండు,నక్కపల్లి, దేవరాపల్లి, రావికమతం, పూడిమడక, దేవరాపల్లిలకు ఒకొక్క బడి బస్సులనునడుపుతున్నామన్నారు.

అనకాపల్లి- సబ్బవరం వయా పెందుర్తి మీదుగా బస్సు!

అనకాపల్లి- సబ్బవరం వయా పెందుర్తి మీదుగా విశాఖపట్నానికి బస్సు నడిపే ప్రతిపాదన ఉందన్నారు. ఇది ఆర్ఎం పరిధిలో ఉందని, దీనిపై రూట్ సర్వే కూడా జరిపిస్తారన్నారు. బస్సు ప్రయాణంలో కనీస చార్జీ ఐదు రూపాయలు చేయడం వల్ల కొన్ని రూట్లలో ఆదాయం బాగుందని చెప్పారు.